అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 09-4-2024 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 49 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



నాపై కుట్ర జరుగుతోంది

నన్ను కింద పడేయాలని చూస్తున్నారు

- ముఖ్యమంత్రి రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- కొడంగల్ నా గుండె చప్పుడు
- వంశీ చందర్‌రెడ్డిని గెలిపిస్తే మీ సిపాయిలా పనిచేస్తాడు : పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీఎం

నవతెలంగాణ-కొడంగల్, పరిగి

"రేవంత్‌రెడ్డిని దెబ్బతీయడానికి వెనుక గూడుపుఠాణి చేస్తున్నారు. నాపై కుట్ర జరుగుతోంది. నన్ను కింద పడేయాలని బీఆర్ఎస్, బీజేపీ చూస్తున్నాయి. మనల్ని దెబ్బతీయడానికి పన్నాగాలు పన్నుతున్నాయి. ఇది రేవంత్‌రెడ్డిని దెబ్బతీయడం కాదు.. కొడంగల్ అభివృద్ధిని దెబ్బతీయడమే. కొడంగల్ నుంచి 60 ఏండ్ల కిందట అచ్యుతరెడ్డి మంత్రి అయ్యారు. మళ్లీ ఆ తర్వాత లేరు. కొడంగల్ నుంచి గెలిచిన నాకు సోనియాగాంధీ ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చారు. 100 రోజుల్లో కొడంగల్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం కొడంగల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కొడంగల్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో నిర్వహించారు. మండలాల వారీగా సమావేశం నిర్వహించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి వంశీచంద్ రెడ్డి, ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, కొడంగల్ నియోజకవర్గ ...2లో

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ ఉగాది శుభాకాంక్షలు 3లో..

కేసీఆర్, భట్టి సహా పలువురి విషెస్..





ఎండల్లో ఎన్నికలు

భానుడి భగభగల మధ్య నిర్వహణ ఎలా..?

- గరిష్ట ఉష్ణోగ్రతలు తప్పవంటున్న వాతావరణ విభాగం
- వడగాలులల తీవ్రతా అధికమే
- ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ నెల19తో ప్రారంభమయ్యే ఓట్ల పండుగ జూన్ 1వ తేదీ వరకూ కొనసాగుతుంది. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడూ వేసవిలోనే వస్తుంటాయి. అయితే ఈ ఏడాది సగటు ఉష్ణోగ్రతల కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఈ కాలంలో 10 నుండి 20 రోజుల పాటు వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రతి వేసవిలో నాలుగు నుండి ఎనిమిది రోజుల పాటు మాత్రమే వడగాలులు వీస్తుంటాయి. ఈసారి ఆ ప్రమాదం మరింత అధికంగా ఉంది. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఎవరేమైతే నాకేమిటంటూ ఎన్నికల నిర్వహణకు సిద్ధ పడుతోంది. వాతావరణ శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మాత్రం అడ్వైజరీలు జారీ చేస్తూ కాలక్షేపం చేస్తున్నాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ అయితే ఆ పని కూడా చేయడం లేదు.

వేసవి ప్రభావం తప్పదు

ఈ నెల 19న తొలి దశలో, 26న రెండో దశలో పోలింగ్ జరుగుతుంది. ఈ రెండు దశలపై వేసవి ప్రభావం తప్పదని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ రెండు దశల్లోనూ ఉత్తర, పశ్చిమ, మధ్య భారతంలోని పలు నియోజకవర్గాల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. పోలింగ్ తేదీ నాడు ఈ ప్రాంతాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుందని అంచనా. ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కేవలం అడ్వైజరీలు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నాయి. ఈ నెల 19న 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ...10లో


స్పందించని ఈసీ

అడ్వైజరీలతో కాలక్షేపం చేస్తున్న ఐఎండీ, ఎన్‌డీఎంఏ

మండు వేసవిలోనూ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో తలమునకలై పోతున్నారు. ఓటర్లు సైతం ఎండను లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో రాజకీయ ర్యాలీలు, సభలకు హాజరవుతున్నారు. ఓటింగ్ రోజు అయితే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడం తప్పనిసరి. ఇవన్నీ ప్రమాదంతో కూడుకున్నవే. తీవ్రమైన వేసవి పరిస్థితుల్లో మన దేశం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నదా అనేదే ఇక్కడ ప్రశ్న

అడ్వైజరీలతో సరి

వాతావరణ అంచనాలపై ఎన్నికల కమిషన్‌కు ఐఎండీ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) అడ్వైజరీలు పంపాయి. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకూ బయటకు రావద్దని సూచించాయి. అయితే ఎన్నికల సన్నాహాలపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎలాంటి సూచనలు అందజేయలేదు. వేసవి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రచారం నిర్వహిస్తే బాగుంటుందని పార్టీల కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ నాయకులు సైతం ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రచార సభలు నిర్వహిస్తున్నారు.



41 శాతం స్థానాల్లో నేరచరితులు

మనీ,క్రైమ్ రికార్డుల్లో బీజేపీ అభ్యర్థులే టాప్ :ఏడీఆర్ నివేదిక

వివరాలు 2లో

ఈసీ విశేషాధికారాలతో ఐటీ అధికారులను ఆదేశించాలి



సీపీఐ(ఎం) త్రిస్సూర్ జిల్లా శాఖ ఖాతా స్తంభనపై సీఈసీకి సీతారాం ఏచూరి లేఖ

న్యూఢిల్లీ : త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను దెబ్బతీసే లక్ష్యంతో, దుష్ట తలంపుతో సీపీఐ(ఎం) త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ అకౌంట్‌ను స్తంభింపచేశారని, ఐటీ నోటీసులు జారీ చేశారని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు అభ్యంతరకరమైన ఈ ...11లో

కవితకు బెయిల్ నిరాకరణ



- కొడుకు పరీక్షలు సరైన కారణం కాదు : ట్రయల్ కోర్టు
- ప్రభావితం చేయలేరని నమ్మలేమని ఉత్తర్వులో వెల్లడి

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు (ట్రయల్ కోర్టు) మధ్యంతర బెయిల్ నిరాకరించింది. ఈ బెయిల్ పై ఈడీ చేసిన అభ్యంతరాలు, కోర్టులో పేర్కొన్న ఆధారాలు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. పిల్లల పరీక్షలకు సంబంధించిన ఆందోళనను పరిష్కరించడానికి తల్లినే సరైన ప్రత్యామ్నాయం అన్న 'బలవంతపు కారణం'తో కవితకు ...2లో

'జైల్ కా జవాబ్ ఓట్ సే'

ఆప్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



న్యూఢిల్లీ : ఆప్ సరికొత్త థీమ్‌తో ఎన్నికల ప్రచారానికి సోమవారం శ్రీకారం చుట్టింది. కేజ్రీవాల్‌ను జైలుకు పంపినందుకు ఓటుతో సమాధానం చెప్పండంటూ "జైల్ కా జవాబ్ ఓట్ సే" ప్రచారాన్ని ప్రారంభించింది. 'ఆప్' ...11లో

94 మంది జల సమాధి

మొజాంబిక్ సముద్రంలో పడవ మునకతో విషాదం

మొజాంబిక్ (ఆఫ్రికా) : కలరా భయంతో ప్రధాన భూభాగాన్ని వీడేందుకు పడవలో బయల్దేరిన 94 మంది ఆ పడవ సముద్రంలో మునిగిపోవడంతో మరణించిన విషాద ఘటన ఆఫ్రికాలోని మొజాంబిక్‌లో జరిగింది. మరో 26 మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. మొజాంబిక్ ఉత్తర తీర ప్రాంత సుముద్రంలో మత్స్యకార పడవ మునిగిపోవటంతో ఈ ప్రమాదం జరిగిందని, ప్రమాద సమయంలో పడవలో 130 మంది ఉన్నారని చెప్పారు. అధిక సంఖ్యలో ప్రయాణికులను ...11లో

మేడిగడ్డపై న్యాయ విచారణ చేపట్టాలి

రైతులకు నష్టం జరగకుండా చూడాలి

- ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- నిజానిజాలను ప్రజల ముందుంచాలి : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, నాగయ్య, జూలకంటి
- ప్రాజెక్టును పరిశీలించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ బృందం



నవతెలంగాణ-భూపాలపల్లి

రాష్ట్రంలో ప్రధానంగా చర్చనీయాంశమైన కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నిర్మాణ లోపంపై న్యాయ విచారణ చేపట్టాలని, రైతులకు నష్టం జరగకుండా చూడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (కాళేశ్వరం) ...11లో



హైదరాబాద్‌కు కాళేశ్వరం జలాలు

కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేసినా... కండ్ల ముందే ప్రయోజనాలు :కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కాళేశ్వరం ప్రాజెక్టుపైన ఎన్నో రకాల అసత్య ప్రచారాలు చేస్తున్నా ఆ ప్రాజెక్టు ప్రయోజనాలు కండ్ల ముందే కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ట్వీట్ చేశారు. కాళేశ్వర ప్రాజెక్టులో భాగంగా ...11లో

ఐరీస్ తిప్పలు..!

యాసంగి సీజన్‌లో కొత్త విధానం

- మార్కెట్‌కు వచ్చి విక్రయించాలనే షరతుతో రైతులకు ఇబ్బందులు
- కౌలు రైతు ఒప్పంద వివరాలు చూపడం కష్టం
- గత విధానం వల్ల కొన్ని చోట్ల బినామీల పేరిట అక్రమాలు
- దళారుల్ని అరికట్టేందుకే..: డీసీఎస్ఓ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం కొనుగోలు విధానంలో కొత్తగా తీసుకొచ్చిన ఐరీస్ పద్ధతి రైతులకు తలనొప్పిగా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. ఈ యాసంగి సీజన్ నుంచి కొత్తగా ఐరీస్ విధానం తీసుకొచ్చారు. ఐరీస్ పద్ధతి వల్ల పండించిన రైతులే మార్కెట్‌కు వచ్చి ధాన్యాన్ని విక్రయించాలి. అప్పుడే అతని ఐరీస్ నమోదు ...11లో



కాంగ్రెస్ ఐదేండ్ల పాటు అధికారంలో ఉన్న రాష్ట్రాలు తక్కువే

- రాష్ట్రంలో ఎన్ని రోజులు ఉంటుందో తెలియదు : సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలు
- కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధిప్పాలని పిలుపు
- పదేండ్లలో ఒక్క హామీని కూడా నెరవేర్చని మోడీ..

నవ తెలంగాణ - సిద్దిపేట

"కాంగ్రెస్ పార్టీ ఐదు సంవత్సరాలకు మించి అధికారంలో ఉన్న రాష్ట్రాలు చాలా తక్కువ. కొన్ని రాష్ట్రాల్లో సెల్ఫ్‌గోల్స్‌తో ఐదు సంవత్సరాల కంటే ముందే అధికారం కోల్పోయింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రోజులు ఉంటుందో తెలియదు. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది మేమే" అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం సిద్దిపేటలో జరిగిన మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నా బలం.. బలగం యువతే.. వారు తలచుకుంటే సాధ్యం కానిదేమీ ఉండదని హరీశ్‌రావు అన్నారు. ఢిల్లీలో తెలంగాణ గొంతు వినిపించడానికి మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుందామని తెలిపారు. ఎన్నికల హామీల అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు, ధరలతోపాటు నిరుద్యోగాన్ని పేదరికాన్ని పెంచిన బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు.. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఒక్క పరీక్షనైన నిర్వహించారా, మా హయాంలో ఉద్యోగాలు వొస్తే మీరుగా చెప్పుకుంటారా అని ప్రశ్నించారు. తెలంగాణ వద్దు అంటూ తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్ ఈ రోజు సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

నల్లధనం తెస్తానని, దేశవ్యాప్తంగా ఉద్యోగాలు ఇస్తామని, ఎన్నో వాగ్దానాలు చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, మోడీ అందులో ఒకటైన నెరవేర్చరా అని ప్రశ్నించారు. జిల్లాలు రద్దు చేస్తానంటున్న రేవంత్ కు ఓట్లు రద్దు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ పి వెంకట్రామరెడ్డి పాల్గొన్నారు.

చివరి దశలో పంటలెండుతున్నాయ్..

- ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి ఆదుకోవాలి : రైతుల రాస్తారోకో



నవతెలంగాణ - చొప్పదండి

చివరి దశలో నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయి.. వెంటనే ఎస్ఆర్ఎస్పీ ప్రధాన కాలువ నుంచి డీ-86, డీ-87 కాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల కేంద్రం సమీపంలోని డీ-87 కాలువ వద్ద ప్రధాన రహదారిపై కొలిమికుంట, చాకుంటా, వెదురుగట్ట, చొప్పదండి గ్రామాల రైతులు సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న పంటలు చివరి దశలో నీళ్లలేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గత సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీ వరకు ఎస్సారెస్పీ నీళ్ల వచ్చాయన్నారు. ఈ ఏడాది అధికారులు నీళ్ల విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చివరి దశలో ఉన్న పంట పొలాలను కాపాడేందుకు ఉన్నతాధికారులు స్పందించి.. చివరి మడి వరకు ఎస్ఆర్ఎస్పీ మెయిన్ కెనాల్ నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎస్ఐ ఉపేంద్రచారి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడే ప్రయత్నం చేయగా.. ఎమ్మెల్యే, కలెక్టర్ రావాలని నినాదాలు చేశారు. ఎస్ఐ రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

మార్చినెల జీతాలను తక్షణమే చెల్లించండి

- మే అంతా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు సెలవులివ్వండి : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ వినతి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు మార్చినెలకు సంబంధించిన జీతాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల యూనియన్ (సీఐటీయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మే నెలంతా వారికి ఒకేసారి సెలవులివ్వడంపై తొందరగా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె సునీత, ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి, కోశాధికారి పి మంగ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల ఎనిమిదో తేదీ వచ్చినా గతనెల వేతనాలు ఇంకా రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగాది, రంజాన్ పండుగలున్నాయని వివరించారు. పండుగల నేపథ్యంలో వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలు అవీ సకాలంలో రాకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకపూట బడిని నిర్ణయిస్తూ సర్క్యులర్‌ను జారీ చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

వచ్చేనెలంతా సెలవులు ఇవ్వడంపైన ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అసంతృప్తికి గురవుతున్నారని తెలిపారు. ఎండల తీవ్రత, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల్లేకపోవడం, పెద్ద పిల్లలు ఇంట్లో ఉన్నపుడు చిన్న పిల్లలు ఎంత బలవంతం చేసినా కేంద్రాలకు రాకపోవడం తదితర సమస్యలు వేధిస్తున్నాయని వివరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 24 రోజులపాటు సమ్మె సందర్భంగా వచ్చేనెల సెలవులపైన గత ప్రభుత్వం ఇచ్చిన హామీలనూ అనేకసార్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ దృష్టికి తెచ్చామని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని తెలిపారు.

మహిళపై కత్తితో దాడి

- పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన దుండగుడు
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో...



నవతెలంగాణ-మేడ్చల్

గుర్తుతెలియని యువకుడు ఓ ఇంట్లోకి చొరబడి కత్తితో మహిళపై దాడి చేసి బంగారం, పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపల్ పరిధి అత్వెలీలోని ఎస్ఎల్ ఆర్ వెంచర్‌లోని ఓ ఇంట్లో బాగారి మహామాయ అనే మహిళ నివసిస్తోంది. ఆదివారం రాత్రి ఆమె ఇంట్లోకి మంకీ క్యాప్ పెట్టుకుని గుర్తు తెలియని యువకుడు చొరబడ్డాడు. కత్తితో ఆమెపై దాడి చేసి మెడలోని బంగారు పుస్తెల తాడు, మరో బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు.

ఈ దాడిలో మహిళ కుడి చేతికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ చేరుకొని పరిశీలించారు. పోలీసులు సీసీటీవీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

నాపై కుట్ర జరుగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌చార్జి తిరుపతి రెడ్డితో కలిసి కార్యకర్తలనుద్దేశించి సీఎం మాట్లాడారు. ఆ తర్వాత మీడియా ప్రతినిధులతోనూ మాట్లాడారు. కొడంగల్ తన గుండెచప్పుడు అని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీ చందర్‌రెడ్డిని గెలిపిస్తే సిపాయిలా పనిచేస్తారని చెప్పారు.



కొడంగల్ నియోజకవర్గం నుంచి 60 ఏండ్ల కిందట అచ్యుతరెడ్డి గెలిచి రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి అనేకమంది ఎమ్మెల్యేలుగా గెలిచినా ఎవరికీ మంత్రి పదవి అవకాశం రాలేదన్నారు. కొడంగల్‌లో నామినేషన్‌కు వచ్చి వెళ్లిన తన కోసం.. ప్రతి కార్యకర్తా ఎంతో కష్టపడి 33వేల మెజార్టీ ఇచ్చారన్నారు. కొడంగల్ ప్రాంతానికి ముఖ్యమంత్రిగా సోనియా గాంధీ అవకాశం ఇచ్చారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు తర్వాత ఎవరికీ అవకాశం రాలేదని, సోనియాగాంధీ ఈ ప్రాంతానికి మళ్లీ అవకాశం ఇచ్చారని అన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి పాఠశాలలు, మెడికల్, ఇంజినీరింగ్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలు, మహిళా డిగ్రీ, దౌల్తాబాద్, బోంరాస్‌పేట్ మండలాలకు జూనియర్ కళాశాల తీసుకొచ్చామన్నారు. కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకంతో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. కొడంగల్‌ను అభివృద్ధి చేస్తుంటే.. కొందరు తనను ఓడించాలని చూస్తున్నారని, అభివృద్ధి చేస్తున్నందుకు తనను ఓడించాలా అని ప్రశ్నించారు. డీకే అరుణ కాంగ్రెస్‌లో మంత్రి పదవులు అనుభవించి బీజేపీలోకి వెళ్లి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. పదేండ్ల నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా రాలేదని, డీకే అరుణ మాత్రం జాతీయ ఉపాధ్యక్ష పదవి తీసుకున్నారని అన్నారు. రాజకీయాలకతీతంగా కొడంగల్ నియోజకవర్గం నుంచి వంశీ చందర్‌రెడ్డికి 50 వేల మెజార్టీ ఇచ్చి గెలిపిస్తే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా తీసుకొస్తారని హామీ ఇచ్చారు.

పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్.. ఈ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలైనా వచ్చాయా అని ప్రశ్నించారు. మతం, భాష పేరుతో కోస్గిలో పంచాయితీ పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. గతంలో కొడంగల్‌కు ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదన్నారు. కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇక్కడి ప్రజలు నిలబడితేనే తను నాయకుడైనానని తెలిపారు.

ముఖ్యమంత్రి కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటనకు వెళుతుండగా మన్నెగూడ దగ్గర తన కాన్వాయ్‌లో ఒక కారు టైరు పంచర్ అయి పగిలిపోయింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. వెంటనే కారు టైరు మార్చుకొని కొడంగల్ బయలుదేరారు.

కవితకు బెయిల్ నిరాకరణ

(మొదటిపేజీ తరువాయి)

మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని అభిప్రాయపడింది. అలాగే సెక్షన్ 45(1) అనేది మైనర్లు, అమాయకులు, పలు నేరాల్లో బలిపశువులు, మోసపోయిన మహిళకు వర్తిస్తుందని, కానీ కవిత లాంటి ఉన్నత విద్యావంతురాలు ఈ కేసులో బలిపశువైనట్లు భావించడం లేదని స్పష్టం చేసింది. మధ్యంతర బెయిల్ మంజూరు విషయంలో స్కాంలో కవిత ప్రమేయం, ఆమెకు వ్యతిరేకంగా సేకరించిన సాక్ష్యాలు, ఆమె ప్రవర్తనను పరిగణనలోకి తీసుకోవడం చాలా అవసరమని పేర్కొంది. ఈడీ కోర్టు ముందుంచిన ఆధారాల ప్రకారం.. దర్యాప్తునకు ముందు సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి కవిత తన ఫోన్లను ఫార్మాట్ చేశారని పేర్కొంది. నోటీసులందిన తరువాత డిజిటల్ డివైజ్‌లలోని సమాచారాన్ని తొలగించినట్లు ఫోరెన్సిక్ రిపోర్ట్ ద్వారా వెల్లడించబడిందని తెలిపింది. అలాగే సాక్ష్యులను ప్రభావితం చేయడంలోనూ కీలక పాత్ర పోషించారని, బెయిల్ వస్తే అదే తీరును కొనసాగించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపింది. అందువల్ల ఆమెకు మధ్యంతర బెయిల్ నిరాకరిస్తున్నట్లు తీర్పు వెలువరించింది. కాగా, మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న కవిత తన చిన్న కొడుకుకు 11వ తరగతి పరీక్షల నేపథ్యంలో తనకు అండగా ఉండేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. అలాగే పీఎంఎల్ఏ 45 ప్రకారం మహిళనైన తనకు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఈడీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు ఈనెల 1, 4 తేదీల్లో ఈ పిటిషన్‌పై సుదీర్ఘంగా ఇరువైపు వాదనలు విన్న సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జ్ కావేరి బవేజా 4న తీర్పును సోమవారానికి రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా సోమవారం 21 పేజీలతో తీర్పు వెలువరించారు. వాది, ప్రతివాదులతో పాటు తీహార్ జైల్ సూపరింటెండెంట్‌కు ఈ మెయిల్ ద్వారా ఈ కాపీని అందజేశారు. కవితను బలిపశువుగా భావించలేంలిక్కర్ స్కాంలో కవితను బలిపశువును చేశారనే వాదనతో తాము ఏకీభవించడం లేదని కోర్టు పేర్కొంది. వాదనల సందర్భంగా కవిత న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టు ముందుకు తెచ్చిన అంశాలపై తీర్పులో స్పష్టత ఇచ్చారు. సౌమ్య చౌరాసియా (సుప్ర) కేసులో సుప్రీంకోర్టులో చేసిన వ్యాఖ్యలను కోర్టు గుర్తు చేసింది. సెక్షన్ 45 ప్రొవిజన్స్‌ను తప్పనిసరిగా, విధిగా భావించలేమని పేర్కొన్నట్లు తెలిపింది. మైనర్లు, అమాయకులు, పలువురి చేతిలో బలిపశువుగా మారిన వారి విషయంలో సానుభూతి చూపాలని, అంతేకానీ నేడు కొందరు విద్యావంతులు, ఉన్నత స్థానంలో ఉన్న మహిళలు వ్యాపారంలో ఉన్నవారిపై కాదని తీర్పులో పొందిపరిచినట్లు తెలిపింది. ఇదే కోవలో కవిత కూడా ఉన్నారని పేర్కొంది. బ్యాచులర్ ఇన్ ఇంజనీరింగ్, మాస్టర్ ఇన్ సైన్స్ డిగ్రీలో కోర్సులను ఉన్నతమైన వర్శిటీలలో పూర్తి చేసినట్లు గుర్తు చేసింది. అలాగే ప్రస్తుతం ఎమ్మెల్సీగా, మాజీ ఎంపీగా, లోక్‌సభ కమిటీల్లో పని చేశారని పేర్కొంది. ఉప రాష్ట్రపతి, లోక్‌సభ ప్రతినిధులతో కలిసి ఆమె కొలంబియా, బ్రెజిల్, బెల్జియం సందర్శించారని వెల్లడించింది. రాజకీయాల్లోకి రాకముందు ఆమె తెలంగాణ జాగృతి స్కిల్ సెంటర్‌తో సేవలందించారని, అలాగే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు తెలంగాణ స్టేట్ కమిషనర్‌గా చిన్న వయసులోనే బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా నిలిచారని తెలిపింది. ఈ అంశాల నేపథ్యంలో కవితను ఏవిధంగా బలిపశువుగా భావించలేమని స్పష్టం చేసింది. కవితపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయని, ఈడీ ఇంకా దర్యాప్తులో కీలక విషయంలో రాబట్టాల్సి ఉన్నందున బెయిల్ ఇవ్వలేకపోతున్నట్లు స్పష్టం చేసింది.

41 శాతం స్థానాల్లో నేరచరితులు

- మనీక్రైమ్ రికార్డుల్లో బీజేపీ అభ్యర్థులే టాప్ : ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 19న తొలి దశ జరిగే 102 స్థానాల్లోని 42 స్థానాల్లో పోటీచేసే ముగ్గురు, అంతే కంటే ఎక్కువ అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ ఫర్ డెమెక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. సుమారు 1,625 మంది అభ్యర్థుల అఫిడవిట్లను ఏడీఆర్ పరిశీలించింది. వీరిలో సుమారు 16 శాతం మంది అంటే 252 మంది అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో 10 శాతం మంది అంటే 161 మంది తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఏడు మందిపై హత్యకేసులు, 19 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయి. 18 మంది అభ్యర్థులు మహిళలకు వ్యతిరేకంగా నేరాలు కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో ఒకరు లైంగికదాడి కేసు ఎదుర్కొంటున్నారు. అలాగే, 35 మంది అభ్యర్థులు విద్వేష ప్రసంగం కేసులు ఎదుర్కొంటున్నారని ఏడీఆర్ నివేదిక తెలిపింది. అలాగే తొలి దశ జరిగే 102 స్థానాల్లోని 42 లేదా 41 శాతం స్థానాలు 'రెడ్ ఎలర్ట్' నియోజకవర్గాలు అని నివేదిక వెల్లడించింది. పోటీ చేసే అభ్యర్థుల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటుంటే ఆయా నియోజకవర్గాలను రెడ్ ఎలర్ట్ నియోజకవర్గాలుగా పేర్కొంటారు. పార్టీల వారీగా చూసుకుంటే ఆర్‌జేడీ నుంచి పోటీలో ఉన్న మొత్తం నలుగురు అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. డీఎంకే మొత్తం 22 మంది అభ్యర్థుల్లో 13 మంది క్రిమినల్ కేసుల్లో ఉన్నారు. ఎస్పీ నుంచి ముగ్గురు (మొత్తం ఏడుమంది అభ్యర్థులు), టీఎంసీ నుంచి ఇద్దరు (మొత్తం ఐదుగురు), బీజేపీ నుంచి 28 మంది అభ్యర్థులు (మొత్తం 77 మంది), కాంగ్రెస్ నుంచి 19 అభ్యర్థులు (మొత్తం 56 మంది) క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఏఐఏడీఎంకే నుంచి 13 మంది (మొత్తం 36 మంది అభ్యర్థులు), బీఎస్పీ నుంచి 11 మంది (మొత్తం 86 మంది) అభ్యర్థులు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.అలాగే తొలిదశలో పోటీ చేసే అభ్యర్థుల్లో 28 శాతం మంది కోటీశ్వరులు (ఒక కోటి కంటే ఎక్కువ ఆస్తి ఉన్నవారు) అని ఏడీఆర్ నివేదిక తెలిపింది. అభ్యర్థుల సగటు ఆస్తి రూ. 4.51 కోట్లుగా తెలిపింది. ఆర్‌జెడి ప్రకటించిన నలుగురు అభ్యర్థులూ కోటీశ్వరులే. అలాగే ఏఐఏడీఎంకే నుంచి పోటీలో ఉన్న 35 మంది, డీఎంకే నుంచి పోటీలో ఉన్న 21 మంది అభ్యర్థులు, బీజేపీ నుంచి పోటీలో ఉన్న 69 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. కాంగ్రెస్ నుంచి 49 మంది అభ్యర్థులు, టీఎంసీ నుంచి నలుగురు, బీఎస్పీ నుంచి 18 మంది అభ్యర్థులు కోటీశ్వరులు. కాంగ్రెస్ నుంచి ఛింద్వారా (మధ్యప్రదేశ్) నుంచి పోటీలో ఉన్న నకుల్ నాథ్ రూ. 716 కోట్ల ఆస్తితో అభ్యర్థుల్లో అందరికంటే ధనవంతుడుగా నిలిచారు. ఈరోడ్ (తమిళనాడు) నుంచి పోటీలో ఉన్న ఏఐఏడీఎంకే అభ్యర్థి అశోక్ కుమార్ రూ. 662 కోట్ల ఆస్తితో రెండోస్థానంలో ఉన్నారు. తమిళనాడులోని శివగంగ నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి దేవనాథన్ యాదవ్ రూ. 304 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరగనున్న సంగతి తెలిసిందే.

రాజ్యాంగాన్ని ముట్టుకుంటే బీజేపీ భూస్థాపితం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్
- రాజ్యాంగాన్ని మారుస్తామన్న పార్టీలకు ఓటు వేయొద్దు : ప్రొఫెసర్ కోదండరామ్



నవతెలంగాణ-బోడుప్పల్

"రాజ్యాంగాన్ని ముట్టుకుంటే బీజేపీని భూస్థాపితం చేస్తాం.. అలాంటి రాజకీయ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి" అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, ప్రొ.కోదండరామ్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్‌లోని బొమ్మక్ బాలయ్య గార్డెన్స్‌లో "రాజ్యాంగ రక్షణ సదస్సు" నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. తాను పదవుల కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, రాజ్యాంగానికి రక్షణ కల్పించడం కోసం మాత్రమే చేరానని తెలిపారు. దేశానికి రాజ్యాంగమే రక్ష అని చెప్పారు. దేశంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉంటుందని, అందుకోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సుమారు 1000 మందితో రాజ్యాంగ రక్షణ యాత్ర చేపడతామని అన్నారు. మాల మహానాడు సంఘం ఎస్సీ వర్గీకరణకు సంబంధించినది కాదని, మందకృష్ణ మాదిగతో తనకు సత్సంబంధం ఉంటుందని తెలిపారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద టెంట్‌హౌస్‌లు పెడతామన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు సరికావన్నారు. దేశంలో తనకు ఇష్టమైన ఒక మహిళ సోనియా గాంధీ అన్నారు. రేవంత్ రెడ్డి తనను ఒక కుటుంబ సభ్యునిగా పరిగణిస్తారని.. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, పీసీసీ అధ్యక్షునిగా సరైన నాయకుడు రేవంత్ రెడ్డి అని తెలిపారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఊచకోత నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి మహిళా చట్టాన్ని తీసుకొచ్చారన్నారు.

దేశంలో అణచివేయబడిన సమాజం ఏదైనా ఉంది అంటే అది ఓబీసీ వర్గం మాత్రమేనన్నారు. ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఓబీసీ రిజర్వేషన్ అమలవుతుందని చెప్పారు. మాల మహానాడును విస్తృత రాజ్యాంగ పరిరక్షణ సమితిగా తయారు చేయాలని తన ఉద్దేశం అన్నారు. కంటోన్మెంట్ టిక్కెట్టు రానందున దయాకర్ అలిగాడని మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని.. కానీ తాను సినిమా రంగం కోసం చెన్నై, మద్రాస్ తిరుగుతున్నానని చెప్పారు. తన సినిమా, తన జీవితం.. తన ఉద్యమంలో అన్నీ బడుగు బలహీనవర్గాల కోసమేనన్నారు. ప్రపంచం మొత్తం ఒక మేధావి రాజ్యాంగాన్ని రచించాడు అంటుంటే.. మన భారతదేశం మాత్రం ఒక దళితుడు రాజ్యాంగాన్ని రచించాడు అనడం దౌర్భాగ్యం అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న పార్టీలకు ఓటు వేయొద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. కార్యక్రమంలోకాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు మన్నె బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, బైరు రమేష్, ఆంధ్రమాల మహానాడు అధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

'పొద్దు తిరుగుడు' మొత్తం కొనండి

- సీఎంకు మాజీమంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని రైతులు 20,829 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పువ్వు పంట పండించారనీ, ఆ పంట మొత్తాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసారు. ఈ పంటకు మార్కెట్లో కనీస మద్దతు ధర లభించడం లేదని తాను ఈ ఏడాది ఫిబ్రవరి 22న ప్రభుత్వానికి లేఖ రాశాననీ, దానికి స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మద్దతు ధర అయిన రూ.6,760 చెల్లించి పొద్దు తిరుగుడు పువ్వు పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దాని ప్రకారం మార్కెట్లలో కొనుగోళ్లు ప్రారంభించి, రైతుల నుంచి వచ్చిన మొత్తం దిగుబడిని కాకుండా, కేవలం కేంద్ర ప్రభుత్వం తన వాటాగా సేకరించాలనుకున్న మేరకే కొనుగోలు చేశారని వివరించారు. మిగతా పంటను కొనుగోలు చేయడం లేదు. దీనివల్ల 75 శాతం పంటను రైతులు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1,65,800 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు పంట దిగుబడి వస్తుందనీ, దీనిలో కేంద్ర ప్రభుత్వం తన నిధులతో కేవలం 37,300 క్వింటాళ్లు మాత్రమే కొనడానికి అంగీకరించిందని తెలిపారు. మిగతా పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను ఆ లేఖలో వివరించారు.

హిందీ ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయండి

- 25 జీవోను రద్దు చేయాలి లేదా సవరించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి హిందీ పండిత్ పరిరక్షణ సమితి వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని హిందీ ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయాలని తెలంగాణ హిందీ పండిత్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జీవోనెంబర్ 25ను రద్దు చేయాలనీ, లేదంటే సవరించాలని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో ఆ సమితి నాయకులు ఎం రవి, నసీరా, విజయలక్ష్మి, సలీమా, రామలక్ష్మి, రామ్‌సింగ్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవోనెంబర్ 1415ను యథాతథంగా అమలు చేయాలనీ, హిందీ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలనీ, కటాఫ్ తేదీని ప్రకటించాలని కోరారు. హిందీ విద్వాన్, మధ్యమ (విశారద్) హిందీ ధ్రువపత్రాలతో తాము హిందీ ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేశామని వివరించారు. మిందీ విద్వాన్, మధ్యమ (విశారద్) కోర్సులకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు ఉందని గుర్తు చేశారు. ఆ ధ్రువపత్రాలపై 2013 ఎల్పీసెట్ కౌన్సెలింగ్ సమయంలో వివాదం ఏర్పడితే నాటి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందని తెలిపారు. వాటిని పూర్తిస్థాయి డిగ్రీ ధ్రువపత్రాలుగా పరిగణించలేం కానీ హిందీ చదువుల నిమిత్తం మాత్రమే పనిచేస్తాయని నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. డీఎస్సీ హిందీ ఉపాధ్యాయ పోస్టులకు వారు అనర్హులంటూ ప్రకటించలేదని వివరించారు. కొద్ది మంది ప్రయోజనాల కోసం తెచ్చిన 25 జీవో వల్ల సుమారు 30 వేల మంది హిందీ ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల హిందీ ఉపాధ్యాయ పోస్టులకు పాత నిబంధనలతో 1:2 నిష్పత్తిలో మెరిట్ ఆధారంగా తమనూ ఎంపిక చేయాలని కోరారు. డీఎస్సీ హిందీ ఉపాధ్యాయ పోస్టులకు విద్వాన్, మధ్యమ (విశారద్) ధ్రువపత్రాలనూ పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటికే 5,422 కేంద్రాలు ప్రారంభం : మరో రెండు రోజుల్లో 1,727 సెంటర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నెలకొల్పింది. గతేడాది ఇదే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాని సంగతి తెలిసిందే. ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ముందే ప్రారంభించింది.

ఇందుకోసం మార్చి చివరి వారంలోనే ధాన్యం కొనుగోళ్ల కోసం 7,149 కేంద్రాలు ఏర్పాటును మొదలు పెట్టింది. ఇప్పటికే 5,422 కేంద్రాలు ప్రారంభం కాగా, మరో రెండు రోజుల్లో మిగతా 1,727 కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. వీటి ద్వారా ఐదు జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా 443 కొనుగోలు కేంద్రాల్లో 4,345 మంది రైతుల నుంచి 31,215 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు.

ఈ ఏడాది దాదాపు 75.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని అంచనా వేసిన అధికారులు వాటి సేకరణకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. వడ్ల సేకరణకు 18.85 కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయని అంచనా వేయగా, వాటిలో 14 కోట్ల గన్నీ సంచులు ఇప్పటికే శాఖ వద్ద సిద్ధంగా ఉన్నాయి. వీటితో దాదాపు 56 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేసేందుకు వీలవుతుందని అధికారులు చెబుతున్నారు. మిగతా గన్నీ సంచులను కూడా తొందరగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది

నమ్మించి మోసం చేశారు

- అధిక రాబడి వస్తుందని చెప్పారు
- దళిత కుటుంబంతో బాండ్లు కొనిపించిన వెల్‌స్పన్ కంపెనీ అధికారి

అదానీ గ్రూపుతో దానికి సంబంధాలు

అహ్మదాబాద్ : గత సంవత్సరం అక్టోబర్ 11న గుజరాత్‌లోని ఓ దళిత కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులను మాయమాటలతో మోసం చేసి రూ.11,00,14,000 విలువైన ఎన్నికల బాండ్లను కొనిపించారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎస్‌బీఐ సమాచారం ప్రకారం ఇందులో అక్టోబర్ 16న రూ.10 కోట్ల విలువైన బాండ్లను బీజేపీ సొమ్ము చేసుకుంది. మిగిలిన బాండ్ల మొత్తాన్ని అక్టోబర్ 18న శివసేన పార్టీ నగదుగా మార్చేసుకుంది.

అదానీ గ్రూపుతో సంబంధం ఉన్న వెల్‌స్పన్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కంపెనీ అధికారి ఒకరు తమను మోసం చేశారని, తమతో బాండ్లు కొనుగోలు చేయించారని ఆ దళిత కుటుంబం ఆరోపిస్తోంది. 2005లో అదానీ గ్రూపు వెల్‌స్పన్ నేచురల్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఉమ్మడి భాగస్వామ్యం





నెలకొల్పింది. అదానీ వెల్‌స్పన్ ఎక్స్‌ప్లోరేషన్ లిమిటెడ్ పేరిట కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇందులో అదానీ గ్రూపుకు 65% వాటాలు, వెల్‌స్పన్ గ్రూపుకు 35% వాటాలు ఉన్నాయి.

'ఒక ప్రాజెక్ట్ కోసం అంజర్ ప్రాంతంలో మా కుటుంబానికి చెందిన 43 వేల చదరపు మీటర్ల వ్యవసాయ భూమిని వెల్‌స్పన్ తీసుకుంది. అందుకు ప్రతిగా చట్టప్రకారం మాకు నష్టపరిహారం అందించారు. అయితే ఆ డబ్బును డిపాజిట్ చేసే సమయంలో కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ మహేంద్ర సింగ్ సోధా అడ్డుపడ్డారు. ఇంత పెద్ద మొత్తం డిపాజిట్ చేస్తే ఐటీ శాఖ నుండి ఇబ్బందులు వస్తాయని చెప్పారు. ఎన్నికల బాండ్ల పథకం గురించి చెప్పారు. ఈ పథకంలో సొమ్ము డిపాజిట్ చేస్తే కొన్ని సంవత్సరాలలోనే ఒకటిన్నర రెట్లు పెరుగుతుందని నమ్మబలికారు. మేము నిరక్షరాస్యులం. ఈ పథకం గురించి మాకేమీ తెలియదు' అని దళిత కుటుంబానికి చెందిన హరేష్ సవకర ఆవేదనగా చెప్పారు.

వాస్తవాలు గ్రహించిన హరేష్ ఈ ఏడాది మార్చి 18న అంజర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఇప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, విచారణ పూర్తయిన తర్వాత కేసులో బలం ఉంటే ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తామని వారు తెలిపారు. ఫిర్యాదు ప్రకారం....వెల్‌స్పుర్ కంపెనీకి రూ.16,61,21,877 లకు వ్యవసాయ భూమిని విక్రయించేందుకు జిల్లా అధికారులు అనుమతి ఇచ్చారు. అందులో రూ.2,80,15,000లను అడ్వాన్సుగా ఇచ్చారు. మిగిలిన మొత్తాన్ని భూమి యాజమాన్య హక్కులున్న ఏడుగురు వ్యక్తులకు బదిలీ చేశారు. 2023 అక్టోబర్ 1-8 తేదీల మధ్య కంపెనీ అధికారి దళిత కుటుంబంతో నాలుగుసార్లు సమావేశమై బాండ్ల పథకంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా నచ్చచెప్పారు. ఈ సమావేశాల్లో అంజర్ నగర బీజేపీ అధ్యక్షుడు హేమంత్ రజనీకాంత్ షా కూడా పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రయివేటు భాగస్వామ్యంతో మూసీ అభివృద్ధి

- నిపుణులు, సలహా కమిటీల ఏర్పాటుపై నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలి : సీఎస్ శాంతికుమారి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ నది అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి అన్నారు. దీన్ని పబ్లిక్ ప్రయివేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని ఆమె తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 24వ బోర్డు సమావేశాన్ని సోమవారం సచివాలయంలో శాంతికుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎంఏయూడీ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ సుదర్శన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఆమ్రపాలి, బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మూసీ ప్రాజెక్ట్‌పై పెట్టుబడిదారులు, వాటాదారుల విశ్వాసాన్ని పెంచడానికి మూసీ పరివాహక ప్రాంతాన్ని వేగంగా అభివృద్ధి చేసేవిధంగా కొన్ని ప్రాజెక్టులను గుర్తించాలని అధికారులను ఆమె కోరారు. నిపుణుల కమిటీ, సలహా కమిటీల ఏర్పాటుపై నిర్దిష్ట ఉత్తర్వులతో రావాలని అధికారులను ఆదేశించారు. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఆమ్రపాలి ప్రాజెక్ట్ అంశాలను సమావేశంలో వివరించారు. ప్రాజెక్టులోని అన్ని అంశాల సాధ్యాసాధ్యాలు, గుర్తించబడిన పనుల డీపీఆర్‌లు, కాన్సెప్ట్ మాస్టర్ ప్లాన్ మొదలైన విభాగాలకు ఈ సమావేశంలో టైమ్‌లైన్‌లు నిర్ణయించబడ్డాయని చెప్పారు. ఆగస్టు నెలాఖరులోగా మాస్టర్ ప్లాన్ ముసాయిదా సిద్ధమవుతుందని ఆమె వివరించారు. అనేక ప్రయివేట్ సంస్థలు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తిని కనబరుస్తున్నాయని ఎంఏయూడీ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ చెప్పారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మొదటి దశలో భాగంగా ఉస్మాన్ సాగర్ డ్యామ్ డౌన్‌స్ట్రీమ్ పాయింట్ నుంచి గౌరెల్లి సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు, హిమాయత్‌సాగర్ డ్యామ్ డౌన్‌స్ట్రీమ్ పాయింట్ నుంచి బాపూఘాట్‌లో సంగమం పాయింట్ వరకు 55 కిలోమీటర్ల మేర మూసీ నది విస్తరణ ప్రతిపాదనపై బోర్డు చర్చించింది. నగరంలోని మూసీ నది చుట్టూ ఉన్న వారసత్వ కట్టడాల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని కూడా బోర్డు నిర్ణయించింది.

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ ఉగాది శుభాకాంక్షలు

- కేసీఆర్, భట్టి సహా పలువురి విషెస్..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలనీ, ప్రజల ఆశలు, ఆకాంక్షలన్నీ నెరవేరాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వానలు కురిసి, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ఉజ్వల భవిష్యత్తుకు ఈ ఉగాది తోడ్పడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ క్రోధినామ సంవత్సరాది సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాదినుండి కాలచక్రం తిరిగి మొదలవుతుందనీ, చెట్లు చిగురిస్తూ ప్రకృతిలో నూతనోత్తేజం నెలకొంటుందన్నారు. వ్యవసాయ పనులను రైతన్నలు ఉగాది నుండే ప్రారంభిస్తారనీ, అందువల్లే ఉగాదిని వ్యవసాయ నామ సంవత్సరంగా పిలుచుకోవడం ప్రత్యేకతని తెలిపారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి ఎమ్మెల్యే టి హరీశ్‌రావు తదితరులు రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించండి

- సీపీఐ(ఎం)ను గెలిపించండి
- భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎండి.జహంగీర్

నవతెలంగాణ-చేర్యాల/ఆలేరుటౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న సీపీఐ(ఎం)ను గెలిపించాలని భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎండి.జహంగీర్ అన్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల పట్టణం, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల సీపీఐ(ఎం) కార్యకర్తల సమావేశం చేర్యాల మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో జహంగీర్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల నిరుద్యోగం, పేదరికం, ఆకలి పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న మతోన్మాద రాజకీయాలను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. దేశం వెనుకబడటానికి కారణమైన కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాలుగా నియంతృత్వంగా



వ్యవహరించిన ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు విస్మరించారన్నారు. ఎలాంటి చరిత్ర లేని వ్యక్తులు అభ్యర్థులుగా పోటీకొస్తున్నారని తెలిపారు.

నీతి, నిజాయితీ పోరాటాల వారసత్వం కలిగిన సీపీఐ(ఎం) అభ్యర్థిగా భువనగిరి పార్లమెంటు స్థానంలో పోటీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద రాజకీయ పార్టీల అభ్యర్థులను తిరస్కరించాలని, పదవుల కోసం అనైతికంగా వ్యవహరిస్తున్న పార్టీలను చిత్తుగా ఓడించాలని కోరారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి కోసం పనిచేస్తున్న తనను గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆడివయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, కాముని గోపాలస్వామి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, సందబోయిన ఎల్లయ్య, గోడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎండీ.జహంగీర్

నిత్యం పేదలు, కార్మికులు, కర్షకుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న తనకు ఓటేసి గెలిపించాలని భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్ కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గంలోనే తమ పార్టీ పోటీ చేస్తుందని, నిరంతరం పేదల, కార్మికుల, కర్షకుల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని ముస్లిములను కోరారు.తన కుటుంబం చిన్న హోటల్ నిర్వహణతో జీవనం సాగిస్తుండగా.. ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో తాను సీపీఐ(ఎం)లో చేరి 35 ఏండ్లుగా అనేక పోరాటాలలో భాగస్వామ్యం అయ్యానని చెప్పారు. నంతరం మాజిత్ కమిటీ సభ్యులు జహంగీర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎంఏ ఇక్బాల్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మంగ నరసింహులు, మండల కార్యదర్శి దూపటీ వెంకటేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ముస్లింలు ఎండి బద్రుద్దీన్, ఎండీ. రఫీ, ఎండీ.ఖలీల్, ఎండీ.జైనుద్దీన్, అఖిల్, ఎండీ.సలీం, ఎండి అప్సర్, ఎండీ.జహంగీర్, ఎండీ.మతిన్, ఎండీ.అజర్ పాల్గొన్నారు.



ఆర్టీసీకి సర్కారు బకాయి రూ.1,177 కోట్లు

నాలుగు నెలల 'మహాలక్ష్మి' స్కీం లెక్క ఇదీ...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గడచిన నాలుగు నెలల్లో టీఎస్ఆర్టీసీకి మహాలక్ష్మి స్కీం ద్వారా ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ము సొమ్ము రూ.1,177 కోట్లుగా లెక్కతేలింది. టీఎస్ఆర్టీసీలో మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజుల్లో రోజుకు సగటున 14 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. ఆ తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి రోజుకు సగటున 29.67 లక్షలకు చేరింది. మహాలక్ష్మి స్కీం ద్వారా డిసెంబర్లో 26.99 లక్షలమంది, జనవరిలో 28.10 లక్షలు, ఫిబ్రవరిలో 30.56 లక్షలు, మార్చిలో 31.42 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు. ఏప్రిల్ 7వ తేదీ వరకు రూ. 1,177 కోట్ల విలువైన జీరో టికెట్లను ఆర్టీసీ జారీ చేసింది. అంత మొత్తం సొమ్మును మహిళా ప్రయాణికులు ఆదా చేసినట్లేనని ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా, ఆ సొమ్మును ఆర్టీసీకి సకాలంలో చెల్లిస్తారా...లేదా? అనే సందేహం యాజమాన్యానికి కలుగుతుంది. మొత్తం చెల్లిస్తారా లేక దానిలో ఏమైనా కోతలు విధిస్తారా అనే విషయంపైనా స్పష్టత లేదు. ఈ సొమ్ము వస్తేనే ఆర్టీసీకి ఉన్న అప్పులు కొంతలో కొంతైనా తీర్చే వెసులుబాటు లభిస్తుంది. ఇప్పటికే కార్మికులకు చెందిన సీసీఎస్ బకాయిల చెల్లింపులపై ఆర్టీసీయాజమాన్యం కోర్టు ధిక్కరణ కేసును ఎదుర్కొంటున్నది. ఉద్యోగుల భవిష్యనిధి (పీఎఫ్)కు కూడా బారీ మొత్తంగా బకాయి పడిన విషయం తెలిసిందే. మహాలక్ష్మి స్కీం నిధులు ఆర్టీసీకి చెల్లిస్తేనే ఆ సంస్థ మనుగడ సాధ్యమవుతుందని కార్మిక సంఘాలు కూడా చెప్తున్నాయి.

మదురై సీపీఐ(ఎం) అభ్యర్థికి బ్రహ్మారథం

ఐదేండ్ల కృషితో ప్రజలకు మరింత చేరువైన ఎస్. వెంకటేషన్

- యువత, సాహితీవేత్తలతో ప్రత్యేక అనుబంధం
- కరోనా కాలంలో ప్రజల్లోనే ఉండే నేతగా ముద్ర
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అబద్ధపు ప్రచారం
- ఆ గుట్టు విప్పుతున్న వెంకటేషన్

నవతెలంగాణ నుంచి జగదీష్

తమిళనాడు, మదురై అభివృద్ధికి ఐదేండ్ల పాటు ఎంపీగా చేసిన కృషితో సీపీఐ(ఎం) మదురై లోక్‌సభ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ ఎస్. వెంకటేషన్ ప్రజలకు చేరువవుతున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతైన ఆయన తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్టు అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఉన్నారు. మదురై ఎయిమ్స్ నిర్మాణం 95 శాతం పూర్తైందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడైన వెంకటేషన్ పచ్చి అబద్ధమని బట్టబయలు చేశారు. జేపీ నడ్డా వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే వెంకటేషన్ ఎయిమ్స్ ప్రతిపాదిత ప్రాంతం తోపూర్‌కు వెళ్లారు. 'ఎయిమ్స్ ఎక్కడ ఉంది?' అనే సున్నితమైన భాషలో ప్లకార్డును పట్టుకుని నిరసన తెలిపారు. అక్కడ కనీసం ఒక్క భవనానికి కూడా పునాది రాయే వేయలేదు.

ఈ అంశం తమిళనాట చర్చనీయాంశంగా మారింది. తమిళనాడు ప్రయోజనాల కోసం చర్చలు జరుగుతున్నప్పుడు ఇలా బాధ్యతా యుతమైన స్థానంలో ఉన్న జేపీ నడ్డా చేసిన ఈ అబద్ధపు వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తమైంది.



తమిళనాడు గొంతుకై...

2019 నుంచి తమిళనాడు గొంతుకై పార్లమెంట్‌లో తన గళాన్ని లేవనెత్తుతున్న ఎస్.వెంకటేషన్, లోక్‌సభకు మళ్లీ ఎన్నిక కావాలని మదురై ప్రజలు కోరుకుంటున్నారు. ఎంపీగా వెంకటేషన్ నియోజకవర్గానికి ఐదేండ్లుగా చేసిన కార్యక్రమాలు, అభివృద్ధిని మళ్లీ ప్రజలకు చేరువ చేస్తున్నారు. 2023లో ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు అధికారులను ఏకతాటిపైకి తెచ్చి ఏర్పాటు చేసిన ముఖాముఖి తమిళనాడుకు కొత్త అనుభూతినిచ్చింది. కోవిడ్ కాలంలో అన్ని ఇతర కార్యకలాపాల మధ్య, నియోజకవర్గ ప్రజలకు కూరగాయలు, నిత్యావసరాలను పంపిణీ చేయడానికి ఎంపీ స్వయంగా రంగంలోకి దిగడంతో ప్రజల్లో విశేష ఆదరణ పొందగలిగారు. హిందీని జొప్పించాలన్న కేంద్ర ప్రభుత్వ చర్యను ముందు నుంచి ప్రతిఘటించారు. ఆలయాల నగరమైన మధురైకి వినూత్నమైన అభివృద్ధి ప్రాజెక్టులను తీసుకురావడానికి, యువతకు మరిన్ని విద్యా, ఉపాధి అవకాశాలను అందించడానికి కృషి చేశారు. ఈ 'కవల్‌కోట' రచయితను మధురై వాసులు 'సన్ ఆఫ్ వైగా' అని పిలుచుకుంటారు. మదురైకి, సంస్కృతికి మూలమైన వైగా నదికి నమస్కరిస్తూ వెంకటేషన్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన అభివృద్ధి, పర్యావరణాన్ని మిళితం చేసే తమిళనాడు ముర్పోక్ ఎజుతలార్ సంఘానికి నాయకుడుగా ఉన్నారు. యువతతో సహా అన్ని వర్గాల ప్రజల నుంచి బలమైన మద్దతును చూరగొన్నారు.

జోరుగా ప్రచారం

వెంకటేషన్ ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయన గెలుపు కోసం సీపీఐ(ఎం) నేతలు, కార్యకర్తలు, ఇండియా ఫోరం నేతలతో పాటు కవులు, రచయితలు, సినీ ప్రముఖులు ప్రచారం చేస్తున్నారు. ప్రముఖ సినీ నటి రోహిణి సైతం రోజూ వెంకటేషన్ గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. ఆయనకు మహిళలు, యువత పెద్ద ఎత్తున బ్రహ్మారథం పడుతున్నారు.

సీపీఐ(ఎం)కు బలమైన కేంద్రం మదురై

మదురై లోక్‌సభ నియోజకవర్గం మదురై తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తర, మధ్య, మేలూర్ అసెంబ్లీ నియోజకవర్గాలను కలిగి ఉంది. సీపీఐ(ఎం)కు బలమైన కేంద్రంగా ఉన్న ఈ నియోజకవర్గానికి 1999-2004లో పి మోహన్ సీపీఐ(ఎం) నుండి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. అంతకు ముందు 1967లో సీపీఐ(ఎం) సీనియర్ నేత పి.రామమూర్తి ఎంపీగా ఉన్నారు. 1957లో సీపీఐకి చెందిన కెటికె తంగమణి ఎంపీగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో వెంకటేషన్ 44.20 శాతం ఓట్లతో అన్నాడీఎంకె అభ్యర్థి వివిఆర్ రాజ్ సత్యన్‌పై 1,34,119 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈసారి ఏఐఏడీఎంకేకు చెందిన పి. శరవణన్, బీజేపీకి చెందిన రామ శ్రీనివాసన్ ఆయన ప్రత్యర్థులుగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల మొదటి దశ పోలింగ్‌లో ఈనెల 19న తమిళనాడులో ఎన్నికల జరగనున్నాయి.



నేతన్న అధైర్య పడొద్దు.. చేతినిండా పని కల్పిస్తాం

నేతన్నల పేరుతో బీఆరెస్, బీజేపీ శవ రాజకీయం

- పదేండ్లు అధికారంలో ఉన్న వారిదే ఈ పాపం..
- కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో ఎంపీ బండి సంజయ్ చెప్పాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - సిరిసిల్ల

"నేతన్నల పేరుతో బీఆర్ఎస్, బీజేపీలు శవ రాజకీయాలు చేస్తున్నాయి.. పదేండ్లు అధికారంలో ఉన్న ఆ పార్టీలదే ఈ పాపం అని.. వారి నిర్లక్ష్యం వల్లే నేడు వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడింది. అయినా నేతన్నలు అధైర్య పడొద్దు.. చేతినిండా పని కల్పిస్తాం.." అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం.. వస్త్ర పరిశ్రమ మీద 12శాతం జీఎస్టీ వేసిందని, జాతీయ చేనేత బోర్డును రద్దు చేసిందని చెప్పారు. జాతీయ టెక్స్‌టైల్ బోర్డును, మహాత్మాగాంధీ గుణకర్ బీమా యోజనను, ఐసీఐసీఐ నాబార్డు ఆరోగ్య బీమాను రద్దు చేసిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎస్ఐడీపీ పథకం పారిశ్రామిక అభివృద్ధి ప్రమోషన్ల కింద రూ.వేల కోట్ల నిధులు ఇస్తే.. మన రాష్ట్రానికి అసమర్థ ఎంపీ బండి సంజయ్ ఎన్ని నిధులు తెచ్చారో 10వ తేదీన చేసే దీక్షలో చెప్పాలన్నారు. సిరిసిల్లకు పవర్‌లూం క్లస్టర్ అడిగితే కనీసం నోరెత్తని ఎంపీ బండి ఏం ముఖం పెట్టుకుని దీక్షకు పూనుకున్నారని ప్రశ్నించారు.

ఎస్ఐడీపీ కింద రూ.300కోట్లు ఉంటే తాము 25శాతం రాష్ట్ర వాటా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని.. మిగతా నిధులు కేంద్రం నుంచి తేవాలని సవాల్ చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం రూ.550కోట్ల బకాయిలు చెల్లించలేదని, వీటిలో రూ.300కోట్ల బకాయిలు బతుకమ్మ చీరలకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. ఈ సంక్షోభానికి కారణమైన బీఆర్ఎస్ ఎందుకు ఉద్యమం చేపడుతుందో.. ఎవరిపై కక్ష సాధించేందుకు రాజకీయం చేస్తుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీల రెచ్చగొట్టే మాటలు నమ్మొద్దని, నేతన్నలారా అధైర్యపడొద్దు, చావు మార్గం కాదు.. ప్రతి కార్మికుడికీ పని కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని చెప్పారు.

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోని చేనేతల నుంచి వస్త్రాల కొనుగోలు కోసం జీఓ 01 తీసుకొచ్చామని, గడిచిన నాలుగు నెలల్లోనే రూ.120కోట్ల ఆర్డర్ సిరిసిల్లకు ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వం ఒక ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన ఆర్డర్లకన్నా ఎక్కువ ఇస్తామని, పెండింగ్ బకాయిలు కూడా విడుదల చేస్తామని, ఇప్పటికీ రూ.180 కోట్లు విడుదల చేశామని వివరించారు.

సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాధాకిషన్‌రావు నోట పొలిటికల్ లింకుల మాట

మాజీ డీసీపీ ఇస్తున్న సమాచారంతో ఆ దిశగా స్పెషల్ టీమ్ ఆరా

- ఆరుకు పైగా జిల్లాల్లో ఫోన్ ట్యాపింగుల నిర్వహణ.. బెదిరింపులు
- ఐదో రోజు విచారణలో వెల్లడి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో దుమారం రేపిన రాజకీయ ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితుడైన నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు నోట పొలిటికల్ లింకుల సమాచారం ఒకటొకటిగా దర్యాప్తు అధికారులు వెలుగు చూస్తున్నట్టు తెలిసింది. విచారణలో భాగంగా ఏడ్రోజుల పాటు రాధాకిషన్‌రావును కస్టడీలోకి తీసుకున్న స్పెషల్ టీమ్ అధికారులు సోమవారం ఐదో రోజు సుదీర్ఘంగా ఆయనను ప్రశ్నించారని తెలిసింది. ఈ సందర్భంలోనే ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు ఇచ్చిన ఆదేశాల మేరకే ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడ్డామని తెలిపిన రాధాకిషన్‌రావు..కొన్ని సందర్భాల్లో తమకు ఆదేశాలిచ్చిన కొందరు బీఆర్ఎస్ పొలిటికల్ బాస్‌ల పేర్లను కూడా అన్యాపదేశంగా వెల్లడించినట్టు తెలుస్తున్నది. కొన్ని సార్లు పేర్లు చెప్పి, మరికొన్నిసార్లు వాళ్లు కాదంటూ తప్పుకునే ప్రయత్నం చేసినట్టు కూడా తెలిసింది. దీంతో రాధాకిషన్‌రావు నోట వెలువడ్డ పొలిటికల్ బాస్‌ల లింకులు ఈ కేసుకు ఏ మేరకు ఉన్నాయనే విషయమై దర్యాప్తు చేస్తున్న స్పెషల్ టీమ్ అధికారులు క్షుణ్ణంగా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. రాధాకిషన్‌రావు ఫోన్‌ట్యాపింగ్‌తో పాటు కొందరు ప్రముఖులను బెదిరించి డబ్బులు వసూలు చేయటం వంటి కార్యకలాపాలు హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్ మొదలైన జిల్లాల్లో కొనసాగినట్టు దర్యాప్తులో వెలుగు చూసింది. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని నగర టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేసి డబ్బులు వసూలు చేయటం.. మరో ఘటనలో నల్లగొండలో ఒక ప్రముఖుడిని బెదిరించి డబ్బులు దండుకోవటం వంటి వివరాలు కూడా దర్యాప్తులో బయటపడ్డట్టు తెలిసింది. అలాగే, కూకట్‌పల్లికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని ఒకరిని బెదిరించి, అక్రమంగా ఒక ఫ్లాట్‌ను రాధాకిషన్‌రావు రాయించుకున్న విషయం కూడా విచారణలో బయటపడింది. ఈ విషయమై ఇప్పటికే సదరు బాధిత రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో కేసును కూడా నమోదైంది.

ఎస్ఐబీ కార్యాలయంలో 17 కంప్యూటర్లలో నిక్షిప్తమైన ఫోన్‌ట్యాపింగ్ సమాచారాన్ని ధ్వంసం చేయించటంలో రాధాకిషన్‌రావు పాత్ర కూడా ఉన్నట్టు అంగీకరించారని తెలిసింది. ఇవే కంప్యూటర్లలో ఎస్ఐబీకి చెందిన మావోయిస్టుల కీలక సమాచారం కూడా చాలా వరకు ఉన్నట్టు తాజాగా తేలటంతో ఆ సమాచారం కూడా ధ్వంసం కావటం పట్ల ఉన్నతాధికారులు కొంత ఆందోళనకు గురవుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎస్ఐబీకి చెందిన మరో నలుగురు కానిస్టేబుళ్లను కూడా స్పెషల్‌టీం అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం.

నవతెలంగాణ

మానవత్వంలేని మేధస్సు కంటే
మేధస్సులేని మానవత్వం ఎంతో మంచిది - రస్సెల్

మంగళవారం 9 ఏప్రిల్ 2024
www.navatelangana.com

సంపాదకీయం

ఎన్ని'కల' క్రోధి

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. కాలగమనంలో మరో తెలుగు ఏడాది కరిగిపోయింది. 'శోభకృత్'కు వీడ్కోలు చెబుతూ కొత్త ఆశలు.. కొంగొత్త ఊసులతో నేటి ఉగాది పర్వదినాన 'క్రోధి'నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాం. తెలుగు వత్సరానికి ఆహ్వానం పలుకుతున్న వేళ.. తీపి, పులుపుల మకరందం జీవితంలో అందరూ ఆస్వాదించాలి. క్రోధి నామలో ప్రవేశిస్తున్న వేళ దేశంలో సార్వత్రిక ఎన్నికలు, మరో నాలుగురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల 'వేడి' సుర్రుమంటోంది. అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, ఆధునిక సౌకర్యాలు అందివచ్చినప్పటికీ, దేశ తొలిసార్వత్రిక ఎన్నికల తరువాత మళ్లీ అంతటి సుదీర్ఘ(44రోజుల) ఎన్నికల ప్రక్రియలో దాదాపు97కోట్ల మంది ఓటర్లు తమ నేతల భవిష్యత్తుని నిర్ణయించే బటన్ నొక్కనున్నారు. అందుకే ఎన్ని'కల' బరిలో దిగిన నేతలంతా కొత్త పంచాంగంలో రాశిఫలాలను చూసుకుంటూ... ఉగాది పచ్చడిని ఇష్టంగా ఆస్వాదించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రోధి నామ సంవత్సరం ఎవరికి క్రోధమో.. ఎవరికి లాభమో మరి?

> ఉగాది పర్వదినం పూట.. రాశిఫలాల వారిగా రాజపూజ్యాలు, అవమానాలు, ఆదాయాలు, వ్యయాలు... ఎలా ఉన్నా ఎన్నికల రోజు తరుముకొస్తున్న వేళ.. తమ రాజపూజ్యాన్ని పెంచుకోవడానికి ...ఉగాది పూట ప్రచార పంచాంగాన్ని వినిపించనున్నారు నేతలు. ఎవరికి వారు గెలుపు ధీమాతో ప్రచారాన్ని సాగిస్తున్నారు. తీపెవరికో, చేదెవరికో, వగరు, కారం ఫలితాలు ఎలా వస్తాయో వేచిచూడాలి.

ఏటా ఉగాది రోజున పంచాంగ శ్రవణం పరిపాటే అయినా... ఈ ఏడాది మాత్రం దానికి మరింత ప్రత్యేకత చేకూరనుంది. గ్రామాల్లో, మండలాల్లో, నియోజకవర్గంలో నాయకులు తాము బలపరుస్తున్న అభ్యర్థుల భవిష్యత్‌పై పంచాంగ బలాలను చూపించుకోనున్నారు. పంచాంగ శ్రవణం పార్టీల ఆధ్వర్యంలో జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం ప్రచారం చేసుకోవడం రెండు జరిగిపోతాయని నాయకులు దూర దృష్టితో వ్యవహరిస్తున్నారు. జన్మ నక్షత్రాలు, రాశుల ఆధారంగా వారి భవిష్యత్ తెలుసుకోనున్నారు. మంచి ముహూర్తంలో తమ నేతలతో నామినేషన్‌లు వేయించి 'క్రోధి' అందించే విజయాల కోసం నాయకులంతా ఎదురు చూస్తున్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడి తిని, పంచాంగాన్ని విని రాశిఫలితాలను తమకు అనుకూలంగా "మలుచుకుంటూ"... భవిష్యత్ ఆశలతో.. కొత్త ఊసులతో నేతలంతా పార్లమెంట్‌లో అడుగు



పెట్టాలని లక్ష్యంతో ప్రచారంలో పరుగులు తీస్తున్నారు.

గెలుపు లక్ష్యంతో ఎవరికి వారు పోటీ పడుతున్నారు. కానీ ఓటరు మారాజు ఎవరిని దీవిస్తాడో పంచాంగ పఠనం చేసే వేదమూర్తులకు అంతుచిక్కడం లేదు. ఉగాది పర్వదినం పూట.. రాశిఫలాల వారిగా రాజపూజ్యాలు, అవమానాలు, ఆదాయాలు, వ్యయాలు... ఎలా ఉన్నా ఎన్నికల రోజు తరుముకొస్తున్న వేళ.. తమ రాజపూజ్యాన్ని పెంచుకోవడానికి ...ఉగాది పూట ప్రచార పంచాంగాన్ని వినిపించనున్నారు నేతలు. ఎవరికి వారు గెలుపు ధీమాతో ప్రచారాన్ని సాగిస్తున్నారు. తీపెవరికో, చేదెవరికో, వగరు, కారం ఫలితాలు ఎలా వస్తాయో వేచిచూడాలి.

ఉగాది కవిసమ్మేళనంలో కవులు, రచయితల వాడే భాషను బట్టి, వాటి అర్థాల స్పష్టతను బట్టి వారి మనోగతాన్ని గుర్తించవచ్చు. కానీ, మన రాజకీయ నాయకులు ఉపన్యాసాల్లో చెప్పే మాటలకు అర్థాలు ఏ డిక్షనరీల్లోనూ దొరకవు. వాటికి పర్యాయపదాలూ వుండవు. సామాన్యులకు మాటలు, సంపన్నులకు మూటలు కట్టబెట్టడం మన పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. 'ఎన్ని ఓట్లు వచ్చాయన్నదే లెక్కకాని, ఎంత సారా ఖర్చయిందన్నది లెక్క కాదే' అంటారు రావిశాస్త్రి. ఏదోవిధంగా అధికారం దక్కించుకోడమే వారి లక్ష్యం. ఎన్నికల్లో ప్రజలకు ఎన్నెన్నో వాగ్దానాలు చేసి, ఎన్నికల తర్వాత గాలికొదిలేసిన అనేక రాజకీయ పార్టీలను చూస్తున్నాం. ఎన్ని వాగ్దానాలు చేసినా, వాటికి చట్టబద్ధత వుండదు కనుక ఇబ్బడిముబ్బడిగా హామీలిస్తూనే వుంటారు.

'ఎన్నికలలో ఎన్నికలలో?/ ఒక్క చేపకై ఎన్ని వలలో' అని బాపురెడ్డి అన్నట్టుగా... మాటలతో, ప్రలోభాలతో మభ్యపెడుతూనే వుంటారు. ప్రతి రాజకీయపక్షానికి తన సిద్ధాంతాలకు అనుగుణమైన లక్ష్యాలు వుంటాయి. ఆ లక్ష్యసాధనకు ఉపకరించే కార్యక్రమాలను రూపొందించుకుంటారు. వాటిని ప్రజలకు వివరించి, అధికారం ఇమ్మని కోరుకునే పార్టీలు కొన్నే. దేశంలోని అనేక రాష్ట్రాలలో పాలక పార్టీలన్నీ తమ మ్యానిఫెస్టోలను పథకాల చుట్టూనే తిప్పుతున్నాయి. బీజేపీ మరో రెండడుగులు ముందుకేసి ఒక చంకలో కార్పొరేట్ శక్తులను, మరో చంకలో మతాన్ని అంటిపెట్టుకొని భారత్ వెలిగిపోతోందంటూ ప్రచారం చేస్తోంది. మరోవైపు సంక్షేమ పథకాల పట్ల బాహాటంగానే తన వ్యతిరేకతను ప్రదర్శిస్తోంది. 'మాన్పగలిగితి కత్తికోతలు,/ మాన్ప వశమే, మాట కోతలు?/ కత్తి చంపును, మాట వాతలు/ మానవేనాడున్' అంటారు గురజాడ. మాటలు మూటలు గాలిలో కలిసిపోగా, ప్రపంచ ఆకలి సూచీలో, నిరుద్యోగం వంటి అనేక విషయాల్లో భారత్ అథమ స్థానంలో వుందని లెక్కలు చెబుతున్నాయి. మట్టిగుర్రాన్ని నమ్ముకుని ఏట్లోకి దిగిన చందంగా మారింది దేశం పరిస్థితి. అందుకే కొత్త ఏడాది ఓటరు కొంగొత్త ఆలోచన చేయాలి. ఎన్నికల బరిలో నిలిచిన నేతల ఆదాయాలను, వ్యయాలను గమనిస్తూ.. ఎవరిపై క్రోధం ప్రకటించాలో.. ఎవరికి రాజయోగం కల్పించాలో యోచించాలి.

రాంజీ గోండ్ ఎవరు?

మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు, గోండు పరిపాలనదక్షుడు, గోండ్వాన రాజు రాంజీ గోండ్. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసులు, గోండుల హక్కుల కోసం పోరాడిన వీరుడు. నేడు ఆయన వర్ధంతి. ఈ సందర్భంగా రాంజీ గోండ్‌ను ఎందుకు స్మరించుకోవాలి? అనేది నేటితరానికి తెలియాల్సిన అవసరం ఉన్నది. 1857 తర్వాత భారత దేశ స్వాతంత్ర్యం కోసం- బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాటాలు చేసి బ్రిటిష్ సైన్యానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్‌లోని గొలుసు కట్టు చెరువుల నీళ్ల తాగించి ముప్పుతిప్పలు పెట్టిన ధీరుడు రాంజీ. గోండుల స్వయం పరిపాలన కోసం, ఆదివాసీలపైన బ్రిటిషర్ల అత్యాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన నాయకుడు. ఆయనతోపాటు పాటు తాంతీయ తోపే అనుచరులైన రోహిల్లాలతో కలిసి రెండుసార్లు ఆ కాలంలోనే అత్యాధునిక ఆయుధాలు కలిగిన బ్రిటిష్ సైన్యాన్ని ఓడించారు. నిర్మల్‌లో ఉన్న కొండలు, గుట్టలు, అడవుల్ని ఆసరా చేసుకొని రాంజీ బ్రిటిష్ సైన్యాన్ని ఓడించగలిగాడు. రాంజీ గోండ్‌తో ముఖాముఖిగా తలపడి



ఓడించడం, అంతం చేయడం సాధ్యం కాదని బ్రిటిష్‌వారు భావించి అప్పటి నిర్మల్ కలెక్టర్‌తో కలిసి కుట్రకు తెరదీశారు. రాంజీ తన వెయ్యి మంది అనుచరులతో ప్రస్తుత సోన్ ప్రాంతంలోని గోదావరి నది పక్కన నిద్రిస్తున్న సమయంలో ఒక్క ద్రోహి ఇచ్చిన సమాచారంతో దొంగచాటుగా పట్టుకున్నారు. ప్రస్తుత నిర్మల్‌లోని ఎల్లపెల్లి, ఖురాన్ పేట్ మధ్యలో గల ప్రాంతంలో మర్రి చెట్టుకు రాంజీ గోండ్‌తో సహా వెయ్యిమందిని ఒక్కో ఊడకు ఒక్కొక్కరిని ఉరితీశారు. రాంజీ గోండ్ గురించి అప్పటి ప్రభుత్వాల రికార్డులు పరిశీలిస్తే ఈ విషయాలన్నీ తెలుస్తాయి.

కానీ కేంద్రంలోని బీజేపీ నాయకులు ఈ చరిత్రను వక్రీకరించి, తమ స్వార్థ ఓట్ల కోసం రాంజీ గోండ్‌ను రాజకీయం చేస్తున్నారు. ఆయన విరోచిత పోరాటాన్ని ముస్లింలపై చేసిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారు. ఈ ప్రచారం రాంజీగోండ్ భారత స్వాతంత్ర్యం కోసం ఆదివాసీల స్వయం పాలన కోసం చేసిన వీరోచిత పోరాటానికి మసిపూసి, దానిని ఒక తెగ నాయకులు ఒక మతంపైన దాడి చేశారని చరిత్రను వక్రీకరించి, ఆదివాసీలను, సమాజాన్ని పక్కతోవ పట్టించడమే అవుతుంది. ఇది గోండుల పరిపాలన సామర్థ్యం, వీరత్వానికి కళంకంగా వుంటుంది. కాషాయ నేతలకు చరిత్ర తెలియకుంటే తెలుసుకోవడం మంచిది. కానీ ఇలా దుష్ప్రచారం చేయడం తగదు. గోండులు, ఆదివాసీలు కొన్ని వందల సంవత్సరాల నుండి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలు (1240 నుంచి 1750 వరకు) పరిపాలన చేశారు. ఈరోజు ప్రస్తుత ప్రభుత్వాలు ఆదివాసీలను అడవులలో అక్రమంగా చొచ్చుకొని వచ్చారని చెబుతూ వారిని వ్యవసాయ భూముల నుంచి, నివాస ప్రాంతాలనుండి తరిమేస్తున్నారు. ఈ రోజు వారసత్వంగా చూసినా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అడవులు, భూములు వాస్తవంగా ఆదివాసిలవే. వారు ప్రస్తుతం సాగు చేసుకుంటున్న అన్ని భూములకు పట్టాలిచ్చి, వారు నివాసిస్తున్న ప్రాంతాలను అబాదిలుగా గుర్తించాల్సిన ప్రభుత్వం విద్వేషపూరిత వాదనలు, ఆరోపణలు చేయడం అనైతికం. రాంజీగోండ్‌పై చేసే బీజేపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టడటంతో పాటు ఆదివాసీ హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నది.

(ఏప్రిల్ 9 రాంజీ గోండ్ వర్ధంతి)

- కిషన్

హిందూ రాజ్యం అంటే ?



ప్రభాత్ పట్నాయక్

హిందూ రాజ్య స్థాపన లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి పనిచేస్తోంది. ఈ హిందూ రాజ్యం అంటే ఏమిటి? ఏదో ఒక్క మతానికి మాత్రమే తక్కిన మతాలకన్నా అధిక ప్రాధాన్యతనిచ్చిన దేశాలు ప్రపంచంలో చాలానే ఉన్నాయి. వీటిని మత ప్రమేయం ఉండే రాజ్యాలని అంటాం. అంతమాత్రం చేత ఆ రాజ్యాల వర్గ స్వభావంలో అణు మాత్రమైనా తేడా రాదు. అంటే మత ప్రాతిపదికన ఒక రాజ్యం వర్గ స్వభావాన్ని నిర్ధారించలేం. నిజానికి అటువంటి రాజ్యాలు అనివార్యంగా భయోత్పాతాన్ని సృష్టించే నియంతృత్వ రాజ్యాలుగా, గుత్త పెట్టుబడిదారుల కోసం మాత్రమే పనిచేసే రాజ్యాలుగా ఉంటాయి. మరీ ముఖ్యంగా ఆ గుత్త పెట్టుబడిదారీ శక్తులలో కొత్తగా బలపడిన శక్తుల సేవలో అవి పనిచేస్తాయి. కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు జార్జి డిమిట్రోవ్ ఏడవ అంతర్జాతీయ మహాసభలో ఫాసిస్టు రాజ్యం గురించి ఈ విధంగా నిర్వచించాడు: "ద్రవ్య పెట్టుబడి శక్తులలో అత్యంత తిరోగామి స్వభావం కలిగిన, రాజ్య విస్తరణవాద స్వభావం కలిగిన తరగతుల భయోత్పాత నియంతృత్వమే ఫాసిజం". హిందూ రాజ్యమంటే ఇటువంటి ఒక ఫాసిస్టు రాజ్యమే అని ఇప్పుడు వివరించబోతున్నాను.

హిందూ రాజ్యంగా ఏర్పడితే, అందులో అన్ని అధికారిక కార్యకలాపాలూ హిందూ దేవతల ఆరాధనలతో మొదలౌతాయి. అన్ని రహదారులకి, రైల్వే స్టేషన్లకి, నగరాలకి పాత, మధ్యయుగాల నుంచీ కొనసాగుతున్న పేర్లను మార్చి హిందూత్వ చిహ్నాల పేర్లు పెడతారు. విద్యా కార్యకలాపాలన్నీ సరస్వతీ వందనంతో మొదలౌతాయి. ప్రభుత్వ నిధులను సైతం వెచ్చించి మరెన్నో దేవాలయాలను నిర్మిస్తారు. కాని ఈ చర్యలేవీ సామాన్య హిందువు జీవితంలో ఏ చిన్నపాటి అభివృద్ధినీ తీసుకురాలేవు. టర్కీ పాలకుడు ఎర్డోగన్ దేశ రాజధాని ఇస్తాంబుల్‌లో ప్రసిద్ధి చెందిన హగియా సోఫియా కట్టడాన్ని ఒక మసీదుగా మార్చి తద్వారా ఇస్లామిక్ మనోభావాలను సంతృప్తిపరచడానికి పూనుకున్నాడు. కాని దాని వలన టర్కీలోని సగటు పౌరుడి జీవితంలో ఏ చిన్నపాటి మెరుగుదలా రాలేదు.

మనం ఇంకా మరికాస్త ముందుకు పోవచ్చు. ఇక్కడ ప్రస్తుత హిందూత్వ శక్తుల పాలనలోనే మనకున్న అనుభవాలను చూద్దాం. గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ చవిచూడనంత తీవ్ర నిరుద్యోగాన్ని ఇప్పుడు మనం చూస్తున్నాం. భారతదేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఎప్పటికప్పుడు పరిశీలించే సిఎంఐఇ సంస్థ లెక్కల ప్రకారం 2008-2019 మధ్య కాలంలో 5 లేదా 6 శాతంగా ఉంటూ వచ్చిన నిరుద్యోగం ప్రస్తుతం 8 శాతానికి పెరిగింది. అంటే హిందూత్వ శక్తుల పాలనలో ప్రభుత్వం నిరుద్యోగ పరిస్థితి క్షీణించకుండా అడ్డుకోవడంలో విఫలమైందని కనపడుతోంది. నిరుద్యోగాన్ని తగ్గించడంలో ప్రభుత్వం చేయగలిగింది ఏమీ లేదని స్వయంగా కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుడే బహిరంగ ప్రకటన చేశాడు! ఆ తర్వాత ఈ ప్రకటనను అతడు ఉపసంహరించుకున్నదీ లేదు, అతగాడి ప్రకటనతో తమకు సంబంధం లేదని ప్రభుత్వం అధికారికంగా ఏ ప్రకటనా చేసిందీ లేదు. అంటే అది అధికారిక ప్రకటనగానే భావించాలి. అంటే ప్రస్తుతం కార్మిక వర్గానికి అత్యంత సమస్యాత్మకంగా ప్రస్తుత దయనీయ పరిస్థితులలో ఉన్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తాను చేయగలిగింది ఏమీలేదని ప్రభుత్వమే ప్రకటించిందన్నమాట.

అంటే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగితే సామాన్య ప్రజల దుస్థితి కూడా కొనసాగుతుంది. దాని విషయంలో ప్రభుత్వం చేసేది ఏమీ ఉండబోదు. తప్పుడు లెక్కలతో అంచనాలు కట్టిన జీడీపీ వృద్ధి రేటు ఎంత గొప్పగా పెరుగుతోందో టాం టాం చేసుకోవడం మాత్రం జరుగుతుంది. ఆ పేరు చెప్పి తమ ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రజా సంపదను దోచి పెట్టడాన్ని సమర్థించు కుంటుంది. సామాన్య ప్రజల దుర్భర పరిస్థితుల గురించి వాస్తవ పరిస్థితిని వెల్లడించే ప్రయత్నాలు చేసే వారిని ఆడిపోసు కుంటుంది.ఇప్పుడు హిందూత్వ శక్తుల ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వం తీరు ఇలాగుందంటే ఇక హిందూ రాజ్యం అంటూ ఏర్పడితే ఎలా ఉంటుంది? ఇప్పుడు ప్రభుత్వం సామాన్య ప్రజల జీవితాల భౌతిక అవసరాలను పట్టించుకోకుండా బేఖాతరుగా వ్యవహరి స్తున్నదే అప్పుడు ఏకంగా ప్రభుత్వ అధికారిక విధానం అయిపోతుంది.అలా వ్యవహరించాలంటే అటువంటి ప్రభుత్వం తప్పనిసరిగా నియంతృత్వ ప్రభుత్వమే అయివుండాలి. అది ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించేది అయివుండాలి.



ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వం కూడా, అది ఆస్తిపర వర్గాల నాయకత్వంలో నడిచేది అయితే అక్కడ శ్రామిక వర్గం మీద పెట్టుబడిదారులు సాగించే వర్గ నియంతృత్వ పాలనే ఉంటుంది (దానర్థం ప్రజాస్వామిక ప్రభుత్వానికి, నియంతృత్వ ప్రభు త్వానికి పెద్ద తేడా ఏమీ లేదు అని మాత్రం కాదు సుమా). ప్రజాస్వామ్య ప్రభుత్వమే అలా వ్యవహరించేటప్పుడు, ఇక సామాన్య ప్రజల పరిస్థితులు నానాటికీ దిగజారిపోతూ, వాటి గురించి ఏ మాత్రమూ పట్టించుకోని ప్రభుత్వాలు ఉన్నప్పుడు పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వం మీద తన పట్టు బిగించాలనుకుంటే ప్రజల హక్కుల్ని కాలరాయకా తప్పదు, ప్రజాస్వామ్య వ్యవస్థల్ని కొర గాకుండా చేయనూ తప్పదు.

గుత్త పెట్టుబడి ఆధ్వర్యంలో వ్యవహరించే ఒక వర్గ నియంతృత్వ సాధనంగా హిందూ రాజ్యం ఉంటుంది. ఇప్పుడు ఆ గుత్త పెట్టుబడిదారీ వర్గం నయా ఉదారవాద చట్రంతో మమేకమైపోయింది. ఇది శ్రామిక ప్రజల జీవితాలను మరింత దిగ జారుస్తుంది. ఇప్పుడు ఆ నయా ఉదారవాద వ్యవస్థే మొత్తంగా సంక్షోభంలో కూరుకుపోయింది. అందుచేత తన పెత్తనాన్ని నిలబెట్టుకోవడానికి అది నియంతృత్వంగా వ్యవహరించడం అనివార్యం, భయోత్పాతంతో సామాన్య ప్రజానీకాన్ని అదుపు చేయ బూనుకోవడమూ అనివార్యం. హిందూ రాజ్యం ఏర్పడితే జరిగేది ఇదే.

హిందూ రాజ్యం ఏర్పరచాలనే ప్రాజెక్టుకు దాదాపుగా గుత్త పెట్టుబడిదారీ వర్గం యావత్తూ తమ మద్దత్తును ప్రకటించడం ఇందుకే. ఇక భయోత్పాతం సృష్టించడం అనేది మత ఘర్షణలను రెచ్చగొట్టడం, ఒక మతానికి చెందిన ప్రజలను మెజారిటీ మతస్తుల దృష్టిలో "శత్రువులు"గా, మన దేశానికి చెందని "బయటవారు"గా చిత్రించే ప్రచారం చేయడం, వారిపై ద్వేషభావాన్ని రెచ్చగొట్టేవిధంగా తప్పుడు ప్రచారాలు చేయడం వంటి రూపాలతో మొదలౌతుంది. హిందూరాజ్యం అనేది ఈ ప్రక్రియను మరింత బలపరుస్తుంది.

"హిందూ ఆధిక్యత" అనే భావాన్ని, మరోపక్క భయోత్పాతాన్ని పెంచడంతోబాటు మూడవ పార్శ్వం కూడా హిందూ రాజ్యం చేపడుతుంది. సామాజిక అభివృద్ధి నిరోధక మార్పులను తీసుకురావడమే ఆ మూడవ పార్శ్వం. 20వ శతాబ్దంలో మనం రెండు సమాంతర ఉద్యమాలను చూశాం. ఒకటి సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం కాగా రెండవది కులాధిపత్య ప్రాతిపదికన నడిచిన భూస్వామ్య సమాజంలో వేల సంవత్సరాలపాటు అణచివేతకు, వివక్షకు గురైన సామాజిక తరగతుల విముక్తి కోసం సాగిన ఉద్యమం. మొదటి ఉద్యమంలో పాల్గొన్న వారందరూ రెండవ ఉద్యమానికి సానుభూతిగా వ్యవహరించారని చెప్పలేం కాని, ఈ రెండు ఉద్యమాలూ ఒకదానిని ఇంకొకటి బలోపేతం చేశాయి. సాధారణ ప్రజానీకం రెండింటినీ వేరు వేరుగా చూడలేదు. అలా రెండింటి మధ్యా సమన్వయ సంబంధం సాధించడంలో వామపక్ష శక్తులు కీలక పాత్ర పోషించాయి.

ఈ జంట ఉద్యమాల ఫలితంగా దేశంలో చాలా పెద్ద సామాజిక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ మార్పులు సంపూర్ణమైనవీ కావు, సమగ్రమైనవీ కావు. అవి బూర్జువా చట్ర పరిమితుల వరకే జరిగాయి. వాటిని దాటి ముందుకు పోలేక పోయాయి. అయినప్పటికీ జరిగిన మార్పు, పురోగతి గణనీయమైనది. అదిముఖ్యమైన ఒక ముందడుగు. దాని ప్రాముఖ్యతను ఒకే ఒక్క ఉదాహరణతో వివరిస్తాను.

20వ శతాబ్దం ప్రారంభంలో కేరళ ప్రాంతంలో అస్పృశ్యతతో బాటు "కంట పడకూడని" ఆచారం కూడా ఉండేది. అంటే ఒక అగ్ర కులస్తుడు ఒక తక్కువ కులస్తుడిని చూస్తే చాలు. అతడు మైలపడి పోతాడన్నమాట. అందుచేత అగ్రకులస్తుల కంటబడకుండా మెలగవలసిన బాధ్యత ఆ తక్కువ కులస్తులదే. అటువంటి స్థితిలో ఉండిన కేరళ రాష్ట్రంలో ఇప్పుడు మానవా భివృద్ధి సూచికలను పరిశీలిస్తే తక్కిన రాష్ట్రాల కన్నా, చాలా మూడవ ప్రపంచ దేశాలకన్నా మెరుగుగా ఉన్నాయి. కొన్ని విషయాలలో అభివృద్ధి చెందిన దేశాల సూచికలతో పోల్చదగ్గ స్థాయిలో ఉన్నాయి. అంటే సామాజిక మార్పు ఏ స్థాయిలో జరిగిందో మనం ఊహించవచ్చు. కేరళలో జరిగినంత స్థాయిలో కాకపోయినా, దేశంలో తక్కిన ప్రాంతాలలో కూడా సామాజిక పురోగతి తరతమ తేడాలతో కొనసాగింది.

ఇప్పుడు హిందూత్వ భావజాలం పైచేయి సాధించింది. దాని వెనుక అంతర్లీనంగా హిందూత్వ శక్తులు ఇచ్చిన హామీ ఒకటుంది. రాజకీయ. సామాజిక రంగాల్లో సాధించిన పురోగతిని ఆపి వెనక్కి తిప్పుతామన్నదే ఆ హామీ. అది నెరవేరడానికి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడం చాలా అవసరం. రాజకీయంగా, సామాజికంగా వెనక్కిపోయే క్రమంలో లౌకికతత్వాన్ని బలహీన పరచం ఒక్కటే చర్య కాదు. హిందూత్వ ఆధ్వర్యంలో అమలు జరిగే నయా ఉదారవాద విధానాలు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరచడం కూడా ఒకటి. అదేవిధంగా విద్యా విధానంలో తెస్తున్న మార్పులు కూడా ఉన్నాయి. ఇవన్నీ కలిసి సమాజంలో వెనుక బడిన తరగతులకు విద్య, ఉపాధి రంగాల్లో ఉన్న అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. ఇంతవరకూ జరుగుతున్న పురోగతి ఇప్పుడు వెనుకపట్టు పడుతోంది. దీనినే మనం సామాజిక తిరోగమనమని అంటాం.


మాటలు ఒక్కోసారి చాలా మోసం చేస్తాయి. ఈ విషయంలో హిందూ రాజ్యానిది అందెవేసిన చెయ్యి. హిందూ రాజ్యం గురించి హిందూత్వ శక్తులు చేసే ప్రచారం ప్రకారం హిందూ రాజ్యం గనుక ఏర్పడితే అది హిందువుల విముక్తికి దారి తీస్తుంది. కాని వాస్తవం దానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. హిందూ రాజ్యం అనేది నయా ఉదారవాద చట్రంలో గుత్త పెట్టుబడి దారీ శక్తులు సంక్షోభంలో చిక్కుకున్న ఆర్థిక వ్యవస్థలో తమ సొంత ప్రయోజనాలను కాపాడు కోడానికి ఉపయోగించే సాధనం. ఇది ఒక సామాజిక తిరోగమనానికి దారితీసే రాజ్యం అవుతుంది. గత శతాబ్ద కాలంగా సాధించుకున్న విజయాలన్నింటినీ తిరగదోడి మళ్లీ వెనక్కి సామాన్య ప్రజల్ని నెట్టివేస్తుంది. ఈ హిందూ రాజ్య స్థాపనను అడ్డుకోవడానికి రైతాంగంతో కలిసి ఉద్యమించ వలసిన చారిత్రక కర్తవ్యం కార్మికవర్గం భుజ స్కందాలపై ఉంది.

(స్వేచ్ఛానుసరణ)

> గుత్త పెట్టుబడి ఆధ్వర్యంలో వ్యవహరించే ఒక వర్గ నియంతృత్వ సాధనంగా హిందూ రాజ్యం ఉంటుంది. ఇప్పుడు ఆ గుత్త పెట్టుబడిదారీ వర్గం నయా ఉదారవాద చట్రంతో మమేకమైపోయింది. ఇది శ్రామిక ప్రజల జీవితాలను మరింత దిగ జారుస్తుంది. ఇప్పుడు ఆ నయా ఉదారవాద వ్యవస్థే మొత్తంగా సంక్షోభంలో కూరుకుపోయింది. అందుచేత తన పెత్తనాన్ని నిలబెట్టుకోవడానికి అది నియంతృత్వంగా వ్యవహరించడం అనివార్యం, భయోత్పాతంతో సామాన్య ప్రజానీకాన్ని అదుపు చేయ బూనుకోవడమూ అనివార్యం. హిందూ రాజ్యం ఏర్పడితే జరిగేది ఇదే.

> ఇప్పుడు హిందూత్వ భావజాలం పైచేయి సాధించింది. దాని వెనుక అంతర్లీనంగా హిందూత్వ శక్తులు ఇచ్చిన హామీ ఒకటుంది. రాజకీయ. సామాజిక రంగాల్లో సాధించిన పురోగతిని ఆపి వెనక్కి తిప్పుతామన్నదే ఆ హామీ. అది నెరవేరడానికి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడం చాలా అవసరం. రాజకీయంగా, సామాజికంగా వెనక్కిపోయే క్రమంలో లౌకికతత్వాన్ని బలహీన పరచం ఒక్కటే చర్య కాదు. హిందూత్వ ఆధ్వర్యంలో అమలు జరిగే నయా ఉదారవాద విధానాలు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరచడం కూడా ఒకటి. అదేవిధంగా విద్యా విధానంలో తెస్తున్న మార్పులు కూడా ఉన్నాయి. ఇవన్నీ కలిసి సమాజంలో వెనుక బడిన తరగతులకు విద్య, ఉపాధి రంగాల్లో ఉన్న అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. ఇంతవరకూ జరుగుతున్న పురోగతి ఇప్పుడు వెనుకపట్టు పడుతోంది. దీనినే మనం సామాజిక తిరోగమనమని అంటాం.

ఎందుకీ వక్రీకరణలు?



కె.ఎల్. కాంతారావు
9490300449


31 మార్చి 2024న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) 'ప్రపంచ సాహిత్య వేదిక' ఆధ్వర్యంలో "మన ప్రాచీన భారతీయ సాహిత్యం- ఆధునిక విశ్వవిజ్ఞాన శాస్త్ర వికాసానికి మూలం" అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల దృశ్య సమావేశం జరిగింది. అందులో ఆ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ కొన్ని వాస్తవాలను వక్రీకరించారు. అవి భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచ దేశాల దృష్టిలో భంగపరిచేవిగా ఉన్నాయి కాబట్టి వాటిని ప్రస్తావించి వాస్తవాలను పాఠకుల ముందుంచే ప్రయత్నమే ఈ వ్యాసం ఉద్దేశం.

డాక్టర్ ప్రసాద్ వియత్నాం విప్లవీరుడూ, ఆ తరువాత దేశాధినేతా అయినా హోచిమిన్ గురించి మాట్లాడారు. అమెరికాను కూడా ఎదిరించి విజయాన్ని సాధించడానికి గల కారణాన్ని ఒక విలేకరి హోచిమిన్‌ను అడిగారట. దాని కాయన జవాబిస్తూ భారతదేశానికి చెందిన రాణా ప్రతాప్ అనే యోధుడే తమకు ఆదర్శమనీ, ఆయన స్ఫూర్తితోనే తాము యుద్ధం చేసి గెలిచామనీ అన్నారట. అంతేకాదు.. హోచిమిన్ సమాధిపై "ఈయన మహారాణా ప్రతాప్ అభిమాని" అనే అర్థం వచ్చే వాక్యం రాయబడిందని కూడా డాక్టర్ ప్రసాద్ చెప్పారు. దాని వివరాలు పరిశీలిద్దాం.

హోచిమిన్, "భారతదేశానికి చెందిన ఒక రాజు తమకు స్ఫూర్తి" అని ప్రకటిస్తే ఆనాటి భారత బూర్జువా మీడియా తాటికాయంత అక్షరాలతో ఆ విషయాన్ని ప్రకటించకుండా ఉంటుందా? హోచిమిన్ ఒక కమ్యూనిస్టు నాయకుడు. ఆయనకు ఆదర్శంగా జార్ చక్రవర్తి వంటి ఒక సామ్రాజ్యాధినేతను ఎదిరించి గెలిచిన లెనిన్ ఉండగా, చైనా నియంత చాంగ్- కై-షేక్‌ను ఎదిరించి గెలిచిన మావో సేటుంగ్ ఉండగా, ఒక రాజు తనకు ఆదర్శమని చెప్పాడనడం అసంబద్ధంగా లేదా?

ఇక హోచిమిన్ సమాధి ఫొటోను ఇంటర్‌నెట్‌లో పరిశీలించాను. దానిపై" ప్రెసిడెంట్ హోచిమిన్ " అని మాత్రమే ఉంది. సమాధి పక్కనున్న బ్యానర్‌లో "లాంగ్ లీవ్ ది సోషలిస్ట్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం" అని ఉంది. ఈ విషయాన్ని నెట్‌లో కనుగొనడానికి అత్యున్నత విద్యాధికులైన ప్రసాద్ గారికి ఎక్కువ సమయం పట్టి ఉండేది కాదు. ఎవరో సృష్టించిన కట్టు కథను వారు వల్లించే వారు కాదు.

ఇక వేదాలల్లో సూర్యుడు ఒక గోళమని రాయబడిందనీ, భూమికీ, సూర్యుడికీ మధ్య దూరం కచ్చితంగా చెప్పబడిందనీ, వేదాల వ్యాఖ్యాత సాయణాచార్యులు కాంతి వేగాన్ని కచ్చితంగా ఆనాడే చెప్పాడనీ ప్రసాద్ గారు చెప్పారు. వేదాలు గ్రహాలను గూర్చీ, నక్షత్రాలను గూర్చీ మన పూర్వీకుల అజ్ఞానాన్ని తెలియజేస్తున్నాయే కానీ మన వేద రుషుల విజ్ఞానాన్ని తెలియజేయడం లేదు. భూమిని గూర్చి వారేం చెప్పారో తెలుసుకుందాం.



1)"సకల భూతములకు సుఖములు కలిగించు ద్యావా పృధ్వులను (ఆకాశమును, భూమిని) భగవానుడు సృష్టించినాడు. ఆ రెంటినీ కదలకుండా మేకులతో బిగించిన భగవానుడు సర్వదేవతలందు శ్రేష్టుడు.(రుగ్వేదం, ఒకటవ మండలం, 160వ సూక్తం, నాల్గవ మంత్రం. అనువాదం: రంగాచార్య).

2)"ధ్రువాసి భూమీ!" అంటే" భూమీ! నీవు స్థిరత్వము కలదానవు".(కృష్ణ యజుర్వేదము1-1-13-6).

3)" స్థిరము, విస్తారము అగు భూమికి నమః"(అథర్వవేదము,12-3-1-11).


అంటే వేదాలన్నింటిలోనూ భూమి స్థిరంగా, కదలకుండా ఉంటుందని చెప్పబడింది. అంతేకాని, భూమి గుండ్రంగా ఉంటుందని గానీ, దానికి భ్రమణం, పరిభ్రమణం ఉంటాయని గానీ చెప్పబడలేదు. భూమిని గూర్చే కనీస పరిజ్ఞానం లేని వేద రుషులకు సూర్యుని గూర్చీ, దానికీ, భూమికీ గల దూరాన్ని గూర్చీ, కాంతి వేగాన్ని గూర్చీ తెలుసునని చెప్పడం హాస్యాస్పదం కాదా?

ప్రసాద్ గారు మహాభారత కథలో కౌరవుల జననం టెస్టు ట్యూబ్ బేబీలను సృష్టించే సైన్స్ విజ్ఞానం మన పూర్వీకులకు వేల ఏండ్ల నాడే తెలుసునని రుజువు చేస్తున్నదన్నారు. అలాగే శివకుమార్ బాపూజీ తల్పడే అనే ఆయన 1895 లోనే బొంబాయి బీచ్‌లో విమానాన్ని మొట్ట మొదటిగా నడిపేడనీ, ఆ విమానాన్నీ, తల్పడే అభివృద్ధి చేసిన వైమానిక విజ్ఞానాన్నీ, ఆంగ్లేయులు స్వాధీనం చేసుకుని నాశనం చేశారనీ ఆ తరువాత ఎనిమిది ఏళ్లకు రైటు సోదరులు విమానాన్ని నడిపారనీ, కానీ వారే విమానాన్ని మొట్టమొదటిగా నడిపినట్లు తెల్లవారు ప్రచారం చేశారనీ ప్రసాద్ గారన్నారు.

డా.ప్రసాద్ గారికి తెలిసిన విషయం ఏమిటంటే, ఒక వైజ్ఞానిక విషయం కనుగొనబడాలంటే అంతకు ముందు దానికి సంబంధించిన అనేక వైజ్ఞానికాంశాలు శాస్త్రవేత్తలచే కనుగొనబడాలి. టెస్ట్ ట్యూబ్ బేబీని సృష్టించాలంటే మానవ శరీర శాస్త్రం, గైనకాలజీ లాంటి అనేక శాస్త్రాల విజ్ఞానం ఉండాలి. అలాగే విమానాన్ని నడపడానికి భౌతిక శాస్త్రం, ఏరోనాటికల్ ఇంజనీరింగ్ వంటి అనేక శాస్త్రాల విజ్ఞానం ఉండాలి. ఈ విజ్ఞానం మన పూర్వీకుల వద్ద ఉన్నట్లు గ్రంథాల ఆధారాలు, శాస్త్రీయ ఆధారాలు ఏమీ లేవు. కేవలం కథలు మాత్రమే ఉన్నాయి. మహాభారత కథను టెస్ట్ ట్యూబ్ బేబీల సృష్టికి ఆధారంగా అంగీకరిస్తే, 1980లలో వచ్చిన ఆదిత్య 369 ఆధారంగా మన వారు 1980 లలోనే టైం మిషన్‌ను కనుగొన్నట్లు అంగీకరించాల్సి ఉంటుంది.

వాస్తవాలు ఇలా ఉండగా అత్యున్నత విద్యాధికులు కూడా కనీసం అంతర్జాలంలో పరిశీలించకుండా, అవాస్తవాలు ప్రచారం చేయడం వలన భారతదేశ ప్రతిష్ట ప్రపంచ మేధావుల దృష్టిలో నవ్వుల పాలవుతుంది. సుశ్రుతుడు, ఆర్యభట్ట, భాస్కర వంటి మన శాస్త్రజ్ఞుల గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుదాం.అంతేకానీ కొందరు స్వార్థపరులు పక్షపాత బుద్ధితో చేసే వాస్తవాల వక్రీకరణలను నిగ్గు తేల్చకుండా, వారి ప్రచారహోరులో కొట్టుకు పోకుండా ఉందాం. అదే నేటి అత్యున్నత విద్యావంతుల బాధ్యత. అంతేకాదు. మరో ముఖ్య విషయం.మహా శాస్త్రవేత్త ఆర్యభట్ట రాసిన ఖగోళ శాస్త్రం "ఆర్యభటీయ" పూర్తి ప్రతి 1847 వరకు శాస్త్రవేత్తలకి ఎవరికీ దొరకలేదు. అప్పటి వరకు ఇతరులు ఆయనను సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ రాసిన అంశాలు మాత్రమే ఖగోళ శాస్త్రజ్ఞులకు అందుబాటులో ఉన్నాయి. పురాణ గ్రంథాల నకళ్లు తీసి కాపాడుకున్న పండితులు ఆర్యభటియ గ్రంథాన్ని ఎందుకు 1600 ఏండ్ల పాటు మరుగున ఉంచారో, ఆ కారణాన్ని వెలికితీయటం విద్యాధికులూ, పరిశోధకులూ చేయవలసిన మరో ఆవశ్యక విషయం. నిజాల నిగ్గుతేల్చి, వక్రీకరణలను బట్టబయలు చేసి, భారతదేశ ప్రతిష్టను పెంచడమే దేశభక్తుల కర్తవ్యం.

కవి కోయిలలు ప్రజా రాగమెత్తాలే...



మన దేశంలో వసంత రుతువు
ఎన్నికల రుతువును తోడుకొని వస్తుంది..
పాత ఆకుల్ని రాల్చి, కొత్త చిగుళ్లు పూయించడం
రుతు ధర్మం..
వసంతం ప్రజల బతుకుల్లోకి వచ్చినా! రాకున్నా?
రుతువు వచ్చిపోతోంది..
కోయిలలు, కవి కోయిలలు
సం(స్కృతి)ప్రదాయ రాగమెత్తాల్సిందే..
ఎన్నికల రుతువులో మన నాయక కోయిలలు
అధికారం(ఓట్ల)కోసమో
కొత్త ఆశల చిగుళ్లు పూయించేలా
హామీల,తాయిలాల రాగం ఎత్తుకొంటున్నాయి..
ఏ రాగం వెనుక ఎవరి ప్రయోజనం దాగి ఉందో..
చిగుళ్ల (సత్కారాల)మత్తులో,
కవి కోయిలలు గ్రహించకపోతే?
ప్రమాదం పచ్చదనానికి, ప్రజానీకానికే..
ఎన్నికల్లో నాయక కోయిలలు
చెట్ల చిగుళ్ల నుండి గొంతెత్తడం లేదు..
రాముని గుడి గోపురం నుంచి అలౌకిక
మత రాగామృతంలో ముంచుదేందో!
లౌకిక రాజ్యంలో..
ఆకలి కేకల సంగతేందో? ఆలోచించాలి..
ఈ దేశపు పచ్చని చెట్టు లాంటి
సంపదనే చిగుళ్లు తింటూ..
శ్రీమంతుల పాట పాడుతున్న నాయక కోయిలలు
హోరులో.. కనిపించకపాయె!
కోయిలల కుహూ.. కుహూ రాగాలు..
కవి కోయిలైనా.. "శ్రీ క్రోధి"నామ వత్సరాన
ఉగాదుల, ఉషస్సులు పూయించే ప్రజారాగం ఎత్తాలి..

- మేకిరి దామోదర్
9573666650

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి

- సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్
- ఉపాధి కూలీలను కలుసుకొని ప్రచారానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే దంపతులు



నవతెలంగాణ-సత్తుపల్లి

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు కోరారు. సోమవారం సత్తుపల్లి మండలం రేజర్లలో పర్యటించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఆ గ్రామంలో ఉపాధి కూలీలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. గత డిసెంబరు నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మిమ్మల్ని కలుసుకొని ఓట్లను అభ్యర్థించామని, మీ అందరి ఆశీర్వాద బలంతో ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.400 వచ్చే విధంగా కాంగ్రెస్ హామీ నెరవేరుతుందన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఉపాధికూలీలను కలుసుకొని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు కూడా అమలవుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ 5 గ్యారంటీలను ప్రకటించిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అవి కూడా అమలు చేస్తారని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు మెడికల్ కిట్స్, మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం రేజర్ల గ్రామ సమస్యలను అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, రేజర్ల సర్పంచ్ జక్కుల ప్రభాకర్, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, బీసీ సంఘం నారాయణవరపు శ్రీనివాస్, దోమ ఆనంద్, రాజు, సీపీఐ నాయకులు దండు ఆదినారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు మంత్రుల ఉగాది శుభాకాంక్షలు

నవతెలంగాణ- ఖమ్మం

తెలుగువారి నూతన ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని.. ఉభయ జిల్లాలు, రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సోమవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సరానికి ..సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకుదామని పేర్కొన్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడిలోని తీపి, చేదు మాదిరిగానే..కష్టం, సుఖం అనేవి జీవితంలో సహజమని తెలిపారు. కొత్త తెలుగు సంవత్సరంలో అంతా శాంతంగా సాగాలని, ప్రజలందరికీ మంచి జరగాలని, అంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలతో అందరూ ఉగాదిని ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

'సీతారామ' ప్రధాన కాల్వలు పూర్తి చేయాలి

- సాగర్ ఆయకట్టుకు నీరు అందించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-ఖమ్మం

గోదావరి నదిపై దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మాణం చేసి సాగునీరు అందించాలని రెండు దశాబ్దాలకు పైగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారని, సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలు పూర్తి చేసి సీతారామ ప్రాజెక్టు ఆయకట్టుతోపాటు నాగార్జున సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం మంచికంటి హాలులో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలు సత్వరమే పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం అనేక ప్రజా ఉద్యమాలు 21 శతాబ్దం ప్రారంభ దశలో జరిగాయని, ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యులు తమ్మినేని వీరభద్రం దుమ్ముగూడెం సాధనకై మహాప్రస్థానం పాదయాత్ర వంద రోజులు నిర్వహించారన్నారు. వామపక్ష పార్టీలు అనేక ఉద్యమాలు నిర్వహించాయన్నారు. రైతు సంఘాలు దశాబ్దాలుగా దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం కృషి చేసిన నేపథ్యంలో 2005లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి దుమ్ముగూడెం ప్రాజెక్టు మంజూరు చేసి 2005 డిసెంబర్ 31న అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం దగర శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ, దాన్ని పూర్తి చేయలేకపోయిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు 2006 రాష్ట్ర బడ్జెట్‌లో దుమ్ముగూడెం ప్రాజెక్టు పనుల ప్రారంభం కోసం నిధులు కేటాయించాలని ఖమ్మం నుంచి హైదరాబాద్ మహా పాదయాత్రలో ప్రత్యక్షంగా



పాల్గొన్నారని గుర్తు చేశారు.

2014లో అధికారంలోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి ముఖ్యమంత్రి కేసీఆర్ దుమ్ముగూడెం ప్రాజెక్టుకు అప్పటివరకు ఉన్న రాజీవ్ సాగర్ ఇందిరాసాగర్ పేర్లు మార్పు చేసి 2016 డిసెంబర్ 26 రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తిరిగి శంకుస్థాపన చేస్తు ఇల్లందు నియోజకవర్గం రోళ్ళపాడును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చి ఎక్కువ ప్రాంతాలకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సీతారామసాగర్‌గా నామకరణ చేసి నేటికీ పూర్తి చేయలేదని రాంబాబు అన్నారు. మరొకవైపు కృష్ణా పరీవాహక ప్రాంతంలో వర్షాలు లేక నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండక ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు 2.5 లక్షల ఎకరాలు బీడుగా మారుతోందని, ఈ సంవత్సరం వేల ఎకరాలలో పంటలు ఎండిపోయాయని, కొన్ని మండలాల్లో పశువులు తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి నేడు ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకి అవసరమైన సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, జూలూరుపాడు మండలం పాపకల్లు గుట్టల వరకు ప్రధాన కాలువల నిర్మాణం చేసి రెండు సంవత్సరాల గడుస్తున్నా పనులు ముందుకు సాగటం లేదన్నారు. 2019లో ఏన్కూరు, కామేపల్లి భూసేకరణ అవార్డు ప్రకటించి నేటికీ డబ్బులు చెల్లించలేదని, కాలువల పనులు ప్రారంభం కావడం లేదని, పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాల్సిన సీతారామ ప్రాజెక్ట్ నత్తనడకన నడుస్తోందని, సత్వరమే పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని, ఖమ్మం జిల్లా ఆయకట్టును రక్షించాలని రాంబాబు డిమాండ్ చేశారు. కామేపల్లి, కారేపల్లి మండలాల సాగు భూములకు సాగునీరు అందించి, అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. భూ సేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సరైన నష్టపరిహారం అందించాలని కోరారు.

సీతారామ పూర్తి కాకపోవడంతో మంచినీటి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసే పరిస్థితి ఖమ్మం నగరంలో వచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. కాంట్రాక్టర్లు, కమీషన్ల కోసం కాకుండా జిల్లా అభివృద్ధికి అవసరమైన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మురళి, రైతు సంఘం జిల్లా నాయకులు తాతా భాస్కర్‌రావు, దుగ్గి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, వాసిరెడ్డి ప్రసాద్, నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు శ్రీధర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బషీర్, సియటియి జిల్లా నాయకులు గోపాల్ ప్రసంగించారు.

కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, తుళ్ళూరు రమేష్, బోడేపూడి వీరభద్రం, జట్లా ఆనందరావు, పొన్నెగంటి సంగయ్య, ఎర్రా శ్రీనివాసరావు, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, సుధాకర్, సాయి, రైతులు పాల్గొన్నారు.

కమల్ కన్సల్టెన్సీ సౌజన్యంతో...

300 కుటుంబాలకు రంజాన్ 'తోఫా' వితరణ



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణానికి చెందిన మొహమ్మద్ షాకీర్-మున్వర్ దంపతుల కుమారులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమల్‌పాషా, రెహమత్‌పాషా వారు నిర్వహిస్తున్న కమల్ కన్సల్టెన్సీ, కమల్‌మిత్ర బజాజ్ షోరూం సంస్థల తరపుల పట్టణంలో పేద ముస్లిం కుటుంబాలకు చెందిన 300మందికి రూ. 2లక్షల విలువగల సరుకుల కిట్స్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ పేద కుటుంబాలు కూడా రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో షాకీర్-మున్వర్ దంపతుల కుమారులు కమల్‌పాషా, రెహమత్‌పాషా దాతృత్వగుణం అభినందనీయమన్నారు. కమల్ బ్రదర్స్ మాట్లాడుతూ బియ్యం, పంచదార, సేమియా, ఉల్లిపాయలు, జీడిపప్పు, కిస్‌మిస్,ఎండు ఖర్జూరాలతో కూడిన కిట్స్‌ను అందించడం జరిగిందన్నారు. ప్రతియేటా రంజాన్ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు తోఫా అందించడం తమ కుటుంబ సభ్యులకు ఎంతో సంతృప్తిని ఇస్తోందని వారన్నారు. ఈ కార్యక్రమంలో కమల్ కుటుంబ సభ్యులు రెహానాబేగం, ఖాదర్, యూనిస్, రఫీ, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నకేశవరావు, బీసీసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, దోమ ఆనంద్, జీవన్, జమలయ్య, నాగేశ్వరరావు, బెజవాడ రాంబాబు, అబ్బులు, కౌన్సిలర్ ఎస్కే నాగుల్‌మీరా, బుడేన్ పాల్గొన్నారు.


సర్వజ్ఞలో ఉగాది, రంజాన్ వేడుకలు



నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని వీడియోస్ కాలనీ సర్వజ్ఞ పాఠశాలలో ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో చిన్నారులు వివిధ సాంప్రదాయ వస్త్రాలలో పాల్గొన్నారు. హిందూ ముస్లింల ఐక్యతను తెలియజేయడం కోసం రంజాన్, ఉగాది పండుగలను ఒకే రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్వి నాగేంద్రకుమార్, డైరెక్టర్ కె.నీలిమ మాట్లాడుతూ భారత దేశంలో పుట్టడమే మన పుణ్యఫలం అని, మన మతంతో పాటు ఇతర మతాలను కూడా గౌరవించాలని ఆమె తెలిపారు. భాగంగా చిన్నారులు ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణాన్ని వినిపించారు అలాగే ఉగాది పచ్చని తయారు చేశారు, రంజాన్ సందర్భంగా ఖురాన్‌ని చదివారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రెజొనెన్స్'లో 'ఉగాది' వేడుకలు



నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని శ్రీనగర్ కాలనీలో రెజొనెన్స్ స్కూల్‌లో తెలుగు సంవత్సరాది (ఉగాది) వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన తెలుగు సంవత్సరాది ఐన ఉగాది పండుగను విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి, మామిడి తోరణాలను తరగతి గదులకు అలంకరించి, నవ వసంతాన్ని స్వాగతిస్తూ షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని తమ స్నేహితులకు, ఉపాధ్యాయులకు పంచుతూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ స్వచ్ఛమైన మనస్సుతో ఆనందతన్మయత్వం చెందారు. చిరునవ్వులను చిందిస్తూ ఎంతో ఉత్సాహంగా కేరింతల నడుమ ఉగాది పండుగను జరుపుకున్నారు .పంచాంగ శ్రవణం ఎంతో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు యం.ప్రసన్నరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యేయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో రూ.కోట్లు దోచుకున్నారు...

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-వైరాటౌన్

బీఆర్ఎస్ ప్రభుత్వ పది సంవత్సరాల పరిపాలనలో రాష్ట్రం తీవ్రంగా దెబ్బ తిన్నదని, ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకున్నారని, నీటి సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని, ఇది ఎప్పటికీ జరగదని , తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వైరా నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్నదని, ఆ పరిస్థితుల్లో నీటిని మొత్తం వేస్టుగా దిగువ ప్రాంతాలకు వదిలేశారని, ఇప్పుడు బిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే నీటి కొరత ఏర్పడిందని విమర్శిస్తున్నారని అన్నారు. రైతులను రెచ్చగొట్టేందుకు, సానుభూతి పొందేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు దీక్షలు, పంటలు పరిశీలన పేరుతో నటిస్తున్నారని, రైతాంగం దీనిని అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చేస్తామని, సాగర్ జలాలతో చెరువులు, కుంటలను నింపి తాగునీటి ఇబ్బందులను తొలగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, పేదల పక్షపాతిగా వారి సంక్షేమం కోసం కష్టపడుతుందని, వేసవి కాలంలో వర్షాలు పడటం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని, ఎన్నికల ముందు వచ్చిన వర్షపు నీటిని వృధా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులు రీ డిజైన్ పేరుతో లక్షల కోట్లు దోచుకొని నాణ్యత లోపంతో ప్రాజెక్టులు నిర్మించారని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో లోపం లేకపోతే స్టోరేజీ నీటిని ఎందుకు నదులు పాలు చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి ఎన్ని కుప్పిగంతులు వేసినా రైతులు ప్రజలు నమ్మరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, డాక్టర్ దారెళ్ళి కోటయ్య, దాసరి దానియేల్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం నగరంలో సోమవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా 7వ డివిజన్ ఖానాపురంలో నూతనంగా నిర్మించిన కృష్ణుని గుడి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. అనంతరం బాలాజీనగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్లు మలీదు జగన్, దండా జ్యోతిరెడ్డి, పల్లెబోయిన చంద్రయ్య యాదవ్, లక్ష్మీ నారాయణ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



గంజాయి రవాణా, విక్రయాల నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

మల్టీజోన్ -1 ఐజీపీ ఏవి.రంగనాథ్

నవతెలంగాణ- ఖమ్మం

గంజాయి రవాణా, విక్రయాల నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు తీసుకొవాలని మల్టీజోన్-1 ఐజీపీ ఏవి.రంగనాథ్ అన్నారు. గంజాయి నియంత్రణపై ఐజీపీ ఏవి.రంగనాథ్ వివిధ జిల్లాల పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో 170 కేజీల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో పకడ్బంది చార్జ్ షీట్‌తో నలుగురికి 20ఏళ్ల జైలు శిక్ష, జరిమానా పడేలా చేసిన ఖమ్మం జిల్లా పోలీసులను ఐజీపీ అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లాండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, ఏసీపీలు రమణమూర్తి, బోజరాజు, మల్లయ్య, సిఐలు పాల్గొన్నారు.

ఠాగూర్ విద్యాసంస్థల్లో ఉగాది సంబరాలు




నవతెలంగాణ-వైరాటౌన్

స్థానిక ఠాగూర్ విద్యాసంస్థల్లో ముందస్తుగా ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో ఉగాది సందర్భంగా విద్యార్థులకు గత 26 సంవత్సరాల నుండి విద్యాసంస్థల నిర్వహణకు సహకరిస్తున్న పెద్దలకు, అన్ని రాజకీయ పార్టీ నాయకులకు, అన్ని వర్గాల ప్రజలకు ముందస్తుగా రంజాన్, ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే కాలంలో అన్ని వర్గాల ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా, సుఖంగా, ఉండాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ఉగాది పచ్చడి, స్వీట్లు పంపిణీ చేశారు. అన్ని వర్గాల ప్రజలకి ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యా సంవత్సరంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎస్ఎస్ఎస్ పిఓ లింగారావు, అధ్యాపకులు మజీద్, వేణు, నాగలక్ష్మి, లత, నరేంద్ర, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోకసభ ఎన్నికల సజావు నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



లోకసభ ఎన్నికల సజావు నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, నూతన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఖమ్మం లోకసభ నియోజకవర్గ 7 సెగ్మెంట్ల సహాయ రిటర్నింగ్ అధికారులతో నామినేషన్ సహాయక కేంద్రాల ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ, ఓటర్ నమోదు, ఇవిఎం స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు అన్ని ముందస్తు చర్యల్లో వేగం పెంచాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో విఐపి ఓటర్లను మార్క్ చేయాలని, విఐపి ఓటర్ నమోదు జాబితాలో లేనిచో వెంటనే నమోదుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా 18 - 19 సంవత్సరాల వయస్సు కలవారు 4 శాతానికి తక్కువ ఉంటే, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి నమోదులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 18 నుండి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, నామినేషన్‌లకు సంబంధించి సామాగ్రి, ఎలక్షన్ కమిషన్ నుండి నామినేషన్ ప్రింటెడ్ పత్రాలు మంగళవారం రానున్నాయని, ఈ బ్లాంక్ నామినేషన్ పత్రాలు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి, పోటీచేసే అభ్యర్థి, ప్రపోజర్ల ఓటు హక్కు ఉన్నది లేనిది చూడడం, నామినేషన్ పత్రాల పూరింపు, జతచేయు పత్రాలపై అవగాహన కల్పించడం చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లు, ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, ఆబ్సెంటీ ఓటర్లు, 85 సంవత్సరాల వయస్సు దాటిన సీనియర్ సిటీజేన్లు, దివ్యాంగులు, ఎస్సెన్షియల్ సర్వీసెస్‌లో పనిచేసే వారికి ఫారం 12, 12ఏలు తీసుకోవాలన్నారు. ఎస్ఐసి పోర్టల్ నుండి ఎవరు, ఎక్కడ పనుచేయుచున్నది నివేదిక తీసుకొని, దాని ప్రకారం చర్యలు చేపట్టారు. గత ఎన్నికలో హెూమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించిన వారికి తిరిగి కల్పించాలన్నారు. మే 3 నుండి హెూం ఓటింగ్ చేపట్టనున్నట్లు, దీనికి అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సెగ్మెంట్లలో ఇవిఎంల భద్రపర్చుటకు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలని, పోస్టల్ బ్యాలెట్లు భద్రపర్చడానికి మండల స్థాయిలో భద్రతతో కూడిన స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. సువిధ అనుమతులు నిర్ణీత కాలవ్యవధిలోగా జారీచేయాలన్నారు. ఈ సమీక్షలో శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, జెడ్పి సిఇఓ వినోద్, డిఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకులు మదన్ గోపాల్, సత్యనారాయణ, మీనన్, అధికారులు పాల్గొన్నారు.

బీవీకే పూర్వ విద్యార్థి తోట కృష్ణారావుకు గురుకుల టీజీటీ ఉద్యోగం

పలువురి అభినందనలు



నవతెలంగాణ- ఖమ్మం

ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకుడు, బివికే పూర్వ విద్యార్థి తోట కృష్ణారావుకు గురుకుల టిజిటి ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బివికే ఆధ్వర్యంలో అభినందన సభ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు బొంతు రాంబాబు, బివికే జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకొచ్చినటువంటి విద్యా కేంద్రం బివికే అని, అలాగే అధ్యయనం, పోరాటం అనే నినాదంతో విద్యారంగంలో వచ్చే సమస్యలను పరిష్కరించడంతో పాటు తన వ్యక్తిగత జీవితాన్ని కూడా పెంపొందించుకునే దాని కోసం కష్టపడి గురుకుల ఉద్యోగం సాధించిన కృష్ణారావును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీవీకే బృందం రామారావు, అఫ్జల్, శ్రీమన్నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు సాయి శేషు, ప్రజాసంఘాల నాయకులు బషీర్, తాతా భాస్కరరావు, మాదినేని రమేష్, వాసిరెడ్డి వరప్రసాద్, వరుణ్, వెంకటేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్వహణ లోపాలు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలి

- ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

నవతెలంగాణ- ఖమ్మం



తాగునీటి సరఫరాలో నిర్వహణ లోపాలు లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్డబ్ల్యుఎస్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులతో తాగునీటి సరఫరాపై ప్రిన్సిపల్ కార్యదర్శి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్ట చివరి ఆవాసం వరకు తాగునీరు అందేలా పటిష్ట కార్యాచరణ చేయాలన్నారు. పాలేరు, వైరా, దుమ్ముగూడెం రిజర్వాయర్‌లలో రాబోయే 3 నెలలకు సరిపోనూ నీరు నిల్వ ఉందన్నారు. పాలేరుకు నాగార్జున సాగర్ నుండి 2 టీఎంసీల నీరు వచ్చిందని, అధికారులు కలిసికట్టుగా పనిచేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ నాగార్జున సాగర్ నుండి నీటి విడుదలకు కృతజ్ఞతలు తెలిపారు. అంచనాల మేరకు నీరు అందినట్లు ఆయన అన్నారు.

అంతకుముందు ప్రిన్సిపల్ కార్యదర్శి జిల్లా కలెక్టర్‌తో కలిసి వైరా రిజర్వాయర్ ఇంటెక్ వెల్ సందర్శించి నీటి లభ్యతను పరిశీలించారు. రిజర్వాయర్‌లో 1.164 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నట్లు వారు తెలిపారు. మిషన్ భగీరథకు రోజూ 0.00313 టీఎంసీల నీరు అవసరం ఉండగా, రాబోయే రోజులకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నారు. అనంతరం దాన వాయిగూడెం చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. చెక్ డ్యామ్ వద్ద కావాల్సిన నీరు అందుబాటులో ఉందన్నారు. నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, జిల్లాలో తాగునీటి ఎద్దడి ఉండదని ఆయన తెలిపారు.

ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిషన్ భగీరథ ఇఎన్సి జి.కృపాకర్ రెడ్డి, మిషన్ భగీరథ సిఇ కె. శ్రీనివాస్, ఇరిగేషన్ సిఇ విద్యాసాగర్, డిపిఓ హరికిషన్, జెడ్పి సిఇఓ వినోద్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, మునిసిపల్ ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఔట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మికుల ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జీ. రామయ్య మాట్లాడారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వైద్య విధాన పరిషత్తు నుండి డిఎంఈ పరిధిలోకి జిల్లా ఆస్పత్రి మారడంతో కార్మికుల జీతాలు టెక్నికల్ కారణాలు చూయించి జీతాలు సకాలంలో చెల్లించడంలేదని, కార్మికులకు సకాలంలో జీతం లేకపోవడం ఫలితంగా కార్మికులు వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీతాలు ఇవ్వండని కాంటాక్ట్ ని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయమ్మ, వెంకటరమణ, అంబేద్కర్, ఉపేందర్, రాములమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-కల్లూరు

రోజురోజుకీ పెరుగుతున్న ఎండలు దృష్ట్యా ఉపాధి హామీ కూలీలలు ఎండ దెబ్బకు గురికాకుండా పని ప్రదేశంలో ఓఆర్ఎస్, మంచినీరు, మెడికల్ కిట్, తప్పనిసరిగా ఉండాలని ఎండీఓ చంద్రశేఖర్ ఉపాధి సిబ్బందిని, కార్యదర్శులని ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని పాయపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. కూలీలను ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు, మెడికల్ కిట్లు, ఇతర సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎండ ఎక్కువకాక ముందే ఉదయాన్నే వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రకృతి వనం, పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయటంతో అక్కడ విద్యుత్తు, తాగునీరు, మరుగ దొడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముచ్చవరం గ్రామపంచాయతీలో విశ్వనాథపురం ప్రాథమిక పాఠశాలలో సందర్శించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకోధి సంవత్సరం అంతా 'శుభాలు' జరగాలి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు తెలుగు నూతన సంవత్సర శ్రీకోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలను ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం వేరువేరు ప్రకటనల్లో తెలిపారు. నూతన సంవత్సరాన్ని ప్రజలంతా ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని కోరారు. ఉగాది పచ్చడి షడ్రుచుల సంగమంలాగే అందరి జీవితాలు మారాలని ఆకాంక్షించారు. తెలుగువారి సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఉగాది సందర్భంగా శ్రీకోధి సంవత్సరమంతా అంతా శోభాయమానంగా, సుఖసంతోషాలతో అన్ని సామాజిక వర్గాలు శుభాలతో విరిసిల్లాలని సండ్ర వెంకటవీరయ్య ఆకాంక్షించారు.

మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యకి మాతృయోగం

నవతెలంగాణ-మధిర



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) మాతృమూర్తి, సక్కుబాయి అనారోగ్యంతో ఆదివారం జగ్గయ్యపేటలో మృతిచెందారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మధిర సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రంగా హనుమంతరావు, నారాయణ, బెస్ట్ ఫౌండేషన్ విద్యాసంస్థల చైర్మెన్ బోనగిరి నారాయణరావులు సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీవీ విద్యాలయం విద్యార్థికి జిల్లాస్థాయి ప్రథమ ర్యాంకు

నవతెలంగాణ-సత్తుపల్లి



సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీవీ రామన్ స్టేట్ లెవల్ ఒలంపియాడ్ పరీక్షలో సత్తుపల్లి వీవీ విద్యాలయం మూడో తరగతి విద్యార్థి ఎం. కేశవ నందన్ జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి కేశవ నందన్‌ను అభినందిస్తూ ప్రముఖ సింగర్, సినిమా పాటల రచయిత చంద్రబోస్, లయన్ డాక్టర్ కిరణ్, సుచిర్ ఇండియా ఫౌండేషన్ సీఈవో సతీశ్‌రెడ్డి చేతుల మీదుగా యంగ్ జీనియస్ అవార్డును ప్రదానం చేశారు. ఒలంపియాడ్ ఎగ్జామ్‌లో జిల్లాస్థాయి ర్యాంకు సాధించిన కేశవ నందన్‌ను వీవీ విద్యాలయం కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గోరంట్ల వంశీకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటు నమోదుకు ఈనెల 14 చివరి అవకాశం

నవతెలంగాణ-బోనకల్

పార్లమెంట్ ఎన్నికలలో ఓటు నమోదుకు ఈ నెల 14వ తేదీ చివరి తేదీ అని తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటరు నమోదు ఈనెల 14 తో ముగుస్తుందని తెలిపారు. ఫామ్ 6 ద్వారా బీఎల్ఓ లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. క్రొత్తగా పెళ్లి అయ్యి మన మండలానికి వచ్చిన ఇదివరకే ఓటు నమోదు ఉంటే వారు ఫామ్ 8 దరఖాస్తు చేయాలని సూచించారు. క్రొత్తగా పెళ్లి అయ్యి మన మండలానికి వచ్చిన ఇప్పటి వరకు ఓటు నమోదు లేకుంటే వారు ఫామ్ 6 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ నాయకులు, గ్రామ ప్రముఖులు మీ ఓటు ఉందా లేదా ఒకసారి పరిశీలించుకొని ఎవ్వరి ఓటు లేకపోయినా క్రొత్తగా ఫామ్ 6 ద్వారా ఓటు నమోదు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికలో పోటీ చేయాలన్న, ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఒకసారి మీ ఓటు నమోదును సరి చూసుకోవాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యునిగా శీలం ఉమేష్

నవతెలంగాణ-కూసుమంచి



ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలు ఈనెల 5న ఖమ్మం పట్టణంలో మంచి కంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ మహాసభలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. దీనిలో భాగంగా మండలం నుండి శీలం ఉమేష్‌ను జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉమేష్ మాట్లాడుతూ... జిల్లా, మండలంలో ఎస్ఎఫ్ఐ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ అభినందనలు తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు లింగయ్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, రైతు సంఘం నాయకులు రమణరెడ్డి, రాజు, గురుమూర్తి, సన్మంతరావు గంగాధర్, గన్య నాయక్, డివైఎఫ్ఐ నాయకులు చక్రి తదితరులు అభినందనలు తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని సమస్యాత్మక గ్రామలైన సీతారామపురం, కొండాపురం, నర్సింహాపురం, తల్లంపాడు గ్రామాల్లో ఖమ్మం రూరల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ పోలీసులు కలిసి సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజిరెడ్డి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికలు కూడా ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. అల్లర్లు సృష్టిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 800ల మందికిపైగా బైండోవర్ చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామారావు, పుష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం

మంగళవారం | ఏప్రిల్ 09, 2024 | www.navatelangana.com

మంత్రి పొంగులేటిని కలిసి కారేపల్లి నాయకులు

నవతెలంగాణ-కారేపల్లి



రాష్ట్ర రెవిన్యూ, సమాచారా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం కారేపల్లి కాంగ్రెస్ నాయకులు కలిశారు. జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌లు కలిసిన నాయకులు మండల సమస్యలను వివరించారు. కారేపల్లి మండలంలో పర్యటించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో పర్యటను త్వరలోనే ఏర్పాటు చేసుకుందామని తెలిపినట్లు ఇమ్మడి తిరుపతిరావు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో ప్రభుత్వం పథకాలు ప్రజల దరి చేరేవిధంగా ఐక్యంగా పని చేయాలని మంత్రి సూచించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ డైరక్టర్ దేగల ఉపేందర్, నాయకులు తొగరు శ్రీను తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

- కొలతలు లేకుండా రోజు కూలి రూ.600 ఇవ్వాలి
- పెండింగ్ బిల్లులు విడదల చేయాలి
- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గ్రామాలలో ఉపాధి కూలీల పని ప్రదేశాలను ఆయన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం కాకర్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల డబ్బులను నెలలకొద్ది పెండింగ్‌లో పెడుతున్నారని, కొంతమందికి గత సంవత్సరం కూలి పైసలు సైతం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కూలీలకు వసతులు, కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ పని కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని దినాలు 200 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. మంచినీళ్ళ, టెంటు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. రెండుసార్లు ఫోటోలు అప్లోడ్స్ రద్దు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు బండి వేలాద్రి, రాంబాబు, స్వప్న, కుమారి, శ్రీలక్ష్మి, వెంకన్న, రమేష్, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలని ఎంపీడీవోకు వినతి

- పాలకులు మారిన పంచాయతీ కార్మికుల వేతలు తీరలేదు : సీఐటీయూ

నవతెలంగాణ-కారేపల్లి



పంచాయతీలలో పని చేస్తున్న జీపీ కార్మికుల వేతనాలు లేక అవస్తలు పడుతున్నారని, వారికి వెంటనే వేతనాలు విడుదల చేయాలని సోమవారం సీఐటీయు కారేపల్లి ఎంపీడీవో సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్-2023 నుండి మార్చి-2024 వరకు వేతనాలు ఇవ్వలేదని, సమ్మెకాలం నెల రోజుల వేతనంతో కలిపి 8 నెలల వేతనాలు రావల్సి ఉందని వినతిలో పేర్కొన్నారు. వేతనాలు అందక జీపీ కార్మికుల జీవనం కష్టంగా మారిందని తెలిపారు. ఈ సందర్బంగా సీఐటీయు మండలకార్యదర్శి కే.నరేంద్ర మాట్లాడుతూ పాలకులు మారిన పంచాయతీ కార్మికుల వేతలు తీరలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరించి తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయాంలో నైనా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తే 100 రోజులు దాటిన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పంధించి జీపీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపి కార్మిక సంఘం నాయకులు ఎస్‌కె. హుస్సేన్, బోళ్ల కొమరయ్య, యాదగిరి, రాంబాబు, బ్రహ్మం, పాలిక తిరుపతయ్య, అశోక్, వెంకటేశ్, మంగ, ఉమ, శ్రీను అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ నీటి పైప్

నవతెలంగాణ-కారేపల్లి



విద్యుత్‌శాఖ ట్రాన్స్ ఫార్మర్ కోసం కారేపల్లి అంబేద్కర్ సెంటర్ సమీపంలో సోమవారం ట్రాక్టర్‌తో గోయ్యి తీస్తుండగా మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలింది. దీంతో నీరు వృధ్ధాగా పోతుంది. కారేపల్లి అంబేద్కర్ సెంటర్ సమీపంలో నూతనంగా ట్రాన్స్ పార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. విద్యుత్ సిబ్బంది ట్రాక్టర్ హెూల్ మిషన్‌తో గుంత తవ్వుతుండగా అదే ప్రాంతంలో మిషన్ భగీరధ పైప్‌కు తగిలి పైపు పగిలింది. వెంటనే మిషన్ భగీరథ సిబ్బందికి తెల్పటంత వారు ఆ పైప్ లైన్ నుండి నీటి సరఫరాను ఆపివేశారు. పగిలిన పైప్ మిషన్ భగీరధ మెయిన్ పైప్ లైన్ కావటంతో కారేపల్లి క్రాస్‌రోడ్ వరకు నీటి సరఫరాకు అంతరాయం కల్గనుంది. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ చిరంజీవి వివరణ ఇస్తూ 10 గ్రామాల వరకు నీటి సరఫరా పై ప్రభావం ఉంటుందన్నారు. మంగళవారం పైప్ లైన్ మరమ్మత్తు చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో ఘనంగా ఉగాది వేడుకలు



త్రివేణి పాఠశాలలో...

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని త్రివేణి పాఠశాలలో ఉగాది పండుగ సందర్భంగా ఉత్సవం నిర్వహించారు. ఉదయమే పాఠశాల ఆవరణలో పూజానంతరం పురోహితులు కళాచార్యులు పంచాంగ శ్రవణం చేయించారు. అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఉగాది పచ్చడి ప్రసాదంగా ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడారు. ప్రిన్సిపల్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇన్‌చార్జీ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిడ్జ్‌లో....



నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో సోమవారం శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు సంబురంగా నిర్వహించారు. నూతన తెలుగు సంవత్సరానికి సాంప్రదాయ సిద్ధంగా విద్యార్థులు స్వాగతం పలికారు. పాఠశాలను మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేసి, సాంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు కనువిందు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి ప్రహరీ గోడ కూల్చిన ఘటనపై కేసు నమోదు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఇంటి ప్రహరీ గోడ, రేకులు కూల్చిన ఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చింతకాని మండలం చిన్నమండవ గ్రామానికి చెందిన తుపాకులు వజ్రమ్మకి మండలంలోని ఏదులాపురం పంచాయతీ పరిధిలో ఓ ఇల్లు ఉంది. ఆ ఇంటి ఎదుట ప్రహరీ గోడ, మెట్లు, రేకులు రహదారికి అడ్డుగా ఉన్నాయని ఏదులాపురానికి చెందిన బుద్ది భాస్కర్ కూల్చివేశాడు. ఈ ఘటనపై బాధితురాలు వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

మంచి నీటి సరఫరా కంట్రోల్ రూమ్ ప్రారంభం

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీలో వేసవి కాలం దృష్ట్యా మంచి నీటి ఎద్దడి, మంచి నీటి సమస్యపై సత్వర సమస్యలు నిర్వర్తించడానికి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మంచి నీటి సరఫరా కంట్రోల్ రూంను మున్సిపల్ కమిషనర్ అహమ్మద్ సఫి ఉల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు తాగునీటి సమస్యల పరిష్కారానికి 9963386850 ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరేష్‌రెడ్డి, మేనేజర్ రవీంద్ర, మున్సిపల్ ఆర్ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

వంశీ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

పరీక్షా కేంద్రం టెక్నిష్ కొదమ సింహం వంశి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొని సోమవారం మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ కల్లూరులోని వారి స్వగృహంలో వంశీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బైరెడ్డి మనోహర్‌రెడ్డి, పెద్ద బోయిన దుర్గాప్రసాద్, లక్కినేని రఘు, కొండూరు కిరణ్ కుమార్, కాటేపల్లి కిరణ్, బానోత్ కృష్ణ తదితరులు ఉన్నారు.



తట్ట పట్టి.. మట్టి ఎత్తిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-వేంసూరు

తట్ట పట్టి మట్టి ఎత్తి ట్రాక్టర్లలో మట్టి పోసి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ ఉపాధి హామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం మండల పరిధిలోని లింగపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో పాటు నేను మీతో పాటే అంటూ వారి కష్టసుఖాల్లో నేనున్నా అంటూ పని ప్రదేశంలో తట్టలో మట్టి ఎత్తి ట్రాక్టర్ ట్రక్కులో వేశారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. కూలీలతో ముచ్చటిస్తూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఉపాధి హామీ పని దినాలను పెంచడంతోపాటు రోజుకి 400 కూలి ఇస్తామని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఎమ్మెల్యేతో పాటు వెల్ది జగన్మోహన్‌రావు, గన్నేని సురేష్, ఎంపీటీసీ రాఘవరెడ్డి, ఎండీ.ఫక్రుద్దీన్, బొమ్మన బోయిన వెంకటేశ్వరరావు, ఫైజుద్దీన్ తదితరులు ఉన్నారు.

కోటమైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరధిలోని కొత్త లింగాల క్రాస్ రోడ్డులో గల శ్రీ శ్రీ కోట మైసమ్మ తల్లి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం జాతర కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ప్రారంభం అయిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మ వారికి కొబ్బరికాయలు కొట్టి, అమ్మవారి దీవెనలను తీసుకొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే గుడి నిర్మాణం పూర్తి చేసి అమ్మవారిని ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని భక్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు రామ్‌రెడ్డి జగన్నాథ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, సొసైటీ చైర్మెన్ గుజ్జర్లపూడి రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు రెడబోతు గోపిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులను సోమవారం ఏపీడీ వెంకటపతి రాజు పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన రేటు 350 వస్తాయని తెలిపారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కూలీలందరూ ఉదయాన్నే వస్తే కూలి అధికంగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీఓ కోటయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి పీ. వేణు, ఫీల్డ్ అసిస్టెంట్ హుస్సేన్, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు అవగాహన సదస్సు...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలో మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటరు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరీ మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరుగా నమోదైన వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సీ-విజిల్ యాప్, స్వీప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైందని,దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల నిబంధనలు, రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఏం చేయాలని, ఏం చేయకూడదు అనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్‌ను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు

నవతెలంగాణ-మధిర

పట్టణంలో మైనర్ బాలికను వేధించాడంటూ మధిర పట్టణ పోలీస్ స్టేషన్లో ఆదివారం కేసు నమోదయింది. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధిర పట్టణంలోని రాయపట్నం రోడ్డుకు చెందిన మల్ల కార్తీక్(27) మైనర్ బాలికను వేధించాడంటూ వారి తల్లిదండ్రులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ సంధ్య దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేసి వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఎస్బీఐటీలో ఘనంగా ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-ఖమ్మం

పవిత్ర రంజాన్ మాసంలో చేసిన ప్రతి త్యాగానికి 70 రెట్లు తిరిగి వస్తుందని ప్రవక్తలు బోధించినట్లు ఎస్బీఐటీ కళాశాల చైర్మెన్ గుండాల కృష్ణ తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు పలువురు ముస్లిం సోదరులను ఆహ్వానించి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జీ. రాజ్కుమార్, వైస్ ప్రిన్సిపల్ కే. అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివ ప్రసాద్, జీ.ప్రవీణ్ కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యునిగా హరీష్

నవతెలంగాణ-నేలకొండపల్లి



ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యునిగా నేలకొండపల్లికి చెందిన హరీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలు ఈనెల 5న ఖమ్మం పట్టణంలో మంచి కంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ మహాసభలలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యునిగా నూతనంగా ఎన్నికైన హరీష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐలో పనిచేయడం వల్ల అనేక విషయాలు నేర్చుకోవడం జరుగుతుందని, సమాజం, కుటుంబం పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో నేలకొండపల్లి మండలంలో ఎస్ఎఫ్ఐని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాల పట్ల హరీష్ ఆకర్షితులు కావడం జిల్లా కమిటీలో సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. అభినందనలు తెలిపిన వారిలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు, కేవీ.రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, రైతు సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు, ఏటుకూరి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు వెంకన్న, నవీన్, మధు, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

7

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | ఏప్రిల్ 09, 2024 | www.navatelangana.com



తాగునీటి ఎద్దడి తలెత్తొద్దు

ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా
- మిషన్ భగీరథ, మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-పాల్వంచ

వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడొద్దు అని, పల్లెలు పట్టణాల్లో నీటి సరఫరాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. సోమవారం కలెక్టర్ ప్రియాంక అలాతో కలిసి అశ్వాపురం మండలం, కుమ్మరిగూడెం మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ సందర్శించారు. గోదావరి నీటిని నిల్వను పరిశీలించారు. ఇంటెక్ వెల్ నుంచి ఎంత నీటి సరఫరా, మోటార్ల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రథం గుట్ట 40 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనితీరును పరిశీలించారు. అనంతరం కుమ్మరిగూడెం ఐసోలేటెడ్ హ్యాబిటేషన్ సెంటర్లో నీటి సరఫరాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ గిరిజనులతో తాగునీరు అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. రోజుకు ఎన్నిసార్లు ట్యాంకు పంపిస్తున్నారు అని అధికారులను అడగగా 5000 లీటర్ల కెపాసిటీ ఉన్న ట్యాంక్‌ను రోజుకు రెండుసార్లు సోలార్ పంపు ద్వారా నింపుతున్నట్టు అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన సోలార్ పంపు సమస్య తలెత్తినట్టయితే నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని ముందస్తుగా కరెంటు మోటార్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో కలెక్టర్ ప్రియాంక అలాతో కలసి మిషన్ భగీరథ, మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు జిల్లాలో ఉన్న నీటి లభ్యత, నీటి సరఫరా, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా పై అధికారులు పక్కా ప్రణాళికలతో సిద్ధం కావాలన్నారు. రహదారి మార్గం లేని హ్యాబిటేషన్లలో డబ్బాల ద్వారా నీటి సరఫరా చేయు నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన కలెక్టర్‌ను అభినందించారు. జిల్లాలో తాగునీటిపై తీసుకున్న ప్రణాళిక, కార్యచరణ అభినందనీయం అని తెలిపారు. జిల్లాలో నీటి లభ్యత ఉన్నదని, దానిని ప్రణాళిక బద్ధంగా ఉపయోగించి, తాగు నీటికి సమస్యలు తలుత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల, పంచాయతీ స్పెషల్ అధికారుల పరిధిలో తాగునీడి సమస్యలు నీటి లభ్యత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అధికారులు క్లోరినేషన్ టెస్టులు ఎన్నిసార్లు చేస్తున్నారని దానికి సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి డిమాండ్ పెరుగుతుందని సప్లై తగ్గుతుందని దానికి అనుగుణంగా ఖచ్చితమైన ప్రణాళికల ద్వారా నీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు సత్వరంగా స్పందించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండల, పంచాయతీ పరిధిలో నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. హ్యాండ్, పంపులు, బోర్లు పైప్లైన్ మరమ్మతులు సత్వరం పూర్తి చేయాలని తెలిపారు. తాగునీటి సరఫరా పై వస్తున్న వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.

అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో తాగునీరు, ఎస్డిఎఫ్ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని అన్ని మండలాలు, పంచాయతీలో ఎస్డిఎఫ్ పనుల పురోగతిపై వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పురోగతిపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని పనులను వారం లోగా పూర్తి చేసి సంబంధిత పనుల ఫోటోలను నివేదిక రూపంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. మండల, పంచాయతీ ప్రత్యేక అధికారులు అందరూ ప్రతిరోజు తమ పరిధిలోని నీటి సరఫరా కేంద్రాలను తనిఖీ చేయాలని, క్లోరినేషన్ ప్రక్రియ పరిశీలించి రిజిస్టర్లో సంతకం చేయాలని ఆదేశించారు. నీటి వనరులు లభ్యత లేని గ్రామాలలో రెండు రోజుల్లో బోర్లు వేయించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. మండల పంచాయతీ స్థాయిలో అధికారులందరూ నిరంతరం పర్యవేక్షణతో తాగునీటి సమస్యలను తలెత్తకుండా నిరంతరాయంగా నీటి సరఫ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, డీఆర్డిఓ విద్యాచందన, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, జడ్పీ సీఈవో ప్రసూన రాణి, భూగర్భ జల శాఖ అధికారి బాలు, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, మిషన్ భగీరథ డీఈలు, ఏఈలు, పబ్లిక్ హెల్త్, డీఈలు, ఏఈలు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-జూలూరుపాడు

పార్లమెంట్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని, ఇందిరమ్మ ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్క ఇంటికీ అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం జూలూరుపాడు మండల కేంద్రానికి చేరుకున్న పొంగులేటి, వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం వెంకటరావులకు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, పీఏసీఎస్ చైర్మెన్ లేళ్ల వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన రావుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి గృహంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలని అమలుపరచుకుంటూ ముందుకు సాగుతూ ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రతి ఒక్క పేద కుటుంబానికి అందేలా చూస్తామన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో గత అసెంబ్లీ ఎన్నికలలో అందించిన మెజారిటీ కంటే రెట్టింపైన మెజారిటీతో పార్లమెంటు అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు. 2013లో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఎంపీగా గెలుపొంది రెండేళ్ళ ప్రతిపక్షంలో ఉండి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అప్పటి అధికార పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఆ పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను అన్నారు. తాను చాలెంజ్ చేసిన విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం జరిగిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి రైతులను వంచించి...ధనార్జనే ధ్యేయంగా పాలన సాగించారన్నారు.

అనంతరం ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలు మెచ్చేలా, నచ్చేలా పాలన సాగించి సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేర్చి ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగ సీతారాములు, బొర్రా రాజశేఖర్, దారావత్ రాంబాబు, కొదుమూరి దయాకర్, అల్లాడి నరసింహారావు, దుద్దుకూరి నరసింహారావు, వేల్పుల నరసింహారావు, ఎల్లంకి చిన్న నాగేశ్వరావు, రామిశెట్టి రాంబాబు, కొదుమూరి కోటేశ్వరరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, చౌడం నరసింహారావు, పుప్పాల నరసింహారావు, పోతురాజు నాగరాజు, సాయిలి కృష్ణయ్య, ఎల్లంకి పుల్లయ్య, శిరంశెట్టి భూపతి రావు, పాలెపు భద్రయ్య, తోట శ్రీను, ఆనగంటి లక్ష్మి, కమ్మజ్యోతి, మద్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి సీతారాముల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు

రామయ్య కల్యాణానికి ముస్తాబవుతున్న భద్రాద్రి





నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలకు శుభ ఘడియలు నేటి నుండి మొదలుకానున్నవి. నేడు ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తారీకు వరకు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఈ నెల 16వ తారీఖున స్వామి వారి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఎదురుకోళ్ళ ఉత్సవాన్ని ఆలయ వైద్యక సిబ్బంది నిర్వహించనున్నారు. 17వ తారీఖున బ్రహ్మాండ నాయకుడి తిరు కల్యాణ మహోత్సవం మిథిలా స్టేడియం వద్ద అభిజిత్ లగ్నంలో వేలాది భక్తుల సమక్షంలో వైష్ణవ సంప్రదాయ బద్ధంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. 18వ తారీఖున భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేక కార్యక్రమం మహోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ సమక్షంలో ఆలయ అధికారులు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాక దేశవ్యాప్తంగా ప్రత్యేకతను సంతరించుకొనున్న సీతారాముల తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను దేవాదాయ శాఖ వారు చేస్తున్నారు. ఇప్పటికే ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలాగా స్వాగత ద్వారాలు చలువ పందిళ్ళు, విద్యుత్ కాంతులతో రామాలయ పరిసర ప్రాంతాలు కళ్యాణ శోభను సంతరించుకున్నాయి. స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు భాగంగా దేవస్థానం ఆవరణ నిర్వహించే సీతారాముల నిత్య కళ్యాణాలను నేటి నుండి ఆలయ అధికారులు నిలిపివేయనున్నారు. కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రసాదం కౌంటర్లతో పాటు తలంబ్రాల కౌంటర్లను విధిగా ఏర్పాటు చేస్తున్న అధికారులు వేసవి కాల నేపథ్యంలో స్వామి వారి జల ప్రసాదాన్ని కూడా భక్తులకు అందుబాటులో ఉంచుతున్నారు. కల్యాణ మహోత్సవానికి సంబంధించి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి అదేవిధంగా దేవాదాయ కమిషనర్‌కు తెలంగాణ రాష్ట్ర గవర్నర్లకు ఆహ్వాన పత్రికలను ఇప్పటికే ఆలయ అధికారులు అందించారు. రామయ్య తలంబ్రాలను భక్తుల ఇళ్లకు నేరుగా పంపించేందుకు ఆర్టీసీ కార్గోతో పాటు పోస్టల్ సేవలను కూడా దేవాదాయ శాఖ వారు ఉపయోగించుకుంటున్నారు. మరోపక్క సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలలో భారతీయ స్టేట్ బ్యాంకు వారు సైతం భాగస్వాములై ప్రత్యక్షంగా పరోక్షంగా వివిధ రూపాలలో సేవలందిస్తున్నారు. ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థల వాళ్ళు కూడా కళ్యాణ మహోత్సవంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా నేటి నుండి జరిగే తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి నేతృత్వంలో దేవస్థానం ఈఈ రవీంద్రనాథ్ ఇతర సిబ్బంది సమన్వయతో పని చేస్తూ ఉత్సవాలు విజయవంతానికి కావలసిన ఏర్పాట్లను చేస్తున్నారు.

వైభవోపేతంగా శ్రీదేవి వసంత నవరాత్రి మహోత్సవాలు

- ముస్తాబవుతున్న పెద్దమ్మగుడి
- గతం కంటే ఘనంగా ఏర్పాట్లు
- ఏర్పాట్లలో ఆలయ సిబ్బంది
- నేడు కలశస్థాపనతో కార్యక్రమాలు ప్రారంభం



నవతెలంగాణ-పాల్వంచ రూరల్

శ్రీదేవి వసంత నవరాత్రి మహోత్సవాలకు కేపీ జగన్నాధపురం శ్రీ కనకదుర్గ (పెద్దమ్మ తల్లి) ముస్తాబవుతుంది. మంగళవారం నుండి ఏప్రిల్ 17 శ్రీరామనవమి వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సర్వ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే విద్యుదీకరనపరులు చేపట్టారు. తొలి రోజు ఉదయం 9:30 గంటలకు కలశ స్థాపనతో ప్రారంభమవుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి సుదర్శన్ సోమవారం విలేకరులకు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టామని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు జరుపుకునే భక్తులు నగదు చెల్లించి రసీదు అనంతరం పూజలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఇతర వివరాలకు సెల్ 9866923261, 6303408458 నెంబర్లను సంప్రదించాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నవరాత్రి వసంతోత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు.

అసౌకర్యాలకు తావు లేకుండా చర్యలు చేపట్టాం



మహోత్సవాలకు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు తావులేకుండా ఏర్పాట్లు చేశాం. గత ఉత్సవాలకు మెరుగ్గా కార్యక్రమాల నిర్వహణ కొనసాగుతుంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున అధికార, రాజకీయ పార్టీలకు ఆహ్వానం లేదు. ఆలయానికి వచ్చే భక్తుల శ్రేయస్సే లక్ష్యంగా సౌకర్యాలు కల్పన జరుగుతుంది. ఆలయ ప్రతిష్టకు భంగం కలగని విధంగా భక్తులు, ప్రజలు సహకరించాలి.

- ఆలయ కార్యనిర్వహణాధికారి సుదర్శన్

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు : కలెక్టర్




నవతెలంగాణ-పాల్వంచ

తెలుగువారి పండుగలన్నీ చాలా అద్భుతంగా ఉంటాయని, వాటిలో ఉగాది పండుగ ఎంతో గొప్ప పండుగని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. సోమవారం కలెక్టర్ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పండుగ రోజున తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు, కారంతో తయారు చేసిన పచ్చడిని ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారని చెప్పారు. ఉగాది పచ్చడిలాగే మనిషి జీవితంలో ఎదురయ్యే కష్టాలు, సుఖాలు, ఆనందాలు, బాధలన్నిటికీ పచ్చడి ప్రతీక అని చెప్పారు. ఉగాది పేరులోనే యుగ ఆది అనే అర్థం ఉందని, అనగా ఈ ఏడాది ప్రారంభమని చెప్పారు. తెలుగువారికి ఉగాది పండుగతోనే సంవత్సరం ప్రారంభం అవుతుందని, సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి, చెడులను, కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుందని ఆమె చెప్పారు. ప్రజలు సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని, అభివృద్ధిలో మన జిల్లా రోల్ మోడల్‌గా, ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు.

ఉగాది ఎంతో గొప్ప పండుగ

- జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత



నవతెలంగాణ-బూర్గంపాడు

ఉగాది ఎంతో గొప్ప పండుగ అని జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత అన్నారు. మండల ప్రజలకు ఆమె సోమవారం ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువారి పండగలన్నీ చాలా అద్భుతంగా ఉంటాయని, వాటిలో ఉగాది పండుగ ఎంతో గొప్ప పండుగని ఆమె చెప్పారు. ఉగాది పండుగ రోజున తీపి పులుపు, చేదు, వగరు, ఉప్పు కారంతో తయారుచేసిన పచ్చడిని ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారన్నారు. ఉగాది పచ్చడిలాగే మనిషి జీవి తంలో ఎదురయ్యే కష్టసుఖాలు ఆనందాలు బాధల న్నిటికీ పచ్చటి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలు సుఖ సంతోషా. లతో ఆయురారోగ్యాలతో ఆనందంగా పది కాలాలపాటు చల్లగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఏడాది అందరి ఇండ్లలో సిరి నవ్వులు పూయాలని ఆమె కోరారు. ప్రతి ఒక్కరిపై దేవుని కృప ఉండాలని ఆమె అన్నారు.

ఎంపీపీ స్థానం సీపీఐ కైవసం

- ఎంపీపీగా భూక్యా పద్మావతి
- అభినందించిన ఎమ్మెల్యే కూనంనేని





నవతెలంగాణ-సుజాతనగర్

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్ష స్థానాన్ని సీపీఐ కైవసం చేసుకుంది. గతంలో ఎంపీపీపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం ఆమోదంపొందడంతో అధికారులు సోమవారం నూతన అధ్యక్ష ఎన్నికకు ఎన్నికలు నిర్వహించారు. ఎనిమిది మంది సభ్యులకుగాను ఏడుగురు సభ్యులు సమావేశానికి హాజరుకాగా సభ్యులందరూ సీపీఐ అభ్యర్థికి మద్దతుపలికారు. దీంతో సీపీఐకి చెందిన సీతంపేట బంజర ప్రాదేశిక నియోజకవర్గ సభ్యురాలు భూక్య పద్మావతి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల ప్రజా పరిషత్ అధ్యక్ష స్థానం సీపీఐ కైవసం చేసుకోవడంతో సోమవారం సీపీఐ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. నూతన ఎంపీపీగా ఎన్నికైన భూక్యా పద్మావతిని సీపీఐ మండల కార్యాలయంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అభినందించారు. పార్టీ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సుజాతనగర్ మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఎంపీపీ పదవి దోహదపడుతుందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీల ప్రజాప్రతినిధులు నిత్యం అందుబాటులో ఉంటారని, ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వందరోజుల వ్యవధిలోనే అనేక ప్రజా సమస్యలు పరిష్కరించగలిగామని, కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనజీలు, ఇతర అభివృద్ధి పనుల పూర్తిచేశామన్నారు. సుజాతనగర్ మండలంపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దుతామన్నారు.

నూతన ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో పెద్దమొత్తంలో అభివృద్ధినిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, పార్టీ జిల్లా, మండల సమితి సభ్యులకు, తనను ప్రతిపాదించిన సహ ఎంపీటీసీలకు, మిత్రపక్షాల నాయకులకేజ్ పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు. అభినందనలు తెలిపినవారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గారాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస, జిల్లా సమితి సభ్యులు భూక్య దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె.జమలయ్య, వి.పూర్ణచందర్ రావు, భూక్య శ్రీనివాస్, ఎం.ధనలక్ష్మి, నాయకులు తాళ్ల వెంకటేశ్వర రావు, భాగం శేషభూషణం, బండి రమేష్, కోమారి కృష్ణ, మురళి, మల్లేష్, వీర్ల దుర్గాప్రసాద్, భాగం కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి



నవతెలంగాణ-ఇల్లందు

స్థానిక ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు కక్షిదారుల దాహార్తి తీర్చడం కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దూర ప్రాంతం నుంచి వచ్చే కక్షిదారులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ముఖ్యంగా వయోవృద్ధులు, పిల్లలు మంచినీటి కోసం ఇబ్బందులు పడకూడదని ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్య రవికుమార్ నాయక్, జనరల్ సెక్రెటరీ సెక్రెటరీ కంపెల్లి ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కీర్తి కార్తిక్, ట్రెజరర్ సిహెచ్ నవీన్ కుమార్, సీనియర్ న్యాయవాదులు ఎస్.చెన్నకేశవరావు, మాజీ ప్రెసిడెంట్ మామిడి సత్య ప్రకాష్, జూనియర్ న్యాయవాదులు, పి.ధనంజయరావు, ఎం.మురళీకృష్ణ, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు కాంగ్రెస్ కొండంత అండ

- పినపాక శాసనసభ్యులు పాయం



నవతెలంగాణ-పినపాక

పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ కొండంత అండగా ఉంటుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథంతో కలిసి పినపాక మండలంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు కుటుంబాలను పరామర్శించడంతోపాటు పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. జానంపేట గ్రామం పొనుగోటి చందర్ రావు కుమారుడు తేజ కొద్దిరోజులక్రితం ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి భద్రాచలంలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన విషయం తెలుసుకొని వారి దగ్గరకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. అనంతరం జానంపేట గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఖదీర్, హసీనా దంపతులు, అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి దగ్గరకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం భూపతిరావుపేట గ్రామంలో సింహాద్రి నందిశ్వరరావు మహాలక్ష్మి దంపతుల కుమార్తె ప్రణవి-సిద్ధార్థ వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి (బుల్లిరెడ్డి), శ్రీనివాస్, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- ఎస్పీ రోహిత్ రాజు



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ రోహిత్ రాజు క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ తెలుగు నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిలో ఉండే షడ్రుచులు లాగా ప్రతి ఒక్కరి జీవితంలో సుఖదుఃఖాలు ఉంటాయని ఈ ఉగాది పండుగ మనకు సూచిస్తుందని తెలిపారు. తెలుగు వారందరూ ఆరంభ పండుగగా జరుపుకునే ఈ ఉగాది నుండి ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి సరఫరా, వినియోగం నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- మల్టీ జోన్ ఐజీపీ ఏవీ రంగనాథ్

నవతెలంగాణ-అశ్వారావుపేట

గంజాయి సరఫరా, వినియోగం నివారణపై పోలీస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని మల్టీ జోన్ ఐజీపీ ఏవీ రంగనాథ్ ఈ జోన్ పరిధిలోని అన్ని విభాగాల పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని స్థానిక సీఐ జితేందర్ రెడ్డి తెలిపారు. అశ్వారావుపేట సరిహద్దు మండలంగా ఉన్నందున నిఘా పెంచుతున్నట్లు సీఐ తెలిపారు.



ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి పాషా సేవలు తోడ్పాటు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి జాకరం ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమూద్ పాషా చేసే సేవలు ఎంతో తోడ్పడతాయని మర్కోడు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ బి.బాబులాల్ కొనియాడారు. ఈ మేరకు మర్కోడు కాంప్లెక్స్ పరిధిలో 16 పాఠశాలలో సంవత్సర కాలంలో ఎక్కువ రోజుల పాటు హాజరైన ప్రతి పాఠశాల విద్యార్థులకు రూ.500 చొప్పున బహుమతిగా ఇస్తానని విద్యా సంవత్సరం ప్రంభంలో ప్రకటించిన విధంగానే హెడ్ మాస్టర్ బాబులాల్ కు సోమవారం మొత్తం నగదు రూ.8000/-లు మహమూద్ పాషా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి శ్రేయస్సుకై నిత్యం పాటుపడతానని దానికి గాను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం వృద్ధిరేటు బలోపేతానికి భవిష్యత్తులో తన వంతు మరింతగా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం బాబులాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడానికే కృషి చేయడం, అదేవిధంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం, పండ్ల చెట్లను పెంచడం, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంలో పాషా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30,292 ఎకరాల్లో పామాయిల్ సాగు

- వేసవిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

నవతెలంగాణ-దమ్మపేట

ఉద్యానశాఖ ఆధ్వర్యంలో దమ్మపేట మండలంలో రైతులు సాగు చేస్తున్న పామాయిల్ పంటలను పరిశీలించి వేసవిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ మండలంలో 30,292 ఎకరాల్లో పామాయిల్ సాగు అవుతుండగా ఇందులో లేత తోటలు 13750 ఎకరాల్లో ఉన్నాయన్నారు. ఈ క్రమంలో హెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అనగా ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని దిగుబడి పెరుగుదలకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మొక్క మొదలు నుండి 2మీటర్ల లోపు దూరంలో జనుము, జీలుగు వంటి పచ్చిరొట్ట విత్తనాలను వేసుకొని పూత దశలో భూమిలో పాదల చుట్టూ కప్పుకోవాలని దీని వల్ల తేమ ఆరకుండా అధిక ఉష్ణోగ్రతలు ప్రభావం లేకుండా సేంద్రీయ ఎరువుగా పనిచేస్తుందన్నారు. అదే విధంగా ఇతర పద్ధతులపై తెలియజేశారు.

తునికాకు 50 ఆకుల కట్టకు రూ.5 ఇవ్వాలి

- బీడీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- ప్రజాపంథా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-దమ్మపేట

వేసవిలో గిరిజనులకు ఆదాయ వనరుగా ఉండే తునికాకు 50 ఆకుల కట్టకు రూ.5 ధర నిర్ణయించాలని, బీడి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించగా డివిజన్ నాయకులు కురసం ముత్యాలరావు మాట్లాడుతూ ఈ ఏడాదికి గాను తునికాకు సీజన్‌లో ఆకు సేకరణ పనులు సకాలంలో చేపట్టి ఏజెన్సీ ప్రాంత పేదలకు, ముఖ్యంగా ఆదివాసులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తునికాకు పెట్టుబడి ఖర్చులేని సహజమైన సంపదని దీనిని సేకరించడానికి కార్మికులు పడే కష్టం అంతా ఇంత కాదని అన్నారు. ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోతున్నారన్నారు. తునికాకు సేకరణకు ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వం కృషి చేస్తే లక్ష మంది పేదలు ఉపాధి పొందుతారని అన్నారు. బోనస్ బకాయిలు కార్మికులకు చెల్లించాలని, ఆకు సేకరణలో మరణించిన కార్మికులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కల్లేదారుల కమీషన్ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్లపూడి రాము, పండూరి వీరబాబు, నాగమణి, సత్యవతి, లక్ష్మి, రాజు, నాని, అజిత్, రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ బీజేపీని ఓడించాలి

నవతెలంగాణ-దమ్మపేట



త్వరలో జరుగు పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ, నియంతృత్వ బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పార్టీ కార్యాలయం సుందరయ్య భవనంలో మండల కమిటీ సభ్యులు పిల్లి నాయుడు అధ్యక్షతన మండల కమిటీ కార్యదర్శుల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ మతోన్మాద కార్పొరేట్ అనుకూల విధానాల పట్ల దేశవ్యాప్తంగా తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతుందని, 10సంవత్సరాల మోడీ పాలనలో రాజ్యాంగాన్ని మార్చేసి మనుధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ భావజాలం వైపు తీసుకుపోయేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. అంతే కాకుండా కులమత ప్రాంతీయ భాష విదేశాలను రెచ్చగొట్టి మతాన్ని రాజకీయ అస్త్రంగా వాడుకొని రాముని గుడి పేరిట మత భజన చేస్తూ దుర్మార్గమైన ధోరణితో పరిపాలన సాగిస్తుందని అన్నారు. ఈ మతతత్వ నియంతృత్వ బీజేపీని ఓడించాలని వచ్చే ఎన్నికల్లో లౌకిక పార్టీలను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మోరంపూడి కేశవరావు, పెనుబల్లి నానారావు, కొలికిపోగు శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు, భోగ్యం నరసింహారావు, పిట్టలపోలమ్మ, గోపిరాజు, సత్యం, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- ఈవో హరిక్రిష్ణ

నవతెలంగాణ - అశ్వారావుపేట

పట్టణంలోని మూడు రోడ్ల ప్రధాన కూడలిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో సోమవారం కలెక్టర్ ప్రియాంక అలా ఆదేశాలు మేరకు చలివేంద్రం ప్రారంభించామని ఈవో హరిక్రిష్ణ తెలిపారు. పోలీస్ స్టేషన్ ముందు ఒకటి, సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో మరొకటి మొత్తం మూడు చలివేంద్రాలు అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ- బూర్గంపాడు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిరుపేద ముస్లీంలకు సోమవారం రంజాన్ కిట్లను అబూబక్ర్ సిద్ధిక్ మసీద్ ఆధ్వర్యంలో మసీద్ అధ్యక్షులు, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు గుల్మహ్మద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ముస్లీం తన సంపాదనలో జకాత్ రూపంలో సంపాదన శుద్ధి చేసు కోవడం కోసం పేద ముస్లిం కుటుంబాలకు అందజేస్తారని తెలిపారు. ఇది ముస్లింలకు ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ ట్రెజరర్ లాల్మహ్మద్, అబ్దుల్ అజీజ్, రసూల్, టిప్పు సుల్తాన్, సాధిక్, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

'కారు' కూతలే..!

- కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'పార్టీ ఫిరాయింపు'పై కేటీఆర్ ట్వీట్
- ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల విమర్శలు
- తెల్లం చేరికను జీర్ణించుకోలేకపోతున్న బీఆర్ఎస్ శ్రేణులు
- గత రెండు పర్యాయాలు కేసీఆర్ చేసిందేంటి..? అని ప్రశ్నలు
- ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని వ్యాఖ్యలు
- పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోను కచ్చితంగా అమలంటున్న కాంగ్రెస్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

'కాంగ్రెస్ మేనిఫెస్టోలో రాజ్యాంగ పరిరక్షణ' అనే చాప్టర్ 13వ పాయింట్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీకి వెళితే వెంటనే డిస్‌క్వాలిఫై అయ్యేలా చట్ట సవరణ చేస్తాం' అనే పాయింట్ ఆధారంగా సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు చేసిన ట్వీట్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఏకైక బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడంతో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెల్లం చేరికను జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుందని, గత రెండు పర్యాయాలు కేసీఆర్ చేసిందేమిటి? అనే ప్రశ్నలను కాంగ్రెస్ నేతలు లేవనెత్తుతున్నారు. పార్టీ మార్పుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేసి తీరుతామని అంటున్నారు. బీఆర్ఎస్ నేతల 'కారు' కూతలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

నువ్వు నేర్పిన విద్యయే...!

పార్టీ ఫిరాయింపులను విచ్చలవిడిగా ప్రేరేపించింది బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. మేజిక్ ఫిగర్ 60 కాగా 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ 63 స్థానాలను నెగ్గింది. 2018 ఎన్నికల్లో 88 సీట్లు దక్కించుకుంది. కానీ ఈ రెండు పర్యాయాల్లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పదింట ఒకే ఒక స్థానాన్ని టీఆర్ఎస్ నెగ్గింది. 2014లో కొత్తగూడెం నుంచి జలగం వెంకట్రావు, 2018లో ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్‌కుమార్ టీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచారు. 2014లో వైఎస్ఆర్‌సీపీ నుంచి గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నుంచి నెగ్గిన పువ్వాడ అజయ్, కోరం కనకయ్యను బలవంతంగా పార్టీ మార్పించిన చరిత్ర అప్పటి సీఎం కేసీఆర్‌ది అని విమర్శలు చేస్తున్నారు. 2018లో మ్యాజిక్ ఫిగర్ దాటి 18 సీట్లు అదనంగా వచ్చినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 19 మందిలో 12 మందిని పార్టీ మార్పించారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నుంచి నెగ్గిన కందాల ఉపేందర్‌రెడ్డి (పాలేరు), రేగా కాంతారావు (పినపాక), బాణోత్ హరిప్రియ (ఇల్లెందు), వనమా వెంకటేశ్వర్లు (కొత్తగూడెం), టీడీపీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య (సత్తుపల్లి), మెచ్చా నాగేశ్వరరావు (అశ్వారావుపేట)తో పాటు స్వతంత్ర ఎమ్మెల్యే రాములునాయక్ (వైరా)ను పార్టీ ఫిరాయింపజేసి రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రాతినిధ్యం లేకుండా చేశారని, సంపూర్ణ మెజార్టీ ఉన్నా కాంగ్రెస్‌ను అస్థిరపరిచారని ఐఎన్‌సీ నేతలు ధ్వజమెత్తుతున్నారు. అటువంటి బీఆర్ఎస్ నేతలు తగదునమ్మా...అంటూ వ్యాఖ్యలు చేస్తుండటంపై మండిపడుతున్నారు.

భయపెట్టట్లే...ప్రలోభ పెట్టట్లే..!

గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాదిరిగా ఎమ్మెల్యేలను భయపెట్టో...ప్రలోభపెట్టో చేర్పించుకోవడం లేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.20 కోట్లకు పైనే లేదంటే రూ.వందల కోట్ల ప్రయోజనాలు బీఆర్ఎస్ అధినేత సమకూర్చారనే టాక్ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. తెల్లం వెంకట్రావు మొదటి నుంచి కాంగ్రెస్ నేత, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగానే ఉన్నారని...ఆయనే స్వచ్ఛందంగా వస్తే పార్టీలోకి ఆహ్వానించిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. తెల్లం చేరికను జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు లేని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోకు కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు.



కేటీఆర్ ట్వీట్


పార్టీలో చేరుతున్న తెల్లం వెంకట్రావు

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం : సీడీపీఓ రోజా రాణి

నవతెలంగాణ-అశ్వారావుపేట

బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఎవరైనా బాల్య వివాహాలు చేసినట్లయితే చట్ట పరమైన చర్యలు తప్పవని సీడీపీఓ రోజా రాణి హెచ్చరించారు. కనీస వయస్సు లేకుండా వివాహాలు చేస్తే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని, కనీసం 18 ఏండ్లు ఆడపిల్లలకు, 21 ఏండ్లు మగ పిల్లలకు వయస్సు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని వివరించారు. మండలంలోని గుమ్మడవల్లి, కొత్త మామిళ్ళ వారిగూడెం ప్రభుత్వ పాఠశాలలు, అనంతారం ఆశ్రమ పాఠశాలల్లో సోమవారం బాల్య వివాహాలు - వాటి అనర్థాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయటం వల్ల చదువు మధ్యలోనే మానేసే ప్రమాదం ఉందని, మనిషి మేధస్సుకు విద్య ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అంతేకాకుండా చిన్న వయస్సులో పెండ్లి చేయటం వల్ల కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించ లేక మానసికంగా ఒత్తిడికి గురవుతారని తెలిపారు. బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులతో పాటు పెండ్లికి హాజరయ్యే బంధువులు, ఇతరులపైనా చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు నాదెళ్ళ సౌజన్య, వరలక్ష్మి, స్వరాజ్యం, పాఠశాలల హెచ్ఎంలు టి.శ్రీనివాసరావు, శేషు కుమారి, పి. ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలి
- ఆర్‌డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

నవతెలంగాణ-అశ్వాపురం

వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా పల్లెలు, పట్టణాల్లో నీటి సరఫరాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. సోమవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి అశ్వాపురం మండలం, కుమ్మరిగూడెం మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ సందర్శించారు. తొలిత కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛన్ని అందజేసి ఆహ్వానించారు. అనంతరం గోదావరి నీటిని నిల్వను పరిశీలించారు. ఇంటెక్ వెల్ నుంచి ఎంత నీటి సరఫరా జరుగుతుంది, మోటార్ల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రథం గుట్ట 40 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల పనితీరును పరిశీలించారు. అనంతరం కుమ్మరిగూడెం ఐసోలేటెడ్ హ్యాబిటేషన్ సెంటర్లో నీటి సరఫరాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రథం గుట్ట సమీపంలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామంలో అక్కడి గిరిజనులతో తాగునీరు అందుతుందా లేదా అని అడిగి తెలుసుకుని, ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. రోజుకు ఎన్నిసార్లు ట్యాంకు పంపిస్తున్నారు అని అధికారులను అడగగా 5000 లీటర్ల కెపాసిటీ ఉన్న ట్యాంక్ ను రోజుకు రెండుసార్లు సోలార్ పంపు ద్వారా నింపుతున్నట్టు అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన సోలార్ పంపు సమస్య తలెత్తినట్లయితే నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని ముందస్తుగా కరెంటు మోటార్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి, మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్సీ సదాశివకుమార్, డీఆర్డిఓ విద్యాచందన, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, జెడ్పీ సీఈవో ప్రసూన రాణి, భూగర్భ జల శాఖ అధికారి బాలు, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, మిషన్ భగీరథ డీఈలు, ఏఈలు, పబ్లిక్ హెల్త్, డీఈలు ఏఈలు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మల చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి ఫారెస్ట్ అనుమతులు

- అభివృద్ధి ప్రదాతకు కృతజ్ఞతలు తెలిపిన పేరయ్య, అతహార్

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

గుండాల మండల పరిధిలోని మామకన్ను గ్రామం నుంచి కరకగూడెం మండలంలోని బట్టుపల్లి గ్రామం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా.. ఆళ్ళపల్లి, మామకన్ను గ్రామాల మధ్య ఉన్న కిన్నెరసాని, జల్లేరు వాగులు కలిసే రెండు వాగుల గడ్డపై గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం పనులకు ఫారెస్ట్ శాఖ అనుమతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో వచ్చాయని, ఉమ్మడి పాత మండల ప్రజల తరుపున అభివృద్ధి ప్రదాత(తుమ్మల)కు కృతజ్ఞతలు ఇల్లందు పట్టణం, ఆళ్ళపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కనగాల పేరయ్య, మొహమ్మద్ అతహార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 2వ తేదీన మంత్రి తుమ్మల ఇల్లందు పర్యటనలో ఉండగా ఆళ్ళపల్లి మండలంలో సుమారు దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోని పలు ప్రధాన సమస్యలు, నిర్మాణం దశలో ఆగిన పనులను నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తుమ్మల హామీ ఇచ్చిన వారంలోపే ఫారెస్ట్ అనుమతులు లేక సంవత్సరాల తరబడి నిలిచిన బ్రిడ్జి నిర్మాణం పనులకు అనుమతులు ఇప్పించడం తుమ్మల పరిపాలన దక్షతకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. 1983 నుంచి నేటి వరకు ఆళ్ళపల్లి మండలంలో అభివృద్ధి పనులైన రాయిపాడు గ్రామం వద్ద కిన్నెరసానిపై బ్రిడ్జి, అనంతోగు గ్రామం వద్ద మధ్యలో ఆగిన వంతెన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంలో తుమ్మల కృషి ఎనలేనిదని కొనియాడారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలైన ఆళ్ళపల్లి, గుండాల మండలాలు నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉండటానికి తుమ్మలన నాంది పలికారని తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఆళ్ళపల్లి మండల కేంద్రం నుండి అనిశెట్టిపల్లి గ్రామం వరకు 35 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు మంజూరు చేయడానికి, అలాగే మామకన్ను గ్రామం నుంచి మర్కోడు మీదుగా బట్టుపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు మంజూరు, అనుమతుల కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, ఇల్లందు నుంచి ఆళ్ళపల్లి మండలానికి ఆర్టీసీ బస్సు నడిపించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.



ప్రభుత్వం మారినా పోడు సమస్య మారలేదు..!

- అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు భట్టు సురేష్

నవతెలంగాణ - ఆళ్ళపల్లి

ప్రభుత్వం మారినా పోడు రైతుల సమస్య (తీరడం) మారడం లేదని స్థానిక అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టు సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసులలో పట్టాలు కొంతమందికి ఇచ్చి, అనేక మంది అమాయక ఆదివాసుల నుండి వేల ఎకరాలు లాక్కోవడం జరిగిందని వాపోయారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ గత ప్రభుత్వం తరహాలోనే రైతులను ఏమాత్రం పట్టించుకోకపోగా మరల రైతుల నుండి భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తుందని, మండల పరిధిలోని వెంకటాపురం, గుడ్డేలుగు గుంపు గ్రామాలకు చెందిన మాడే భీమయ్య, మాడే లక్ష్మయ్యలతో సహా ఆరుగురు రైతుల నుండి 30 ఎకరాల భూమిని ఫారెస్ట్ అధికారులు ఆక్రమించుకుని ఆదివాసీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇకనైనా ఆదివాసీ ప్రజల పోడు భూముల పై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలు ఆపాలని లేదంటే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు బత్తిని సత్యం, ఎల్లబోయిన ఉప్పయ్య, భద్రయ్య, మండల నాయకులు పూనెం లక్ష్మణ్, కుంజ ఎర్రయ్య, పూనెం బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శి

నవతెలంగాణ-సుజాతనగర్

మండల పరిధిలోని మెయిన్ రోడ్డు నందు గ్రామపంచాయతీ నిధులతో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బి.నరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో ఎండలు ఎక్కువగా ఉన్నాయని, గ్రామస్తులు ఏమైనా పనులు ఉంటే ఉదయం పూట చేసుకోవాలని మధ్యాహ్నం వేళలో ఎవరు బయటకు రావద్దని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు, అధికార యంత్రాంగానికి, ఉద్యోగులకు, కార్మిక వర్గానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త క్రోధ నామ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తెలుగు ప్రజలు కొత్త ఏడాదిలో ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా, సుఖ:సంతోషాలతో గడపాలని, ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలి ఆకాంక్షించారు. విద్యార్థులు, యువకులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఈ లక్ష్యాల సాధనకు శ్రమించాలని శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం సేకరణ కేంద్రాలకు స్థలాలు కేటాయించాలి

- డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ధాన్యం సేకరణ కోసం సొసైటీలకు స్థలాలు కేటాయించాలని డీసీసీబీ డైరెక్టర్, నారాయణపురం పీఏసీఎస్ అధ్యక్షులు నిర్మల పుల్లారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏటా స్థలాలు లేక ధాన్యం సేకరణలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయివేట్ వ్యక్తులు స్థలాలు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారని, కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక ప్రయివేట్ వ్యాపారులు నేరుగా రైతుల వద్దకు వెళ్ళి తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, ధాన్యం నిల్వ చేసేందుకు కొనుగోలు కేంద్రాల్లో స్థలాలు లేకపోవటంతో గత్యంతరం లేక రైతులు ప్రయివేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందక ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు .నియోజకవర్గ మండలాల్లోని ఏ సొసైటీకి సొంత స్థలాలు లేవని, రైతుల సంక్షేమం దృష్ట్యా సొసైటీలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాలు కేటాయించి తోడ్పాటు నివ్వాలని ఆయన సూచించారు.

డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ప్రతి పీహెచ్‌సీలో ఓఆర్ఎస్‌ను అందుబాటులో ఉంచాలి
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.శిరీష

నవతెలంగాణ-జూలూరుపాడు

ఎండల తీవ్రత దృష్ట్యా డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. సోమవారం జులూరుపాడు పబ్లిక్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడికి వైద్యం కోసం వచ్చే రోగులతో వారికి అందుతున్న సౌకర్యాలపట్ల వారితో కాసేపు మాట్లాడి, అక్కడ వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పబ్లిక్ హెల్త్ సెంటర్ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, వడదెబ్బ కేసుల తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అలాగే ఓఆర్ఎస్ స్టాక్‌ను ఎల్లప్పుడూ చూసుకోవాలని, ఎండ దెబ్బ నుంచి రక్షణ కోసం పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ వెంట వైద్య అధికారులు, పీహెచ్సి వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

నలుగురిపై బైండోవర్ కేసు


నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని సులానగర్, కొత్త తండా, 9వ మైలు తండకు చెందిన నలుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ అచ్చారావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ గ్రామాల్లో గతంలో నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ నాగ భవాని ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. అనంతరం పూచికత్తుపై విడుదల చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పాషా, సిబ్బంది తులస్య, ఈసీ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

రామయ్య పెండ్లికి స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి

- ఆర్డీవో

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఈనెల 17, 18వ తేదీలలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం పట్టాభిషేకం మహోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు అధికారులతో సహకరించాలని భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో భద్రాచలంలో స్వచ్ఛంద సంస్థలు, అధికారులతో భక్తులకు కల్పించవలసిన వసతి సౌకర్యాల గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నందున భక్తులు ఎండ వేడిమిని సైతం లెక్కచేయకుండా స్వామివారి కల్యాణం తిలకించడానికి తప్పకుండా కుటుంబ సభ్యులతో వస్తారని అందుకు ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు స్వచ్ఛమైన మంచినీరు మజ్జిగ పాకెట్లు సరఫరా చేస్తున్నారని, అందుకు స్వచ్ఛంద సంస్థలు మీరు ఈ అధికారులకు సహకరించి మీ సంస్థ ద్వారా వాటర్ పాకెట్లు, మజ్జిగ పాకెట్లు భక్తులందరికీ అందే విధంగా చూడాలని ఏ ఒక్క భక్తుడు అసౌకర్యాన్ని గురికాకుండా చూడవలసిన బాధ్యత మన పైన ఉన్నందున ఎక్కువ శాతం మీ స్వచ్ఛంద సంస్థ ద్వారా వాలంటీర్స్‌ని నియమించి అందరికీ మంచినీరు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని ఆయన అన్నారు. భక్తులు కల్యాణం తిలకించేటప్పుడు తప్పనిసరిగా సెక్టార్లలో కూడా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందేలా సంబంధిత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు. మజ్జిగ ప్యాకెట్లు మంచినీరు సరఫరా చేసే వాలంటీర్లకు ప్రతి సెక్టార్ కు వెళ్లడానికి గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, హెచ్ఈఓ దుర్గయ్య, జీపీఈఓ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, విజయలక్ష్మి, దామోదర్ రావు, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెల్లంతో బలరాం నాయక్‌కి కుదిరిన మైత్రి

- కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే రాకను స్వాగతించిన బలరాం నాయక్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



బీఆర్ఎస్ పార్టీలో గెలిచి నియోజకవర్గం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావుని మహబూబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ భద్రాచలంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడుతూ... భద్రాచల నియోజకవర్గ అభివృద్ధి కోసం తెల్లం వెంకటరావు తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి వర్గ ఆదిపత్య పోర్లు లేవని భవిష్యత్తులో కూడా అవి ఉండవని బలరాం నాయక్ అభిప్రాయపడ్డారు. సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని 10 సంవత్సరాల పాటు కలవకుట్ల కుటుంబం దివాలా తీయించిందని తెలంగాణ పునర్మానం జరగాలంటే అది కాంగ్రెస్ తోనే సాధ్యమని అభిప్రాయపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మానుకోటలో రెండు లక్షల మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అదేవిధంగా ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ కలిసి పనిచేసే రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ మహబూబాద్ పార్లమెంటులో తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దమ్మపేట



మండలంలోని దమ్మపేట గ్రామంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు, మసీద్ కమిటీ ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. వారికి మసీద్ కమిటీ వారు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పేదవాళ్ల పడే ఆకలి బాధలు తెలుసుకోవడానికి రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల ముఖ్య ఉద్దేశ్యమని, అంతేకానీ ఆకలి బాధలతో జీవించాలనేది ఇస్లాం ఉద్దేశ్యము కాదు అని తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

నవతెలంగాణ-కొత్తగూడెం



నిరుపేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా టీఎస్ఆర్ ట్రస్టు వారి సౌజన్యంతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం తాండ్ర నాగబాబు తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నిరుపేదలకు అండగా సీపీఐ(ఎం) పోరాడుతుందని అన్నారు. టీఎస్ఆర్ ట్రస్ట్ కూడా పేదలకు నిరంతరం సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. నిరుపేద ముస్లింలకు పండుగ సందర్భంగా తోఫా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కొత్తగూడెం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేష్, పట్టణ కమిటీ సభ్యులు డి.వీరన్న ఎస్.లక్ష్మి, బాలకృష్ణ, నందిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాల పంపిణీ

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు బూడిద గడ్డ బస్తీలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా టీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ తాండ్ర వెంకటేశ్వరరావు సహకారంతో రంజాన్ తుఫాను పంపిణీ చేశారు. సుమారుగా రూ.50వేల విలువైన తోఫాల అందజేశారు. సందర్భంగా టీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు తాండ్ర నాగబాబు మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మెన్ తాండ్ర వెంకటేశ్వరరావు పాల్వంచకు అయన వారి నాన్న పేరు మీద టీఎస్ఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. గత నాలుగు సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మారెడ్ల నరసింహారెడ్డి, రావూరు వీరభద్రం, అక్కినేనిపల్లి ప్రేమ్, గోరెబాబు, పంతంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీకనకదుర్గ అమ్మవారి పొంగళ్ళ జాతర

- ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని సారపాక గాంధీనగర్లో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ వారి దేవాలయంలో 4వ పొంగళ్ళ జాతర మహోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ పొంగళ్ళ జాతర మహోత్సవాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇతి బాధలు, ఎటువంటి వ్యాధి బాధలు పడకుండా పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అమ్మ వారికి పొంగళ్ళు సమర్పిస్తారు. ఈ పొంగళ్ళ మహోత్సవంలో ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారికి పొంగళ్ళు సమర్పిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఆలయ కమిటీ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా మంచినీటి సదుపాయం వంటి మౌళిక సదుపాయాలను సమకూర్చారు. ఈ నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయం వద్దకు చేరుకున్న ఈయనకు దేవస్థాన కమిటీ సభ్యులు మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. దేవస్థానం ఆవరణంలోకి రాగానే ఆలయ ప్రధాన అర్చకులు వెల్ది-శివసాయికుమార్ శర్మ పరివట్టం కట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీకనకదుర్గమ్మ చిత్రపటాన్ని కమిటీ సభ్యుల చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడారు. అనంతరం ఆయన చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవాలయ గౌరవ అధ్యక్షుడు అజ్మీరా రాంజీ నాయక్, అధ్యక్షుడు పప్పు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సిలివేరు వీరాంజనేయులు, సహాయ కార్యదర్శి నాగులంచ రమేష్, కార్యవర్గ సభ్యులు భూక్య రమేష్, కర్రి జగన్నాధరావు, పాలిన రమేష్, కానూరి మోహన్రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు

చంద్రుగొండ : వేసవిలో దాహర్తి తీర్చడానికి చలివేంద్రం చేసినట్టు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి అశోక్ అన్నారు. సోమవారం చంద్రుగొండ ప్రధాన సెంటర్లో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు మరింత తీవ్రమవుతున్నాయన్నారు. ప్రధాన కోడల్లో చలివేంద్ర ఏర్పాటు చేయాలన్నారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మరమ్మతులకు గురైన చేతిపంపులను రిపేర్ చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఉపేందర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాజేష్ కు 'ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం'

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణానికి చెందిన యువకవి రాజేష్‌కు 'ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం' దక్కింది. ఖమ్మంకు చెందిన వికాస వేదిక సాహిత్య సంస్థ ఉగాది పురస్కారంతో సన్మానించింది. ఉగాది సందర్భంగా వికాస వేదిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన "ఉగాది కవి సమ్మేళనం"లో వికాస వేదిక అధ్యక్ష కార్యదర్శులు ప్రముఖ కవి, నంది అవార్డు గ్రహీత సాదనాల వేంకటస్వామి నాయుడు, అభ్యుదయ కవులు లెనిన్ శ్రీనివాస్, బుక్కా సత్యనారాయణ చేతుల మీదుగా రాజేష్‌కు "ఉగాది విశిష్ట పురస్కారాన్ని" అందజేశారు. సాహితీ రంగంలో రాజేష్ కనబరుస్తున్న ప్రతిభకు గాను తనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్టు వారు తెలిపారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో రాజేష్ గజల్ గానం కవులను అలరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు మువ్వా శ్రీనివాస్, ఆంగోతు జయవాసు, మేడగాని శేషగిరి, వురిమళ్ళ సునందా తదితర కవులు, కళాకారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు నష్టం కలిగించే మెమోను ఉపసంహరించుకోవాలి

- ఐసీడీఎస్ డీడబ్ల్యూఓకు వినతి

నవతెలంగాణ-పాల్వంచ



అంగన్వాడీ టీచర్లకు నష్టం కలిగించే మెమో 1334 తక్షణమే ఉపసంహరించుకోవాలని అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జిలుకర పద్మ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐసీడీఎస్ డీడబ్ల్యుఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గతంలో అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో 24 రోజుల సమ్మె చేసి పోరాటాల ద్వారా సాధించుకున్న టీచర్‌కు రెండు లక్షలు, ఆయాకు ఒక లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను యధావిధిగా అమలు చేస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చి ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం 1334 మెమో ద్వారా రూ.లక్ష మాత్రమే బెనిఫిట్స్ ఇస్తామని, హెల్పర్స్‌కు రూ.50,000 ఇస్తామని 65 సంవత్సరాలు నిండిన టీచర్లు, ఆయాలను ఇంటికి పంపేందుకు సిద్ధమైందని చెప్పడం సరినది కాదని అన్నారు. తక్షణమే ఈ మెమో రద్దు చేయాలని అన్నారు. 40 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకుంటూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలు పేద పిల్లలకు గర్భిణీలకు, బాలింతలకు, మెరుగైనటువంటి పౌష్టికాహారం అందిస్తూ అనేక ఆరోగ్య గురించి సలహాలు, సూచనలు ఇస్తూ శిశుమరణాలను బాలింత మరణాలు రక్తహీనతను అరికట్టడం ముఖ్య పాత్ర పోషిస్తున్నటువంటి టీచర్లు, హెల్పర్లకు రూ.లక్ష ఇస్తామని, ఆసరా పెన్షన్ ఇస్తానని చెప్పడం సరైనది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఏ సర్వే చేయాలన్నా జనన మన సర్వే విఎల్‌వో సర్వే అనేక ప్రభుత్వ సర్వేలన్నీ అంగన్వాడీ టీచర్లే కరెక్ట్ చేస్తారని చెప్పే అటువంటి ప్రభుత్వం వారికి మెరుగైనటువంటి రిటైర్మెంట్స్ సౌకర్యం ఎందుకు కల్పించట్లేదని అన్నారు. పెండింగ్ లో ఉన్న గ్యాస్ బిల్లులు ఇంటి అద్దెలు, ఈవెంట్ డబ్బులు, ఆరోగ్య లక్ష్మి బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కే.సత్య సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు సహాయ కార్యదర్శిలు, జిల్లా కమిటీ సభ్యులు పద్మ, కళావతి, మరియ, సూరమ్మ, అచ్చమ్మ, రమ్య, శైలజ, జ్యోతి, జయ, చంద్రకళ, పద్మ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఓపెన్ కాస్ట్ కార్మికులకు పనివేళలు మార్చాలి

- సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ వల్లూరు

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ఓపెన్ కాస్ట్ కార్మికులకు పనివేళలు మార్చాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ వల్లూరు వెంకటరత్నం డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయని ఓపెన్ కాస్ట్‌లో బయట ఎండలు కన్నా రెండు డిగ్రీలు ఎక్కువగానే నమోదు అవుతాయని కావున సింగరేణి కార్మికులకు పని వేళలు మార్చాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు సప్లై చేయాలని కోరారు. సింగరేణి కార్మికులను ఎండల నుండి రెండు నెలలు రక్షించాలన్నారు. వారు సింగరేణి ఉత్పత్తికి పూర్తిగా సహకరిస్తారని గుర్తించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ సమావేశంలో లక్ష్మణరావు, ఈశ్వరరావు, రామ్మూర్తి, కలశం రాజు, విల్సన్ రాజు, ప్రభాకర్ రావు, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, సుమన్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

నవతెలంగాణ-కొత్తగూడెం

మరో రెండు రోజుల్లో రంజాన్ పండుగ జరుపుకునే ఆనందంలో ఉన్న ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఇంటో యువకుడికి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన కొత్తగూడెంలో చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని రామవరం ప్రాంతంలోని 7 నెంబర్ బజార్‌లో నివాసం ఉంటున్న షోయబ్ (24) యువకుడు వాటర్ కూలర్ రిపేర్ చేస్తున్న క్రమంలో మోటర్ విద్యుత్ వైర్ ప్రామాదవశాత్తు తగిలి విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. ప్రమాదానికి గురైన వెంటనే కుటుంబ సభ్యులు గమనించి విద్యుత్ నిలిపివేశారు. బాదితున్ని కొత్తగూడెం పట్టణంలోని ప్రయివేటు అసుపత్రికి తరలించారు. అప్పటికే షోయబ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద సంఘటనపై రామవరం 2వ టౌన్ పోలీస్‌లు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధార్థ్ మహంతికి ఘన సన్మానం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం కార్యవర్గం సిద్ధార్థ్ మహంతి మిల్లు మేనేజర్, ఐటీసీ పీఎస్పిడి సారపాక పదోన్నతి పొంది వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ ఐటీసీ పీఎస్పిడి హైదరాబాద్‌కి బదిలీ అయిన సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్సిఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా.ఎస్.ఎల్.కాంతారావు మాట్లాడుతూ... పేద ప్రజలు, గిరిజన సంక్షేమం కోసం ఐఆర్సిఎస్ చేపట్టిన కార్యక్రమాలకు క్షయవ్యాధి నివారణ, అంధత్వ నివారణ కోసం కంటి వైద్యశిబిరాల నిర్వహణకు సిద్ధార్థ్ మహంతి పూర్తి సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. అలాగే తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని గుర్తించడానికి రూ.5 లక్షల విలువ గల 1800ల డయాగ్నస్టిక్ కిట్లను ఐటీసీ అందించినట్టు డా.ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. దీని వలన ఐఆర్సిఎస్ రక్త కేంద్రంలో ఉచితంగా తలసేమియా, సికిల్సెల్ వ్యాధి నిర్ధారణా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవే పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్లలో చేయాలంటే రూ.2500లు ఖర్చవుతుందని తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని వచ్చే 5 సంవత్సరాలు కొనసాగించాలని ఆయన సిద్దార్థ మహంతిని కోరారు.

అనంతరం సిదార్థ మహంతి మాట్లాడుతూ తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా రక్తహీనత వ్యాధి ఏజన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధికంగా ఉందని, దీనిని నివారించాల్సిన ఆవశ్యకత అందరి బాధ్యత అని, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత సేవలను ఏజన్సీ ప్రజలు అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో పేద ప్రజలు, గిరిజనుల సంక్షేమం కోసం, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణ కోసం నిర్వహించే రక్త పరీక్షలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రానికి వ్యాధి నిర్ధారణ కిట్స్ అందజేయడానికి ఐటిసి పీఎస్పిడి తగు సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.ఎల్.కాంతారావు, ఐఆర్సీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ప్రణవ్ శర్మ, యూనిట్ హెడ్ ఐటిసి పీఎస్ పిడి లిమిటెడ్ సారపాక పి.శ్యామ్ కిరణ్, జనరల్ మేనేజర్ హెచ్ఎర్ డి. చెంగల్రావు, మేనేజర్ (హెచ్ఐర్), కార్యవర్గ సభ్యులు వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, ఎ.జగదీష్, డా.భానుప్రసాద్, డా.పి.రాజశేఖర్, పల్లంటి దేశప్ప, జి.కామేశ్వరరావు, బి.వెంకట్ రెడ్డి, డా.జి.వి.వి. సుదర్శన్రావు, ఆది ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అందరితో మాట్లాడాకే రైల్వేలైన్ ఫైనల్ చేద్దాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కూసుమంచి



డోర్నకల్-గద్వాల్ రైల్వే లైన్ పాలేరు నియోజకవర్గంలో ఏయే గ్రామాల్లో నుంచి వెళుతుందో ఇంకా కొంత క్లారిటీ రావాల్సి ఉందని, ఆ రైల్వేలైన్ రూట్ మ్యాప్ వచ్చాక ఒక కమిటీగా కూర్చొని అందరం కలిసి మాట్లాడుకుని, రైతులకు నష్టం లేకుండా తక్కువ నష్టంతో ఏ విధంగా చేయాలో అందరి సలహా మేరకే చేద్దామని రాష్ట్ర రెవెన్యూ, గృహ సమాచార శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా కొద్దిమంది రైతులు రైల్వేలైన్ తమ గ్రామాల నుండి వెళుతుందనే విషయం ప్రస్తావించగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైల్వే లైన్ కేంద్ర ప్రభుత్వం పరిధిలోని విషయమని, కేంద్ర రైల్వే డిపార్ట్మెంట్ నుండి ఒక ఉన్నతాధికారితో మాట్లాడి రైతులకి తక్కువ నష్టంతో పోయే విధంగా ఒక రూట్ మ్యాప్‌ను తయారుచేసి ఆ రూట్ మ్యాప్ ఆధారంగా ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే మన ఏరియాలో రైల్వే లైన్ పనులు ప్రారంభం చేద్దామని, అప్పటి వరకు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పణితి వరలక్ష్మికి నివాళి

వైరాటౌన్ :



వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి ఏడవ వార్డు కౌన్సిలర్ పణితి ఉషా సైదులు, నాగార్జున, తల్లి పణితి వరలక్ష్మి మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రెవెన్యూ గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారి ఇంటికెళ్లి పణితి వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలేసి నివాళి అర్పించారు. అనంతరం పణితి సైదులు కుటుంబ సభ్యులను మంత్రి పొంగులేటి ఓదార్చారు. వీరితో పాటు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా మండల అధ్యక్షుడు శీలం వెంకట్ నర్సిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బీడీకే రత్నం, మచ్చా బుజ్జి, దాసరి దానియేలు, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, మిట్టపల్లి నాగి, సూర్యదేవర శ్రీధర్, చెరుకూరి కిరణ్, జలాధి రామకృష్ణ, చల్లా సతీష్, రేచర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విజబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ

- విస్తృత తనిఖీలతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కట్టడి
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం



చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు పోలీస్ యంత్రాంగం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. సోమవారం జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో విజిబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రణలో ఉంటాయని, సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణాను అరికట్టడానికి వాహన తనిఖీలు ముమ్మరం చేశామని అన్నారు. వాహనాల తనిఖీలలో నిబంధనలు ఉల్లంఘించిన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై జరిమానాలతో పాటు ర్యాష్ డ్రైవింగ్ , మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు.అదేవిధంగా దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేలా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని అన్నారు. అనుమానిత వ్యక్తులు గాని, వాహనాలు గాని తారసపడితే వాటి గురించి పూర్తి వివరాలను సేకరించి, అనంతరం వారికి వెసులుబాటు కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్ఏఐ సర్వేను పరిశీలించిన హ్యూమన్ రైట్స్ సభ్యులు

నవతెలంగాణ-మధిర

గత కొన్ని రోజులుగా మధిర-ఖమ్మం, మధిర-విజయవాడ ఆర్ అండ్ బీ రోడ్డుపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు నిర్వహించు సర్వేలో సోమవారం మధిర హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొని సర్వే వలన ఉపయోగాలు, సూచనలు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట వెంకట్, తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ కన్నెపోగు వెంకటేశ్వర్లు (కేవీఆర్) పాల్గొన్నారు.

అన్నదానం

నవతెలంగాణ-మధిర

జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు కుమారుడు లింగాల అభ్యుదయ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఘనంగా ఆదరణ ఫౌండేషన్‌లో, మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నియోజక వర్గ కన్వీనర్ కోన సరేందర్‌రెడ్డి, పట్టణ యువజన విభాగం నాయకులు ముత్తవరపు ప్యారి, మధిర మండల యువజన నాయకులు అబ్బూరి రామన్, బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం నాయకులు వాల్మీకి పవన్, దిల్, టినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగం

నవతెలంగాణ-బోనకల్

బీజేపీ పరిపాలనలో భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ.ఉపేంద్ర సాహూ ఆందోళన వ్యక్తం చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ మధిర నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం చింతకాని మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి మధిర నియోజకవర్గ అధ్యక్షులు దారేల్లి రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ. ఉపేంద్ర సాహూ, జిల్లా ఇంచార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నది, ఈ దేశంలో భారత రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ మాత్రమే నని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సభ ఈనెల 21 న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు మధిర నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో బహుజన్ సమాజ్ పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, మధిర అసెంబ్లీ ఇంచార్జ్, జిల్లా కార్యదర్శి పల్లెపొంగు విజయ్ కుమార్, జిల్లా ఈసీ మెంబర్ పి. రాజశేఖర్, చింతకాని మండల అధ్యక్షులు ఉసికల నవీన్, ముదిగొండ మండల అధ్యక్షులు నెమలి శ్రీకాంత్, అసెంబ్లీ నాయకులు కుమార్, ప్రభాకర్, సీహెచ్ సైదులు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన పెంచుదాం

నవతెలంగాణ-నేలకొండపల్లి



మంచినీటి పొదుపు, వాడకంపై ప్రజలందరికీ సంపూర్ణ అవగాహన పెంచుదాం! భావితరాల భవిష్యత్తుకు భద్రత కల్పిద్దామని స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ చల్లా కోటేశ్వరరావు(కోటయ్య) అన్నారు. ఇటీవల బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన నేరెళ్ల శ్రీనివాసరావును సోమవారం జిల్లా కోర్టులో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి శాలువతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చల్లా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి త్రాగునీరు, సాగునీరుకు తీవ్ర కొరత ఏర్పడి మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు, అభివద్ధి జరుగుతున్న మరోవైపు అదే తరహాలో అనివార్యంగా ప్రకృతికి విరుద్ధంగా చేస్తున్న పనులు వస్తున్న మార్పులు తీవ్ర వాతావరణ కాలుష్యానికి గురై భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగాను, మన దేశంలో కూడా అనేక చోట్ల నీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వనరులన్నింటినీ కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగా ప్రస్తుత భూగర్భ జలాలు అడుగంటిపోవడం, తీవ్ర నీటి కొరత కారణంగా నీటిని పొదుపు చేయాల్సిన ఆవశ్యకతపై అవగాహన పెంచాలన్నారు. గత అనేక ఏళ్లుగా స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలతో పాటు ప్రకృతి వనరులను కాపాడుకోవడంపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుత మండుతున్న వేసవిలో ప్రజలు మంచినీటి కొరతకు గురి కాకుండా పొదుపుగా నీటిని వాడుకోవడంపై అవగాహన సదస్సు నిర్వహించేందుకు జిల్లా బార్ అసోసియేషన్ తరపున సహాయ, సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. అందుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్‌రావు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో ప్రజలందరూ తమ బాధ్యతగా భావించి భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

నవతెలంగాణ-వైరాటౌన్



రంజాన్ పండుగ జరుపుకోలేని నిరుపేద కుటుంబాలు ఆనందోత్సవాల మధ్య రంజాన్ పండుగ జరుపుకోవాలనే లక్ష్యంతో వైరా మున్సిపాలిటీ పరిధిలోని హజ్రత్ అలి ఇబ్నే అబీ తాలిబ్ మసీదుకి సంభదించిన అల్ ఫలాహ్ యూత్ కమిటీ సభ్యుల కృషి, దాతల సహకారంతో విరాళాలు సేకరించి మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 45 నిరుపేద కుటుంబాలను గుర్తించి అల్ ఫలాహ్ యూత్ కమిటీ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో ఒక్కో నిరుపేద కుటుంబానికి 15 కేజీల బియ్యం, ఏడు రకాల నిత్యావసర వస్తువులతో పాటు కొంత నగదును సోమవారం రంజాన్ తోఫా కింద పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ మీరా సాహెబ్, యూత్ కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్, యూత్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ రహీం ఖురేషి, సెక్రటరీ పఠాన్ యాకుబ్ జానీ, ట్రెజరరీలు షేక్ సలీం, షేక్ నయీం, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గడిచిన ఆనవాళ్లు దిశానిర్దేశం చేస్తాయి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

నవతెలంగాణ-కల్చరల్



చరిత్రను వాస్తవిక దృష్టితో చూడాలి.. గగిచిన ఆనవాళ్లు వర్తమానంలో దిశా నిర్దేశం చేస్తాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. బ్రిటిష్ వారు మనకు ఇచ్చిపోయిన బానిస చరిత్రనే ఇప్పటి వరకు బోధించారన్నారు. చరిత్రను ఎవరి దృక్పథంలో వారు వ్యాఖ్యానించుకునే శాస్త్రీయత ఉండాలని అన్నారు. "జస్టిస్ ఆవుల సాంబశివరావు పురస్కారాలు 2023"కు గాను ప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు ఆచార్య వకులాభరణం రామకృష్ణకు, 2024కు గాను మనసు ఫౌండేషన్ స్థాపకులు మన్నం వెంకట రాయుడుకు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఎన్‌టీఆర్ కళా వేదికపై వెంకయ్య నాయుడు పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. ఆవుల సాంబశివరావు నిబద్ధత, నిజాయితీ కలిగిన న్యాయమూర్తిగా పేరు పొందారన్నారు. ఆయన నిరాడంబర వ్యక్తిత్వం, తెలుగు భాష సంస్కృతి పట్ల గౌరవం కలవారని చెప్పారు. తెలుగు భాష సంస్కృతి పట్ల యువతలో ఆసక్తి తగ్గుతోందని, నూతన విద్యా విధానం మాతృభాషలో విద్య బోధనకు సముచిత స్థానం ఇచ్చిందని తెలిపారు. ఆంధ్రుల చరిత్రపై లోతైన అధ్యయనం జరిగి సమగ్రంగా రావల్సి ఉందన్నారు. పురస్కార గ్రహీతల్లో ఒకరు చరిత్ర పరిశోధకులు కాగా, మరొకరు తెలుగు భాషా ప్రేమికులు అని అభినందించారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కిషన్‌రావు మాట్లాడుతూ.. ఆవుల సాంబశివరావు నిబద్ధత కలిగిన మానవతామూర్తి అన్నారు. మాజీ ఉపాధ్యక్షులు ఆచార్య ఆవుల మంజులత మాట్లాడుతూ.. తెలుగులో తీర్పులు లోకాయుక్తగా తమ తండ్రి ఆవుల సాంబశివరావు ఉన్న సమయంలో ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం పాలకుల విధానాల వల్ల తెలుగే కాదు మరే భాషా సరిగా రాని పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్‌లో అంతరించి పోతున్న భాషల్లో తెలుగు కూడా చేరుతుందన్న ఆందోళన ఉందన్నారు. ఎంతో విజ్ఞాన విషయాలు తెలుగు భాషలో ఉన్నాయని తమ తండ్రి సాంబశివరావు చెప్పేవారని గుర్తు చేశారు. పురస్కార గ్రహీత ఆచార్య వకులాభరణం రామకృష్ణ మాట్లాడుతూ.. భాషా సంస్కృతులు ప్రజల ఆదరణతోనే నిలుస్తాయని, తెలుగు భాష నేర్చుకున్న వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటే.. భాష పది కాలల పాటు ఉంటుందని చెప్పారు. మరొక పురస్కార గ్రహీత వెంకట రాయుడు.. మనసు ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ స్వాగతం పలికిన కార్యక్రమానికి రెడ్డి శ్యామల వ్యాఖ్యానం చేశారు.

ఏ మత బోధనల్లోనూ విద్వేషం, శతృత్వం, హింస భాగం కాదు



జొహెన్స్ బర్గ్ : ఏ మత బోధనల్లోనూ విద్వేషం, శతృత్వం, హింస భాగం కాదని మహాత్మాగాంధీ మనవరాలు, దక్షిణాఫ్రికా శాంతి కార్యకర్త ఎలా గాంధీ పేర్కొన్నారు. మతం పేరుతో ఈ చర్యలను ప్రోత్సహించే హిందూ విశ్వాసాలను వ్యక్తిగత కారణాలతో తప్పుగా విశ్లేషిస్తున్నారని, అలాంటి వారికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. విభజనలు, విద్వేషాలను రెచ్చగొట్టే అలాంటి శక్తులను ప్రతిఘటించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ చర్యలు హిందూ ముస్లింల మధ్య విభజనలను సష్టించడంతో పాటు గాంధీజీని, తనను హిందూ కమ్యూనిటీ నుంచి వేరుచేయడానికి చేసే ప్రయత్నమని ఎలా గాంధీ పేర్కొన్నారు. ఫీనిక్స్ సెటిల్‌మెంట్ దర్బాన్‌లో నిర్వహించిన సర్వమత సమావేశంలో గాంధీ డెవలప్‌మెంట్ అండ్ ఫీనిక్స్ సెటిల్‌మెంట్ ట్రస్ట్ ఉద్దేశపూర్వకంగా హిందూ ప్రార్థనలను విడిచిపెట్టిందన్న సోషల్‌మీడియా పోస్టులపై ఆమె పైవిధంగా స్పందించారు. దర్బన్, జోహెన్స్ బర్గ్‌లోని టోల్‌స్టాయ్‌లలో మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీ ఈ సమావేశాలను ప్రారంభించారు. అప్పటి నుండి ప్రతి ఏడాది నిరవధికంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎలా గాంధీ ఫీనిక్స్ సెటిల్‌మెంట్ ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. మన విశ్వాసాలు, మత గ్రంథాలు తమను మంచి మార్గంలో నడిచేందుకు, ప్రజలపై దయ, ప్రేమ వ్యక్తం చేసేందుకు రూపొందించారని అన్నారు. వాస్తవాలను బహిరంగంగా వెల్లడించడం చాలా ముఖ్యమని, తద్వారా ప్రస్తుతం జరుగుతున్న దుశ్చర్యలను అరికట్టవచ్చని ఎలా పోస్ట్ చేసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో హిందూ ప్రార్థనలను పఠించాలని పలువురు హిందూ నేతలను ఆహ్వానించానని, కానీ వారు ఆహ్వానాన్ని తిరస్కరించారని అన్నారు. 120 సంవత్సరాలలో ఉద్దేశపూర్వకంగా ఓ కమ్యూనిటీని విడిచిపెట్టారని ఎప్పుడూ నిందించలేదని అన్నారు.

ఏపీది వ్యూహాత్మక ఆలస్యం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్


కృష్ణా జలాల్లో నీటి వాటాలను తేల్చే విషయంలో కేడబ్ల్యూడీటీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించడం లేదని తెలంగాణ సర్కారు విమర్శించింది. ఎన్నికలు ఉన్నాయని తెలిసినా ముందుగా స్పందించలేదని వ్యాఖ్యానించింది. తీరా ఎన్నికల కోడ్ వచ్చాక అపద్ధర్మ ప్రభుత్వం ఉందంటూ సాగదీత వైఖరిని అవలంభించడం సరికాదని తప్పుబట్టింది. తెలంగాణ వాదనకు కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ) సైతం అంగీకరించింది. ఈమేరకు ఏప్రిల్‌లో 19లోగా స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్(ఎస్‌వోసీ) సమర్పించాలని ఏపీని ట్రిబ్యునల్ ఆదేశించింది. మే 15 నుంచి 19 వరకు మళ్లీ విచారణ చేస్తామని ప్రకటించింది. సోమవారం న్యూఢిల్లీలోని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) కార్యాలయంలో కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్-2 చైర్మెన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర విచారణ చేపట్టారు. ఇందులో తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, ఏపీ తరపున జయదీప్‌గుప్తా వాదనలు వినిపించారు. కృష్ణా జలాల్లో నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్‌కు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ట్రిబ్యునల్ విధులు నిర్వర్తించాలి. కేడబ్లూడీటీ నిర్దేశాల ప్రకారం రెండు రాష్ట్రాలు స్టేట్‌మెంటు ఆఫ్ కేస్‌కు సంబంధించి రాతపూర్వకంగా వాదనలు సమర్పించాల్సి ఉంది. కాగా ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం గత మార్చి 20న ఎస్‌వోసీ సమర్పించింది. ఏపీ తన వాదనలను సమర్పించేవరకు తెలంగాణ వాదనలు బయటపెట్టరాదని విజ్ఞప్తి చేసింది. కాగా ఏపీ మాత్రం ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఎస్‌వోసీ సమర్పించలేదు. అంతేగాక ఎస్‌వోసీ సమర్పించడానికి జూన్ నెలాఖరు వరకు సమయం కావాలంటూ మధ్యంత దరఖాస్తు(ఐఏ)ను దాఖలు చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం వాదనలు చేసింది. రాష్ట్రంలో ఎన్నికల నిబంధనావళి అమల్లో ఉన్నందున ఎస్‌వోసీ సమర్పణ సాధ్యం కాదని ట్రిబ్యునల్‌కు ఏపీ విజ్ఞప్తి చేసింది. జూన్ నెలాఖరు వరకు సమయం కావాలనీ, అప్పటి వరకు ఎన్నికల ఫలితాలు వస్తాయని చెప్పింది. దీనికి తెలంగాణ న్యాయవాది వైద్యనాథన్ తన వాదనలు వినిపిస్తూ ఇది వ్యూహాత్మంగా ఆలస్యం చేయడమేనని చెప్పారు. డిసెంబరు 2023 చివరలో, జనవరి 2024 ప్రారంభంలోనే ఏపీ అధికారులకు ఎన్నికల గురించి తెలుసని వాదించారు. ఏపీ ప్రభుత్వం ఆదేశాలు, భారత ఎన్నికల సంఘం ప్రోసీడింగ్‌లను ట్రిబ్యునల్‌కు సమర్పించారు. దీంతో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అభ్యర్థనలను దాఖలు చేస్తే, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్టు కాదని వివరించారు. దీంతో చైర్మెన్ స్పందిస్తూ ఇది చివరి అవకాశమనీ స్పష్టం చేశారు. దీన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. వాస్తవానికి ఏపీ వాదన సరికాదని, సుప్రీంకోర్టు వేసిన రిట్‌పిటిషన్ నేపథ్యంలోనే ఎస్‌వోసీ దాఖలులో ఏపీ సర్కారు జాప్యం చేస్తున్నదని స్పష్టం చేసింది. ఈ తరుణంలో సోమవారం జరిగిన విచారణలో ఏపీ మధ్యంతర విన్నపాన్ని ట్రిబ్యునల్ ఆమోదించింది. చివరి అవకాశాన్ని ఇస్తూ ఏప్రిల్ 29 లోగా ఎస్‌వోసీ దాఖలు చేయాలని సూచించింది. రెండు వారాల్లోగా తెలుగు రాష్ట్రాలు తమ కౌంటర్లను సమర్పించాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చేనెల 15కు వాయిదా వేసింది. ఇదిలావుండగా ఏపీలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ట్రిబ్యునల్‌ను కృష్ణా జలాల అంశంపై విచారణకు అనుమతించడం కేంద్రంలోని బీజేపీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధిపొందడానికేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



విజేతలు తక్కువే...!

- పెరుగుతున్న మహిళా అభ్యర్థుల సంఖ్య
- అయినా లోక్‌సభలో అడుగు పెట్టింది కొద్ది మందే
- ధనబలం, కండబలాన్ని తట్టుకోవడం కష్టమవుతోందన్న నిపుణులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. 1957 ఎన్నికల్లో కేవలం 45 మంది మహిళలు మాత్రమే పోటీ చేయగా గత లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ సంఖ్య 726కి పెరిగిందని ఎన్నికల కమిషన్ వద్ద ఉన్న సమాచారం చెబుతోంది. అదే సమయంలో పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరుగుతోంది. 1957లో పార్లమెంటులో 4.5% మంది మహిళలు మాత్రమే ఉండగా 2019లో వారి ప్రాతినిధ్యం 14.4%కి పెరిగింది. లోక్‌సభకు పోటీ చేస్తున్న





పురుష అభ్యర్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. 1957లో 1,457 మంది పోటీపడగా గత ఎన్నికల్లో 7,322 మంది పురుషులు బరిలో నిలిచారు. ఒక్క మాటలో చెప్పాలంటే పురుష అభ్యర్థుల సంఖ్య ఐదు రెట్లు పెరిగితే మహిళా అభ్యర్థుల సంఖ్య ఏకంగా 16 రెట్లు పెరిగింది. 1957లో లోక్‌సభకు పోటీ చేసిన అభ్యర్థుల్లో కేవలం 2.9% మంది మాత్రమే మహిళలు. 2019లో ఆ సంఖ్య 9%కి పెరిగింది. అయితే మహిళా అభ్యర్థుల సంఖ్య ఇప్పటి వరకూ వెయ్యి దాటకపోవడం గమనార్హం.

పోటీ చేస్తున్నారు కానీ...

1957లో జరిగిన రెండో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ పడిన 45 మంది మహిళా అభ్యర్థుల్లో 22 మంది (48.88%) విజయం సాధించారు. అయితే అప్పటి నుండి మహిళా అభ్యర్థుల్లో విజేతల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన 726 మంది మహిళల్లో కేవలం 78 మంది (10.74%) మాత్రమే లోక్‌సభలో అడుగు పెట్టారు. పురుష అభ్యర్థుల విషయానికి వస్తే 1957లో 31.7% మంది గెలుపొందగా గత ఎన్నికల్లో కేవలం 6.4% మంది మాత్రమే విజేతలయ్యారు. పోటీ పడిన వారిలో విజేతలవుతున్న వారి సంగతి పక్కన పెడితే లోక్‌సభ ఎన్నికల్లో తలపడుతున్న పురుష, మహిళా అభ్యర్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. చట్టసభలో స్థానాలు మాత్రం అప్పటి నుండి అలాగే ఉన్నాయి.

పార్టీల్లో చిత్తశుద్ధి లేదు

గణాంకాలను పరిశీలిస్తే భారతీయ ప్రజాస్వామ్యం పరిణితి చెందుతోందని, మహిళలు అధిక సంఖ్యలో ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకుంటున్నారని 'పొలిటికల్ శక్తి' అనే స్వచ్ఛంద సంస్థ సహ వ్యవస్థాపకుడు, రాజకీయ విశ్లేషకుడు తారా కృష్ణస్వామి వ్యాఖ్యానించారు. పోటీ పడుతున్న పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం అధికంగా ఉంటోందని, మహిళలకు పోటీ చేసే అవకాశాలు తక్కువగా ఉండడమే దీనికి కారణమని నిపుణులు తెలిపారు. మహిళలకు గెలిచే అవకాశాలు అధికంగానే ఉన్నప్పటికీ వారిని పోటీకి నిలిపే విషయంలో రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి లేదని మహిళా హక్కుల కార్యకర్త, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ డైరెక్టర్ రంజనా కుమారి అభిప్రాయపడ్డారు.

ఒకవేళ మహిళలకు టిక్కెట్లు ఇచ్చేందుకు పార్టీలు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ వారిని క్లిష్టమైన నియోజకవర్గాల్లో నిలుపుతున్నారని ఆమె చెప్పారు. కండబలం, ధనబలం అధికంగా ఉన్న బలమైన పురుష అభ్యర్థులతో వారు తలపడాల్సి వస్తోందని అంటూ అలాంటప్పుడు అందరికీ సమానావకాశాలు ఎలా లభిస్తాయని ప్రశ్నించారు.


ఉచిత చేప,రొయ్య పిల్లలకు

సొసైటీల ఖాతాలో నగదు జమ చేయాలి

- టెండర్ల పంపిణీలో పదేండ్లుగా జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలి :టీఎంఎంకేఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎండిన చెరువులు, కుంటల లీజులను రద్దు చేయాలని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం(టీఎంఎంకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ అధ్యక్షతన గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కృష్ణ మాట్లాడుతూ కరువు ప్రభావంతో రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఎండిపోయాయని తెలిపారు. దీంతో మత్స్య పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్య కారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ఏడాది చేప, రొయ్యపిల్లల పంపిణీ టెండర్ల విధానం కాకుండా మత్స్య సొసైటీల ఖాతాల్లో నగదు జమచేయాలని విజ్ఞప్తి చేశారు. పదేండ్ల నుంచి చేపల, రొయ్యల పంపిణీ



టెండర్లలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యపరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిని నియమించాలని కోరారు. సుమారు పది లక్షల మత్స్యకార కుటుంబాలు ఈవృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్నాయని తెలిపారు. దాదాపు 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4.20లక్షల మంది సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా వారి అభివృద్ధికి తగిన కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారని, మరో పక్క పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పట్టణాల్లో రసాయనాలను డ్రైనేజీని చెరువులు, కుంటల్లోకి వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మత్స్య సంపద అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాలకు గురైన చెరువులు, కుంటలు, జలవనరులను గుర్తించి కాపాడాలని డిమాండ్ చేశారు. పదేండ్లలో మత్స్య శాఖలో ఎన్‌సీడీసీ నుంచి తెచ్చిన రూ. వెయ్యి కోట్ల రుణాలు, సంక్షేమ పథకాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వృత్తి ప్రమాదంలో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియో, ఇన్సూరెన్స్ అందక ఆయా కుటుంబాలు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు.

ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాల మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఎన్నికలు జరిపి రాష్ట్ర ఫెడరేషన్‌కు కూడా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకన్న, మామిళ్ల జగదీష్ పాల్గొన్నారు.

ఎండల్లో ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు జరుగుతాయి. వీటిలో నాలుగు రాష్ట్రాల్లో ఆ రోజు ఉష్ణోగ్రతలు 38-40 డిగ్రీల మధ్య ఉండవచ్చునని వాతావరణ శాఖ చెబుతోంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పుదుచ్చేరి, రాజస్థాన్ రాష్ట్రాలలోని కొన్ని నియోజకవర్గాల్లో తొలి దశలో పోలింగ్ జరుగుతుంది. ఈ రాష్ట్రాల్లో ఈ నెల 5వ తేదీ నుండి మే 2 వరకూ...అంటే సుమారు నెల రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయట.

పోలింగుకు వారం ముందు నుండే...

తొలి దశ పోలింగుకు ముందు వారం రోజుల పాటు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటేస్తాయి. తొలి దశ పోలింగ్ జరిగే రోజు కొన్ని నియోజకవర్గాల్లో 38-40 డిగ్రీలు, మరికొన్ని చోట్ల 34-38 డిగ్రీలు, ఇంకొన్ని స్థానాల్లో 34-36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు. పశ్చిమ ప్రాంతంలో మాత్రం 34 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతే నమోదవుతుందట. ఇక రెండో దశ పోలింగ్ జరిగే 26వ తేదీన దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటతాయి. వీటిలో మధ్య, తూర్పు, ఉత్తర ప్రాంతాలు ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం 32 డిగ్రీల కంటే తక్కువగానే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అంటోంది.

ఆరోగ్యంపై ప్రభావం

అధిక ఉష్ణోగ్రతలు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరించారు. ముఖ్యంగా ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యే రాజకీయ ర్యాలీలలో ఈ ప్రమాదం అధికంగా ఉంటుంది.

ఎందుకంటే వారు గంటల తరబడి తమ నాయకుల కోసం మండుటెండలో ఎదురు చూస్తుంటారు. గత సంవత్సరం మహారాష్ట్రలో జరిగిన ఓ భారీ ర్యాలీ సందర్భంగా వేలాది మంది ప్రజలు ఎండలోనే ఆరేడు గంటల పాటు సభాస్థలిలో కూర్చోవాల్సి వచ్చింది. ఫలితంగా వడదెబ్బకు గురై 14 మంది ప్రాణాలు కోల్పోయారు. వడగాల్పుల ప్రభావం ప్రత్యక్షంగానే కాదు...పరోక్షంగా కూడా ఉంటుంది. ఎండలో కూర్చోకపోయినా వృద్ధులు వడదెబ్బ కారణంగా అస్వస్థతకు గురవుతారు. డీహైడ్రేషన్ కారణంగా గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఉంది.

గాలిలో తేమ ఉంటే...

ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తక్కువ ఉన్నప్పటికీ మన ఆరోగ్యం గాలిలో తేమపై ఆధారపడి ఉంటుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉంటే శరీరం నుండి చమట త్వరగా విడుదల కాదు.

శరీరం చల్లబడకుండా అది అడ్డుకుంటుంది. దీనివల్ల గుండెపోటు రావచ్చు. వాతావరణం చల్లగా ఉండే సమయంలో పోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద హైడ్రేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ వేసవిలో పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థాయి కంటే అధికంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే శరీరాన్ని చల్లబడనివ్వవని, దీనివల్ల మరునాడు ఉదయం శరీరంపై ఒత్తిడి ఏర్పడుతుందని వారు చెప్పారు.

బీఆర్ఎస్ తప్పిదాలతోనే కరువు

- కాళేశ్వరం నీళ్లు లేకపోవడం ఎవరి వైఫల్యం?
- బీఆర్ఎస్, బీజేపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం : రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ పదేండ్ల తప్పిదాల వల్లే రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అధికారం కోల్పోయిన ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్‌పై బురద జల్లేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి సోమవారం ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో విలేకరుల సమావేశంలో



మంత్రి మాట్లాడారు. రైతాంగంపై కపట ప్రేమ చూపుతూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి, కృష్ణ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా పడిన దృష్ట్యా కొన్నిచోట్ల నీరందని మాట వాస్తవమేనని అంగీకరించారు. ఇది కాంగ్రెస్ తీసుకొచ్చిన కష్టం ఏమాత్రం కాదని స్పష్టం చేశారు. వర్షాకాలం పూర్తయ్యాక తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. అధికారం లేదనో.. ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారనో.. అక్కసుతో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదన్నారు. గోదావరి, కృష్ణా నది పరివాహకంలో 56శాతం వర్షపాతం తక్కువగా కురిసిందని ఆనాడు త్రీ మ్యాన్ కమిటీ, కేఆర్ఎంబీ కమిటీ తేల్చింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అప్పట్లో మీరు దీనిపై లెటర్లు రాసిన మాట మరిచి కాంగ్రెస్‌పై అబాండాలు వేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడంతో కిందకు నీళ్లు వదిలింది మీరు కాదా? అని నిలదీశారు. రూ.46వేల కోట్లతో నెలకొల్పిన మిషన్ భగీరథ పథకం చిన్నపాటి కరువుకే తాగునీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉంటే ఎవరి వైఫల్యం అనాలి? అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ బాగోతాన్ని ఆడబిడ్డలు గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. 'ముసలి కన్నీరు కారుస్తూ' బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌పై చేస్తున్న విమర్శలను యావత్ తెలంగాణ ప్రజానీకం గమనిస్తోందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో మీకు, మీకు ఏ టీంగా ఉన్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ మరోమారు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

యూట్యూబ్ ఛానెల్స్ బ్లాక్‌పై డీయూజే ఆగ్రహం

- ఐటీ చట్టం దుర్వినియోగమవుతున్నదని ఆరోపణ
- మోడీ సర్కారు తీరుపై ఖండన

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు డిజిటల్ హిందీ న్యూస్ ఛానెల్ 'బోల్తా హిందుస్థాన్' యూట్యూబ్ ఛానెల్ తొలగించబడింది. ఈ ఛానెల్ 2015 నుంచి ప్రసారమవుతున్నది. న్యూస్ ఛానెల్ ఎడిటర్ సమర్ రాజ్ ఈ అంశంపై స్పందించారు. యూట్యూబ్ ఛానెల్‌ను బ్లాక్ చేయటానికి ఎలాంటి కారణాన్ని కూడా తమకు అందించలేదని చెప్పారు. ఈ విధంగా సోషల్ మీడియా ఛానెల్స్‌ను బ్లాక్ చేయటంపై ఢిల్లీ యూనియన్



ఆఫ్ జర్నలిస్ట్స్ (డీయూజే) ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ప్రభుత్వ తీరును ఖండించింది. సోషల్ మీడియా, ఖాతాలను మూసివేయటానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2021 దుర్వినియోగం పెరిగిపోతున్నదని ఆందోళనను వ్యక్తం చేసింది.

దీనిని మీడియా బెదిరింపుగా అభివర్ణించింది. బ్లాక్ అయిన ఇతర ఛానెళ్లతో పాటు ప్రస్తుత ఛానెల్‌ను కూడా వెంటనే పునరుద్ధరించాలని డీయూజే డిమాండ్ చేసింది. "సోషల్ మీడియా ఛానెల్‌లు, హ్యాండిల్ షట్‌డౌన్‌లు తరచుగా జరుగుతున్నాయని మేము గమనించాము. ఈ ఏడాది ఫిబ్రవరి 27న 'ఆర్టికల్19-ఇండియా' ఫేస్‌బుక్ ఖాతా పరిమితం చేయబడింది.

గతేడాది నవంబర్ 27న యూట్యూబ్ మీడియా స్టార్ వరల్డ్ ఛానెల్ ఆకస్మికంగా రద్దైంది. అయితే నిరసనల తర్వాత దాన్ని పునరుద్ధరించారు. గతేడాది ఆగస్టులో గ్రామీణ భారత్‌పై నివేదికలు అందించే వార్తా వెబ్‌సైట్ 'గావ్ సవేరా' సోషల్ మీడియా హ్యాండిల్‌లు ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనల మేరకు బ్లాక్ చేయబడ్డాయి. జర్నలిస్ట్ మన్‌దీప్ పునియా తన ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాలను బ్లాక్ చేసే చర్య బహుశా రైతుల ఆందోళనపై తన విస్తృతమైన కవరేజీని ఆపివేసినట్టు చెప్పారు. అలాగే, 'ది కాశ్మీర్ వాలా' వెబ్‌సైట్, సోషల్ మీడియా ఖాతాలు గతేడాది ఆగస్టులో భారత్‌లో నిలిపివేయబడ్డాయి"అని డీయూజే ఒక ప్రకటనలో పేర్కొన్నది.

ఐటీ రూల్స్, 2021.. పౌరులు, సంస్థల ప్రాథమిక భావ వ్యక్తీకరణ హక్కును ఉల్లంఘిస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నదని వివరించింది. గూగుల్(దీని ఆధీనంలోనే యూట్యూబ్ ఉంటుంది) కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఛానెల్‌ని తీసివేస్తున్నట్టు బోల్తా హిందుస్థాన్‌కు తెలియజేయటం గమనార్హం. అయితే ఇందుకు ఎలాంటి కారణాలనూ అందించలేదు. "ప్రజాస్వామ్యంలో పారదర్శకత ప్రధానమైనది. బోల్తా హిందుస్థాన్‌పై చర్య తీసుకోవడానికి మంత్రిత్వ శాఖ, గూగుల్ వెంటనే ఆధారాలను అందించాలి.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి లేదా సంస్థకు పూర్తి కారణాలను అందించాలి అనేది చట్టంలో ప్రాథమిక సూత్రం" అని డీయూజే వివరించింది. రెండు నెలల క్రితం బోల్తా హిందుస్తాన్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా కూడా ఏకపక్షంగా తొలగించబడిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఐటీ చట్టంలోని నిబంధనలతో కేంద్ర బెదిరింపులకు పాల్పడుతున్నదని ఆరోపించింది.

జర్నలిస్టులకు వ్యతిరేకంగా.. అధికార బీజేపీ నాయకుడు, సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా ఈనెల 5న ఢిల్లీ హైకోర్టులో 'ఆర్టికల్-19'కి చెందిన యూట్యూబర్ నవీన్ కుమార్, నీలుపై పరువు నష్టం దావా వేసిన సందర్భాన్ని డీయూజే ఉదహరించింది.

ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తే జైలులో ఎంత మంది ఉంటారో ఊహించండి

- యూట్యూబ్‌లో వ్యక్తుల వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై అవమానకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై 2021లో అరెస్టయిన యూట్యూబర్‌కు బెయిల్‌ను రద్దు చేసే ఉత్తర్వును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. "ఎన్నికలకు ముందు, మేము యూట్యూబ్‌లో ఆరోపణలు చేసే ప్రతి ఒక్కరినీ కటకటాల వెనక్కి నెట్టడం ప్రారంభిస్తే, ఎంతమందికి జైలు శిక్ష పడుతుందో ఊహించండి" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. సీఎంపై ఆరోపణలు చేయటంపై తన బెయిల్‌ను రద్దు చేసిన మద్రాస్ హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ దురైమురుగన్ సత్తాయి దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన ముకుల్ రోహత్గీ గతంలో సత్తాయ్‌పై దాఖలైన రెండు ఎఫ్ఐఆర్‌లను ఎత్తి చూపారు.నిరసన ప్రదర్శనకు అనుమతి నిరాకరించిన తర్వాత సత్తాయ్, నామ్ తమిళర్ కట్చి పార్టీకి చెందిన ఇతర సభ్యులు కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించి సమావేశమయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో, సత్తాయి అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడనీ, ఫిర్యాదుదారు(డీఎంకే సభ్యుడు) ఆ ప్రసంగాన్ని చూశారన్నారు. మరొకరు ఒక యూట్యూబ్ ఛానెల్‌లో చూశారని వివరించారు.అయితే సత్తాయ్ తన స్వేచ్ఛను దుర్వినియోగం చేయలేదని కోర్టు పేర్కొన్నది. "ఈ కోర్టు అంతకుముందు మధ్యంతర బెయిల్‌ను కొనసాగించింది. అతను రెండున్నర సంవత్సరాలుగా బెయిల్‌పై ఉన్నాడు. బెయిల్‌ను రద్దు చేయడానికి మాకు ఆధారాలు లేవు. అందువల్ల మేము బెయిల్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తాము. బెయిల్ మంజూరు చేస్తూ మునుపటి ఆర్డర్‌ను పునరుద్ధరిస్తాం. సరిపోతుందని భావించినట్టయితే బెయిల్ రద్దుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు" అని సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పింది.

కర్నాటకలో నగదు ప్రవాహం

- ఎన్నికల ముందు రూ.5 కోట్ల డబ్బు స్వాధీనం
- 106 కిలోల నగలు కూడా..

న్యూఢిలీ : లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్నాటకలో నగదు ప్రవాహం విచ్చలవిడిగా జరుగుతున్నది. సోదాల్లో భాగంగా పోలీసులు బళ్లారిలోని కంబళి బజార్‌లోని హేమ జ్యువెలర్స్ దుకాణం యజమాని ఇంటిపై దాడి చేశారు. ఇందులో భాగంగా వారి నుంచి రూ.5.60 కోట్ల నగదు, 3 కిలోల బంగారం, 103 కిలోల వెండి ఆభరణాలు, 68 వెండి కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.7.6 కోట్లుగా ఉంటుందని తెలుస్తున్నది. నగల దుకాణం యజమాని నరేష్ సోనీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు హవాలా లావాదేవీకి సంబంధించినవిగా పోలీసులు అనుమానిస్తున్నారు.ఈ లావాదేవీలపై మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంకా ఎన్నికలకు కొన్ని రోజుల ముందే బళ్లారిలో ఇంత పెద్ద మొత్తంలో నగదు, బంగారు, వెండి ఆభరణాలు బయటపడటంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. ఇటీవల బీజేపీలో చేరిన గాలి జనార్ధన్, ఆయన కుటుంబం ప్రభావం బళ్లారిలో అధికంగా ఉంటుందనీ, అధికారులు మాత్రం ఇక్కడ ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

అది 2013... తన వైకల్యానికి సంబంధించి ధృవీకరణ పత్రం తీసుకునేందుకు క్యూలో నించుంది వీణా అంబరీష్. అప్పటికే మానసికంగా కుంగిపోయి వుంది. అయితే, తనతోపాటు లైన్‌లో ఉన్న వారిని చూసి ప్రేరణ పొందింది. నేనూ బతకాలి.. సాధించాలి.. అని నిర్ణయించుకుంది. బస్సు ప్రమాదం ఆమె జీవితాన్ని తలకిందులు చేసింది. ఆ తర్వాత ఆరు నెలలు ఆస్పత్రి పాలవటమేకాదు.. కుడి కాలు పాదం పై భాగం వరకూ తీసేశారు. అప్పుడు ఆమెకు 17 ఏండ్లు. ఎన్ని కష్టాలు ఎదురైనా నవ్వుతూనే సవాళ్లను ఎదుర్కొంటున్న అనేక మందిని ఆమె గమనించింది. ఆ సమయంలో ఒక దృఢ నిర్ణయం తీసుకుంది. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదనీ.. మనసుంటే మార్గముంటుందని.. తాను కోరుకున్న జీవితాన్ని కొనసాగించవచ్చుననీ, కన్న కలలను సాధించవచ్చునని నిర్ణయించుకుంది. ఆ విషయాలేంటో ఈ రోజు మానవిలో మీ కోసం...



కాలు పోయినా.. దృఢ నిశ్చయమే నిలబెట్టింది...

అందరిలాగే వీణ అంబరీష్‌దీ సంతోషకరమైన, బిజీ జీవితమే. 12వ తరగతి సైన్స్ విద్యార్థిని. భరతనాట్య నృత్యకారిణి. క్లాసికల్ డ్యాన్స్‌లో శిక్షణ పూర్తి చేసింది. రోజూ లాగే ఆ రోజూ ఎంతో ఉత్సాహంగా కాలేజీకి బయలుదేరింది. 2012 జులైలో విషాదం ఆమె జీవితాన్ని బస్సు ప్రమాదం రూపంలో వెంటాడింది. కాలేజీకి వెళ్లే దారిలో రోడ్డు దాటుతుండగా.. బీఎంటీసీ (బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్) బస్సు సిగ్నల్ జంప్ చేసి ఆమెను ఢీ కొట్టింది. 'బస్సు మొదట నన్ను తాకింది. నేను పడిపోయాను, ఆ తర్వాత నా కుడి కాలు మీదుగా టైర్ ఎక్కింది'. చాలా రోజులు ఆస్పత్రిలోనే గడపాల్సి వచ్చింది. ఆమె కుడి కాలు తీవ్రంగా దెబ్బతింది.

మూడు ఆపరేషన్లు

వైద్యులు శతవిధాలా ప్రయత్నించారు. మూడుసార్లు ఆపరేషన్ చేశారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. 'కుడి కాలు సరిచేయటానికి వైద్యులు నా ఎడమ తొడ నుంచి మాంసాన్ని తీసి అతికించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మూడుసార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు కొంత చర్మాన్ని అతికించారు. ఇక కాలులేకుండానే జీవిత ప్రయాణం తప్పదని చెప్పారు వైద్యులు. ఆ ప్రదేశం ఇప్పటికీ చాలా సున్నితంగా ఉంటుంది. బయటికి వెళ్లే ముందు ప్రతిరోజూ కట్టు కట్టుకోవాలి. ఆరు నెలలు మంచాన పడ్డాను' చెప్పింది వీణ. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత వాకింగ్ స్టిక్‌తో నడవటం మొదలు పెట్టింది ఆమె. మొదట్లో... తీవ్రమైన నొప్పితో అడుగేయటం చాలా కష్టంగా ఉండేది. మూడు ఆపరేషన్ల సమయంలోనూ వెన్నుకు అనస్థీషియా ఇచ్చారు. ఫలితంగా వెన్ను సమస్యలూ వెంటాడాయి.

మలుపు తిప్పిన ఘటన

వైకల్యానికి సంబంధించి సర్టిఫికెట్ తీసుకునేందుకు విక్టోరియా ఆస్పత్రికి వెళ్ళింది వీణ. అక్కడకు వచ్చిన వారిది ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. వారిని చూసి స్ఫూర్తి పొందింది. రెండు కాళ్లులేని ఓ మహిళ పసిపాపతో తమకూరు నుంచి వచ్చింది. ఆ మహిళ తన బిడ్డకు తినిపిస్తూ సంతోషంగా గడపటం చూసి వీణ విస్మయానికి గురైంది. ఆ మహిళ ముందు తన కష్టాలు చాలా చిన్నవిగా కనిపించాయి. 'ఆమె చాలా సంతోషంగా ఉంది. సాధారణ జీవితాన్ని గడుపుతున్నది. మరి నేనెందుకు చేయలేను' అనుకుంది. కోరుకున్నవన్నీ చేయగలనన్న నమ్మకం, విశ్వాసం వీణలో పెరిగింది.

చదువుపై దృష్టి

12వ తరగతి పూర్తి చేయాలనుకుంది. 2013 జనవరిలో బోర్డు పరీక్షలకు రెండు నెలల సమయం కూడా లేదు. తన తండ్రి సహాయంతో ట్యూషన్‌కు వెళ్లడం ప్రారంభించింది. పరీక్షల్లో మంచి మార్కులతో పాసైంది. సైన్స్ చదవటం కష్టమని భావించి కామర్స్‌కు మారింది. బెంగళూరు వంటి నగరంలో వైకల్యంతో కాలేజీకి వెళ్లడం కష్టం కాబట్టి, పుదుచ్చేరిలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి (బీబీఏ) డిగ్రీని పూర్తి చేసింది. అక్కడితో ఆగలేదు. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ)నూ అభ్యసించింది. బ్యాంక్‌లో సేల్స్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరింది. అక్కడ సరైన గౌరవం దక్కలేదు. ఐటీ కంపెనీలో ఉద్యోగంలో చేరింది. డెస్క్ ఉద్యోగం.. ఒత్తిడి ఎక్కువైంది. ఉదయం తొమ్మిది నుంచి ఆరు వరకు ఆఫీసు పని, ఆ తర్వాత రాత్రి 9:30 గంటలకు మీటింగులు.. ఒక్కోసారి అర్ధరాత్రి అయ్యేది. కాలు మీద ఒత్తిడి కారణంగా ఇన్ఫెక్షన్ ఎక్కువైంది. ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. 2023 ఫిబ్రవరిలో ఉద్యోగం మానేయాలని నిర్ణయించుకుంది. ఆహారం పట్ల తనకున్న అభిరుచితో సొంతంగా ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకుంది.



'డ్యాన్సే నా జీవితమనుకున్నాను. రోడ్డు ప్రమాదం తర్వాత డాన్స్ చేయలేనన్న బాధ నన్ను చాలా కుంగదీసింది. ఎక్కువ కష్టపడాలి కాబట్టి సైన్స్ కూడా చదవలేనని అర్థమైంది. నిరాశకు గురయ్యాను. నా జీవితంలో అన్నీ కోల్పోయాను... మానసికంగా కుంగిపోయాను. చచ్చిపోవాలనుకున్నాను. ఆత్మహత్యకూ ప్రయత్నించాను' అంటుంది వీణ.

బెంగుళూరులో అందుబాటులో లేని వాటిపై దృష్టి పెట్టింది. సాంప్రదాయకంగా మటన్ ఖీమాతో తయారుచేసే 'కరి దోస' తమిళనాడులోని మధురైలో ఫేమస్ వంటకం. అక్కడ దోసపైన ఆమ్లెట్, మటన్ కర్రీతో వెరైటీగా వేస్తారు. ఆమె 2023లో బెంగుళూరులోని జేపీ నగర్‌లో ఓ దోసె స్టాల్‌ని ప్రారంభించింది. దానికి 'కరి దోస' అని పేరు పెట్టింది. దీనికి ముందు వెరైటీ దోసెల రుచులను స్వయంగా చేస్తూ.. దాదాపు రెండు నెలలు పలు ప్రయోగాలు చేసింది. ఆమె ఉదయం 4:30 గంటలకు తన రోజును ప్రారంభిస్తుంది. స్టాల్ ఉదయం 7:30 నుంచి 11:30 వరకు తెరిచి ఉంటుంది. సాదా దోస ధర రూ.10, మటన్ కరి దోస ధర రూ. 150. సాదా దోసెతో మొదలైతే.. మటన్ కరి దోస, చికెన్ కరి దోస, రొయ్యల కరి దోస... ఇలా వివిధ దోస రకాలను రుచి చూసేందుకు స్థానికులు స్టాల్ ముందు ఓపికగా క్యూ కడతారు. వివిధ ప్రాంతాల నుండీ వస్తున్నారు. ఆమె ఫుడ్ స్టాల్ ముందు ఇప్పుడు ఉదయం పూట భారీ క్యూలే ఉంటాయి.

"కష్టాలు శాశ్వతం కాదు.. అవి ఎలాంటివైనా తట్టుకొని నిలబడాలి. వాటిని అధిగమించడానికి మార్గాలను కనుక్కోవాలి. మనకన్నా అధ్వాన్న పరిస్థితుల్లో వున్న వారిని ఒకసారి పరిశీలించండి.. వాళ్లే మీ స్టార్‌లు... పోరాటం చేయకుండా మనం ఏమీ సాధించలేం. జీవితమంటే అడ్డంకులను అధిగమించడమే" అంటున్న వీణకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.



చిరునవ్వుతో అందిస్తున్న ఆ దోసె తిని.. నిండైన కడుపుతో వెళతారు.

సొంతకాళ్లపై

ఫుడ్ స్టాల్ అంటే.. శారీరక శ్రమే కాదు, ఎక్కువ సమయం నిలబడే ఉండాలి. స్టాల్ పెట్టటానికి ముందు కుటుంబసభ్యులు ఇష్టపడలేదు. కాలు లేకపోయినా.. సొంతకాళ్లపై నిలబడాలని దృఢ నిశ్చయమే ఆమెను నిలబెట్టింది. 'నేను ఏదైనా సాధించాలనుకున్నాను. నా సొంత బ్రాండ్‌ను సృష్టించాలనుకున్నాను. నా పరిమితులను అధిగమించాలి. రోజూ ఎనిమిది గంటలపైనే డెస్క్ జాబ్ చేయగలిగిన నేను.. నాలుగు గంటలు ఎందుకు నిలబడలేను?' అనుకుంది. చివరికి తన కుటుంబాన్ని ఒప్పించగలిగింది వీణ. షాపింగ్, వంట, వడ్డన అన్ని పనులు ఆమే స్వయంగా చేసుకుంటుంది. వృత్తిరీత్యా ఫిట్‌నెస్ ట్రైనర్ అయిన ఆమె భర్త ప్రతిరోజూ బండిని సెటప్ చేయడంలో ఆమెకు సహాయం చేస్తున్నాడు. రోజుకు నాలుగు గంటలకు పైగా నిలబడటం వల్ల ఆమె కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నది. కానీ చేసే పనిలో సంతృప్తి, సంతోషం వీణను ముందడుగు వేయిస్తుంది. ఏసీ ఆఫీసులో ఉద్యోగం నుండి.. వీణ ఇప్పుడు బెంగళూరు వీధిలో.. విపరీతమైన పోటీతో కూడిన స్ట్రీట్ ఫుడ్ మార్కెట్‌లో ఎంతో ఉత్సాహంగా, విజయవంతంగా పనిచేస్తున్నది.

షడ్రుచుల సమ్మేళనం ఉగాది

తెలుగు వారి కొత్త సంవత్సరం 'ఉగాది'. ఈ పండుగ రోజు తినే పచ్చడికి ఎంతో ప్రత్యేకత ఉంది. దీని వెనుక చాలా కారణాలు ఉన్నాయి. ఉగాది పచ్చడి తింటే ఎంతో ఆరోగ్యం. తీపి, చేదు, వగరు, పులుపు, కారం, ఉప్పు కలిపి ఉగాది పచ్చడిని చేస్తారు. ఆరోగ్యంగా ఉండేందుకు ఈ షడ్రుచులు కలిపిన ఉగాది పచ్చడి తినాలని పెద్దలు చెబుతూ ఉంటారు. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఈ పచ్చడి ఇస్తుందంటారు. ఈ పచ్చడి తయారీ చూద్దాం...



అవసరమై పదార్థాలు: మామిడికాయ (ఓ మాదిరి పరిమాణం కలది)- 1
వేప పువ్వు- 1/2 కప్పు
సన్నగా తరిగిన కొబ్బరి ముక్కలు- 1/2 కప్పు
కొత్త చింతపండు- 100 గ్రాములు
కొత్త బెల్లం- 100 గ్రాములు
పచ్చిమిరపకాయలు- 2
అరటిపండ్లు - 2
ఉప్పు - సరిపడినంత
మిరియాల పొడి - కొద్దిగా

తయారీ విధానం: ముందుగా వేపపువ్వును కాడల నుంచి వేరు చేసి పెట్టుకోవాలి. చింతపండులో కొద్దిగా నీళ్ల పోసి నానబెట్టి పది నిమిషాల తర్వాత దాని గుజ్జును వేరుచేయాలి. మామిడికాయను, పచ్చిమిరపకాయలు, కొబ్బరిని సన్నగా తరగాలి. అరటి పండ్లను కూడా సన్నగా తరిగి పెట్టుకోవాలి. బెల్లాన్ని కూడా తురిమి పెట్టుకొని దాన్ని చింతపండు గుజ్జులో కలపాలి. ఈ మిశ్రమంలో మామిడికాయ ముక్కలు, తరిగిన కొబ్బరి, పచ్చిమిరపకాయ ముక్కలను వేసి చివరిగా ఒక అర స్పూను ఉప్పు, మిరియాలపొడి వేసి కలుపుకోవాలి. అంతే షడ్రుచుల ఉగాది పచ్చడి సిద్ధమైపోయినట్టే.

ఇట్ల చేద్దాం

ఒక కప్పు నీళ్లల్లో గుప్పెడు తులసి ఆకులు, కొద్దిగా మిరియాల పొడి వేసి బాగా మరిగించి అందులో కొద్దిగా తేనె లేదా పంచదార కలిపి వేడిగా త్రాగితే జలుబు, దగ్గు తగ్గుతాయి.

'జైల్ కా జవాబ్ ఓట్ సే'

(మొదటిపేజీ తరువాయి)

పోటీచేస్తున్న నాలుగు లోక్‌సభ స్థానాల్లోనూ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం సాగిస్తారని 'ఆప్' నేతలు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ మాట్లాడుతూ, కేజ్రీవాల్‌ను ఎన్నికలకు దూరంగా ఉంచాలనే ఆలోచనతోనే జైలుకు పంపిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. కేజ్రీవాల్ తన యావజ్జీవితం ప్రజల కోసమే పోరాడుతున్నారని తెలిపారు. ఢిల్లీ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి అందరికీ ఉత్తమ విద్య, ఆరోగ్యం, విద్యుత్, నీరు అందించేందుకు ఎంతో తపన పడుతున్నారని అన్నారు.

కేజ్రీవాల్ పీఏ, ఆప్ ఎమ్మెల్యేలను విచారించిన ఈడీ



ఢిల్లీ మద్యం స్కాంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు కొనసాగుతోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పీఏ వైభవ్ కుమార్, ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌ను సోమవారం విచారించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల కింద కుమార్ వాంగ్మూలాన్ని రికార్డ్ చేసింది. గతంలో కూడా వీరిద్దరినీ ఈడీ ప్రశ్నించింది. దుర్గేష్ పాఠక్ సోమవారం ఉదయం ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి చేరుకుని ఈడీ ముందు హాజరయ్యారు. 2022 సెప్టెంబర్‌లో ఆప్ నేత విజయ్ నాయర్ ఇంటిపై ఈడీ దాడులు నిర్వహించినప్పుడు దుర్గేష్ పాఠక్ అక్కడే ఉన్నారు. అప్పుడు పాఠక్ ఫోన్‌ను ఈడీ స్వాధీనం చేసుకుంది.

కేజ్రీవాల్ పిటీషన్‌పై నేడు తీర్పు

మనీలాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటీషన్‌పై ఢిల్లీ హైకోర్టు మంగళవారం తీర్పును వెల్లడించనుంది. మధ్యాహ్నం 2:30 గంటలకు జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఈ తీర్పును ప్రకటించనున్నారు. ఈ వివరాలను ఢిల్లీ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించారు. ఢిల్లీ మద్యం విధానం స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని ఛాలెంజ్ చేస్తూ కేజ్రీవాల్ ఈ పిటీషన్ వేశారు. అలాగే తనను ఇడి కస్టడీలో ఉంచడాన్ని కూడా కేజ్రీవాల్ ప్రశ్నించారు. అలాగే లోక్‌సభ ఎన్నికల సమయంలో తనను అరెస్టు చేయడాన్ని కూడా కేజ్రీవాల్ ప్రశ్నించారు. రాజ్యాంగం పేర్కొన్న స్వేచ్ఛాయుత, నిష్పాక్షితమైన ఎన్నికల నిర్వహణకు ఇది విఘాతం కలిగిస్తుందని కేజ్రీవాల్ ఆరోపించారు. ప్రస్తుతం కేజ్రీవాల్ తీహార్ జైల్లో ఇడి కస్టడీలో ఉన్నారు.

మేడిగడ్డపై న్యాయ విచారణ చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టును సోమవారం సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో విలేకర్ల సమావేశంలో వీరయ్య మాట్లాడారు. "దేశ చరిత్రలో నీటిపారుదల రంగానికి అత్యధిక నిధులతో నిర్మించిన ప్రాజెక్టు కాళేశ్వరం. అందులో మేడిగడ్డ, లక్ష్మీ బ్యారేజీ పూర్తైన కొద్ది కాలానికే కుంగిపోవడం నిర్మాణ లోపమా? డిజైన్ లోపమా? నాణ్యతా లోపమా? ఏమి జరిగిందో నిపుణులతో న్యాయవిచారణ చేపట్టాలి" అని డిమాండ్ చేశారు. తక్షణమే నిజానిజాలు తేల్చి రైతులకు న్యాయం చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అన్నీ తానై నిర్మించడం వల్లే మూడు పిల్లర్లు కుంగాయని అన్నారు. కమీషన్ల కోసం రీ డిజైన్ పేరుతో కాళేశ్వరం కట్టి ప్రజాధనాన్ని వృథా చేశారని చెప్పారు. గతంలో వైఎస్ ముఖ్యమంత్రి హయాంలో ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణంతో 100 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాప్‌కో కంపెనీ అధ్యయనంలో తెలిపిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అదే వ్యాప్ కో కంపెనీ అధ్యయనంలో 110 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి ఖర్చు అంచనా వ్యయం పెంచారని ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అధ్యయనంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రాజెక్టులో పూర్తి నీటిమట్టం ఉన్నప్పుడు పిల్లర్లు కుంగితే సమస్య తీవ్రత ఎక్కువ ఉండేదన్నారు. గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోయే పరిస్థితి ఉండేదని తెలిపారు. ఇదంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని రైతుల పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల్లో లబ్ది పొందడం కోసం వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కమీషన్ల కోసమే గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని ఆరోపించారు. లక్ష కోట్లతో నిర్మాణం చేపట్టినప్పుడు.. అఖిలపక్షంతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆలోచన చేసి.. నిపుణుల అభిప్రాయం తీసుకొని నిర్మించాల్సి ఉండేదని అన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టుపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జి.నాగయ్య మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేపట్టి నిజా నిజాలను ప్రజలకు వివరించాలన్నారు. నిపుణులు, ఇంజినీర్ల అభిప్రాయాలను తోసిపుచ్చి కేసీఆర్ అన్నీ తానై ప్రాజెక్టును డిజైన్ చేశారని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలను నీటిపాలు చేశారన్నారు. మే చివరి వారంలో ప్రాణహిత పై నుంచి వచ్చే నీటిని వినియోగించుకోలేని పరిస్థితిలో ఉన్నామని అన్నారు. నిపుణుల అధ్యయనం పూర్తి అయ్యేసరికి పుణ్యకాలం పూర్తవుతుందన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం 10 గ్రామాలను హుటాహుటిన తరలించారని గుర్తు చేశారు. ప్రజలు ఏడుస్తున్నా కనికరించలేదన్నారు. పేరు కోసం పాకులాడుతూ ప్రజల ఉసురు పంచుకున్న నాయకుడెవరు బాగుపడ్డట్టు చరిత్రలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వెలిశెట్టి రాజయ్య, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలేం రాజేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్మూరి శ్రీకాంత్, నాయకులు సూదుల శంకర్, ఆకుదారి రమేష్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాల్లేకుండా మాట్లాడతారా ?

- రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలి :

కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆధారాల్లేకుండా మాట్లాడినందుకు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని బీఆర్ఎస్ కోరింది. ఈ అంశంలో ఎన్నికల నియామావళిని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన రాహుల్ గాంధీని ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ లేఖ రాసింది. తుక్కుగూడ సభలో తమ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ పైన చేసిన వ్యాఖ్యల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.

ఎన్నికల నియమావళి ప్రకారం ఇతర పార్టీల విధానాల పైన మాత్రమే మాట్లాడాలి గానీ, వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, అడ్డగోలుగా మాట్లాడకూడదంటూ స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని గుర్తు చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండానే కేసీఆర్ ప్రస్తావనను టెలిఫోన్ ట్యాపింగ్ అంశంతో ముడిపెట్టారని పేర్కొంది. పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేసి, వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేశారని, ఫోన్ టాపింగ్ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందారంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఖండించింది. ఈ మేరకు ఆయన చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను బీఆర్ఎస్ తన ఫిర్యాదుకు జతపరిచింది. ఇదే ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖ పైన కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి మరొక ఫిర్యాదును ఆ పార్టీ పంపింది.

ఈసీ విశేషాధికారాలతో ఐటి అధికారులను ఆదేశించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలను నిలుపుచేయాల్సిందిగా ఐటీ అధికారులను ఆదేశించాల్సిందిగా ఆయన కోరారు. రాజ్యాంగంలోని 324 అధికరణ కింద ఎన్నికల కమిషన్‌కు కల్పించిన అధికారాలను ఇందుకోసం ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. కేంద్ర సంస్థ చర్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువస్తూ ఇటీవల కాలంలో లేఖ రాయడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు.

పార్టీ జిల్లా కమిటీ అకౌంట్‌కు ఐటి నోటీసులు జారీ చేయడం పూర్తిగా అక్రమమని, ఖండించదగ్గదని ఏచూరి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ అన్ని శాఖల ఖాతాలతోపాటూ ఈ శాఖ ఖాతా వివరాలను కూడా ఇప్పటికే చట్టానికి అనుగుణంగా ఐటీ శాఖకు, ఎన్నికల కమిషన్‌కు అందజేశామని, అవి వారి వెబ్‌సైట్‌ల్లో కనిపిస్తున్నాయని కూడా చెప్పారు.

ఏడాది కాలంగా వీటిపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని చెప్పారు. పైగా పన్నుల చట్టాలకు అనుగుణంగా వ్యవహరిస్తుందన్న రికార్డు సీపీఐ(ఎం)కు వుందంటూ గతంలో అనేకసార్లు ఐటీ అథారిటీ ప్రశంసించిన విషయాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవడం సందర్భోచితమని ఏచూరి గుర్తు చేశారు. ఎన్నికల కమిషన్‌కు గతంలో అందచేసిన వివరాలే ఇవని అన్నారు. పైగా, ఏ చట్ట ప్రకారమైన నిబంధనల ప్రకారం అవసరం లేకపోయినప్పటికీ ప్రజా జీవితంలో నిజాయితీకి నిదర్శనంగా వుండేందుకు సీపీఐ(ఎం) ఈ వివరాలను తన వెబ్‌సైట్‌లో పెడుతోందని చెప్పారు. కేరళలో సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌కు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే ఎన్నికల ప్రక్రియప్రారంభం కాగానే ఈ చర్య తీసుకుందన్నది వాస్తవమని ఏచూరి తన లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల క్రమం పూర్తయ్యేవరకు ఏ బ్యాంక్ ఖాతాల స్తంభన అంశాల గురించి మాట్లాడబోమని ఇంతకుముందే, మరో పన్ను చెల్లింపునకు సంబంధించిన విషయంలో ఐటీ అథారిటీ సుప్రీంకోర్టుకు తెలియజేసిందని చెప్పారు. ఇటువంటి ఆక్షేపణీయమైన చర్య చేపట్టడానికి ముందుగా అమోదం కోసం ఈసీని ఐటీ అథారిటీ సంప్రదించిందా లేదా అన్నది తమకు తెలియదని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, ఎన్నికల నిబంధనావళి కూడా అమల్లోకి వచ్చేసినందున, ఐటి అథారిటీ తీసుకున్న ఈ చర్య స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలన్న లక్ష్యాన్ని, అన్ని పార్టీలకు గల సమాన అవకాశాలను ఉల్లంఘించినట్లవుతుందని పేర్కొన్నారు. త్రిస్సూర్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీ చేయడం కేవలం యాధృచ్ఛికమేనా? అని ఆయన ఆ లేఖలో ప్రశ్నించారు. అందువల్ల, ఎన్నికల కమిషన్‌కు గల విశేషాధికారాలను ఉపయోగించుకుని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఐటి నోటీసుల చర్యలను నిలుపుచేస్తూ ఐటీ అధికారులను ఆదేశించాల్సిందిగా ఏచూరి ఆ లేఖలో కోరారు.

ఐరీస్ తిప్పలు..!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తారు. ఇంతకుముందు కుటుంబంలో ఎవరో ఒకరు ధాన్యం తూకం వేసే సమయంలో ఉండి ఆధార్ నెంబర్, ఓటీపీ చెబితే సరిపోయేది. కొత్త విధానం వల్ల రైతే మార్కెట్‌కు వెళ్లి ఐరీస్ ఇవ్వాలి. టోకెన్ పద్ధతిలో ధాన్యం ఎప్పుడు కాంటా వేస్తారో తెల్వని పరిస్థితుల్లో రైతు కళ్లాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తది. కౌలు రైతు యజమాని నుంచి ఒప్పంద వివరాలివ్వాలి. లేదంటే ధాన్యం అమ్ముకోలేరు.రాష్ట్రంలో యాసంగి వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ ఇతర జిల్లాల్లో ధాన్యం మార్కెట్‌కు వస్తోంది. ఈ సీజన్‌లో నీటి ఎద్దడి వల్ల ధాన్యం దిగుబడులు తగ్గే అవకాశముంది. రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖ ద్వారా గతేడాది యాసంగిలో 66.85 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ సీజన్‌లో 60.70 లక్షల టన్నుల ధాన్యమే సేకరించే అవకాశముంది. ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏడు వేల కొనుగోలు కేంద్రాలు పెట్టనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో యాసంగి సీజన్‌లో 7.46 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 800 కేంద్రాలు పెట్టి 6.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేయనున్నారు.

కొత్తగా ఐరీస్ విధానం

ధాన్యం కొనుగోలు విధానంలో పౌర సరఫరాల శాఖ కొత్తగా ఐరీస్ విధానాన్ని అమలు చేస్తుంది. గతంలో రైతు ధాన్యాన్ని విక్రయించేందుకు ఆధార్ నంబర్ ఇచ్చేవారు. ఆ నెంబర్‌ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయగానే రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. దానిని ట్యాబ్‌లో నమోదు చేసి ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేది. ఈ విధానం వల్ల కొందరు దళారులు సైతం రైతుల పేరిట ధాన్యం విక్రయాలు చేసిన పరిస్థితి ఉంది. మిల్లర్లు, వ్యాపారులు దళారుల ద్వారా బినామీ రైతుల పేరిట ధాన్యం అమ్మకాలు జరిపి అక్రమాలకు పాల్పడిన ఉదంతాలు రాష్ట్రంలో అనేక చోట్ల వెలుగు చూశాయి. అందుకే ఈ సీజన్ నుంచి కొత్తగా ఐరీస్ పద్ధతిని తీసుకొచ్చారు. ధాన్యం పండించిన రైతు మార్కెట్‌కు ఖచ్చితంగా రావాలి. ధాన్యాన్ని కాంటా వేసిన తర్వాత సెంటర్ నిర్వాహకులు రైతు ఐరీస్‌ను తీసుకుంటారు. ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయడం ద్వారా వచ్చే ఓటీపీతోపాటు అదనంగా ఐరీస్‌ను కూడా ట్యాబ్‌లో నమోదు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. అన్ని సెంటర్లకు కూడా ఐరీస్ పరికరాల్ని అందజేశారు. ఐరీస్ విధానం గురించి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.

కౌలు రైతులు ఒప్పంద పత్రాలు చూపేదెట్ల..

ఐరీస్ నమోదు విధానం కౌలు రైతులకు కొత్త తిప్పలు తెచ్చింది. రాష్ట్రంలో 40 శాతానికి పైగా పంట భూముల్ని కౌలు రైతులు సాగు చేస్తున్నారు. కౌలుదారి రక్షిత చట్టం అమల్లో ఉన్నందున భూమి యజమానులెవ్వరూ కౌలుదారులకు ఒప్పంద పత్రాలు రాసి ఇవ్వడం లేదు. పరస్పర అంగీకారంతోనే కౌలు విధానం కొనసాగుతుంది. తాజాగా ప్రభుత్వం తెచ్చిన ఐరీస్ విధానంలో కౌలు రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలంటే ముందుగా పట్టాదారుతో రాసుకున్న కౌలు ఒప్పంద పత్రాల వివరాల్ని మండల వ్యవసాయ విస్తరణాధికారికి ఇవ్వాలి. ఎవరి భూమిని కౌలుకు తీసుకున్నారో వివరాలను నమోదు చేయించాలి. ఆ వివరాలను ఎఈఓ ఓపీఎంఎస్ (ఆన్‌లైన్ పొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో నమోదు చేస్తారు. తద్వారా కౌలు రైతు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశముంటది. అయితే రాష్ట్రంలో కౌలు విధానానికి చట్టబద్దత లేదు. వ్యక్తుల మధ్య ఉన్న సంబంధాలను బట్టి కౌలు సాగు కొనసాగుతోంది. సీజన్ ప్రారంభానికి ముందే చెబితే ఒప్పందం చేసుకునే వీలుంటుంది. యాసంగి సీజన్ ముగింపులో ఒప్పంద వివరాలు ఇవ్వడం ఎలా సాధ్యమని కౌలుదారులు ప్రశ్నిస్తున్నారు.

కళ్లాల్లోనే రైతు పడిగాపులు

ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకెళ్లాలి. తేమ లేకుండా ఆరబోసుకుని శుభ్రం చేయాలి. గ్రేడ్-ఏ, సాధారణ రకాలకు వేర్వేరు ధర ఇస్తారు. ధాన్యం శుభ్రం చేశాక సెంటర్ నిర్వాహకులు రైతుకు టోకెన్ నెంబర్ ఇస్తారు. సీరియల్ ప్రకారం కాంటా వేస్తారు. వారాల తరబడి ధాన్యం కాంటాకు నోచుకోక రైతులు మార్కెట్‌లో ఉండాల్సి వస్తోంది. ధాన్యం కాంటా వేసే సమయంలో రైతు తప్పకుండా సెంటర్‌కు రావాలనే షరతు పెట్టడంతో కళ్లాల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వ్యాపారుల వైపు రైతుల మొగ్గు

రైస్ మిల్లర్లు, వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. నీటి ఎద్దడి వల్ల వరి పైర్లు ఎండిపోయాయి. దీంతో ధాన్యం దిగుబడుల్లో తాలు, ఇతర వేస్టేజి అధికంగా ఉంటుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే తేమ, తాలు, చెత్త లేకుండా ఉండాలి. అయినా బస్తాకు 3- 5 కిలోల వరకు తరుగు తీస్తారు. హమాలీ చార్జీలు చెల్లించాలి. వీటికి తోడు ఐరీస్ తిప్పలు రావడంతో కొందరు రైతులు కోత కోయగానే నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. వారం పది రోజుల ఒప్పందంతో డబ్బులు తీసుకుంటున్నారు.

దళారుల్ని అరికట్టేందుకే ఐరీస్

కె.వనజాత, జిల్లా పౌర సరఫరాల అధికారి, సంగారెడ్డి

ధాన్యం కొనుగోళ్ల విషయంలో దళారులు అక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకే ఐరీస్ విధానం. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం తెచ్చి ఇక్కడి కేంద్రాల్లో విక్రయించడానికి వీలుండదు. మిల్లర్లు, వ్యాపారులు బినామీ రైతుల పేరిట ధాన్యం తెచ్చి మద్దతు పొందడం కూడా ఉండదు.

94 మంది జల సమాధి

(మొదటిపేజీ తరువాయి)

పడవలో ఎక్కించుకోవడంతో ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో 94 మంది ప్రాణాలు కోల్పోయారని నంపులా ప్రావిన్స్‌కు సంబంధించిన స్టేట్ సెక్రటరీ జైమ్ నెటో వెల్లడించారు. బాధితుల్లో చాలా మంది చిన్నారులు ఉన్నట్లు చెప్పారు. సహాయక సిబ్బంది ఐదుగురిని ప్రాణాలతో రక్షించారని, మిగతా వారి కోసం గాలిస్తున్నారని తెలిపారు.

ప్రపంచంలో అత్యంత పేదదేశాల్లో ఒకటైన మొజాంబిక్‌లో అక్టోబర్ నుంచి దాదాపు 15,000 కలరా కేసులు నమోదయ్యాయి. 32 మరణాలు సంభవించాయి. ఎక్కువగా నంపులా ప్రావిన్స్ ప్రభావితమైంది. పడవ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

హైదరాబాద్‌కు కాళేశ్వరం జలాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించిన మల్లన్నసాగర్, హైదరాబాద్ నగరవాసులను ఆదుకోబోతున్నదని తెలిపారు. త్వరలో మల్లన్న సాగర్ 100 ఎంఎల్ డీల నీళ్లతో హైదరాబాద్ దాహాన్ని తీర్చనున్నాయంటూ ఒక వార్తా కథనాన్ని ఆయన ట్వీట్‌కు ట్యాగ్ చేశారు.

నవచిత్రం


అల్లు అర్జున్

అదే ఫైరూ.. అదే జోరూ

ప్రపంచవ్యాప్తంగా సినిమా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం 'పుష్ప:2 ది రూల్'. 'పుష్ప ది రైజ్'తో ప్రపంచ సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకోవడమే ఇందుకు కారణం. ఈ చిత్రంలో అల్లు అర్జున్ నటనకు, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభకు అందరూ ఫిదా అయిపోయిన సంగతి తెలిసిందే.

ఈ ఇద్దరి కలయికలో రాబోతున్న 'పుష్ప-2 ది రూల్'పై ప్రపంచవ్యాప్తంగా ఆకాశమే హద్దుగా అంచనాలు ఉన్నాయి. సోమవారం అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. ఈ టీజర్ అందరికీ పూనకాలు తెప్పిస్తోంది. ఈ టీజర్‌లో అల్లు అర్జున్ గంగమ్మ జాతర గెటప్‌లో వీర మాస్ అవతార్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇంతకు ముందు టాలీవుడ్‌లో ఏ హీరో కనిపించని విధంగా ఊర మాస్ అవతార్‌లో కనిపించి.. సినిమాపై అమాంతం అంచనాలను పెంచేశారు. గంగమ్మ జాతరలో వచ్చే సన్నివేశంతో టీజర్ కట్ చేసిన విధానం.. అందరినీ మెస్మరైజ్ చేస్తోంది.

అల్లు అర్జున్ ఇందులో చీరకట్టి.. కాలు వెనక్కి మడిచి పైట కొంగుని అందుకున్న తీరు చూస్తుంటే.. 'పుష్ప2: ద రూల్' అస్సలు తగ్గేదేలే అన్నట్లుగా ఉండబోతుందనే హింట్‌ని ఇచ్చేస్తోంది. ఇందులో అల్లు అర్జున్ లుక్, యాటిట్యూడ్, దేవిశ్రీ ప్రసాద్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్.. ప్రపంచ సినీ ప్రేక్షకులంతా మరోసారి పుష్పరాజ్ గురించి మాట్లాడుకునేలా చేస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఈ పార్ట్ 2లో అల్లు అర్జున్ విశ్వరూపం చూడబోతున్నారనేది ఈ టీజర్‌తో మరోసారి సుస్పష్టమైంది.

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి కథ-కథనం-దర్శకత్వం: సుకుమార్, నిర్మాతలు: నవీన్ ఏర్నేని, వై రవిశంకర్, సినిమాటోగ్రాఫర్: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: రామకృష్ణ - మోనిక నిగొత్రే, లిరిసిస్ట్: చంద్రబోస్, సీఈఓ: చెర్రీ, బ్యానర్స్: మైత్రి మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్.

హను రాఘవపూడితో ఫిక్షనల్ పీరియాడిక్ ఫిల్మ్

'సీతారామం' హ్యూజ్ బ్లాక్‌బస్టర్‌తో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న దర్శకుడు హను రాఘవపూడి తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశారు. ప్రభాస్‌తో యాక్షన్ అంశాలతో ఉండే ఫిక్షనల్ పీరియాడిక్ చిత్రాన్ని హను రాఘవపూడి తెరకెక్కించబోతున్నారు.

వరంగల్‌లోని ఎన్ఐటీలో జరిగిన ఓ కార్యక్రమంలో హను రాఘవపూడి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ ప్రభాస్‌తో తన సినిమా గురించి అఫీషియల్ అనౌన్స్ మెంట్ చేశారు. 'ప్రభాస్‌తో నా నెక్ట్స్ చిత్రం హిస్టరీ ఆల్టర్నేటివ్ నెరేటివ్‌తో కూడిన పీరియాడికల్ యాక్షన్' అని అన్నారు ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్న విశాల్ చంద్రశేఖర్ ఇప్పటికే మూడు పాటలను కంపోజ్ చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ డెడ్లీ కాంబినేషన్‌లో ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో తెలియ జేయనున్నారు.


ప్రభాస్

బిచ్చగాడు రేంజ్‌లో హిట్ ఖాయం



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'లవ్ గురు'. మృణాళిని రవి హీరోయిన్. ఈ సినిమాను విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ నిర్మించారు. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ సినిమాను రంజాన్ పండుగ సందర్భంగా ఈనెల 11న విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వినాయక్ వైద్యనాథన్ మాట్లాడుతూ, 'ప్రేమ ద్వారా ఈ యూనివర్స్‌లో ఏదైనా సాధ్యమే అనే అంశాన్ని ఈ కథలో చెబుతున్నాం' అని తెలిపారు.

'ఈ సినిమాను రీసెంట్‌గా చూశాం. చాలా బాగుంది. ప్రతి సీన్ కొత్తగా ఉంది. విజయ్ ఆంటోనీ, మృణాళిని మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. తమిళంలోనే కాదు తెలుగులోనూ ఈ సినిమా మంచి హిట్ అవుతుంది' అని అన్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ శశి మాట్లాడుతూ, 'ఈ కథలో ప్రేక్షకులు ఇష్టపడే అన్ని ఎమోషన్స్ ఉన్నాయి' అని చెప్పారు. హీరోయిన్ మృణాళిని రవి మాట్లాడుతూ,'లీల క్యారెక్టర్‌లో నటించాను. నా కెరీర్‌లో లభించిన గొప్ప క్యారెక్టర్ ఇది' అని తెలిపారు.

'మైత్రీ మూవీ వారితో అసోసియేట్ కావాలనేది నా డ్రీమ్. ఈ కథ విన్నాక ఇది నా కెరీర్‌లో బిచ్చగాడు తర్వాత అంత పెద్ద హిట్ అవుతుందని దర్శకుడు వినాయక్‌కు చెప్పాను. అది నిజం కాబోతున్నందుకు సంతోషంగా ఉంది' అని హీరో విజయ్ ఆంటోనీ చెప్పారు.

నవ్విస్తూనే భయపెడతా..

అంజలి నటించిన 'గీతాంజలి' ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం "గీతాంజలి మళ్లీ వచ్చింది" చిత్రం మీద అందరి దృష్టి పడింది.

ఈ చిత్రాన్ని శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవివి సినిమాస్‌తో కలిసి కోన ఫిల్మ్ కార్పొరేషన్‌పై కోన వెంకట్ నిర్మించారు. అంజలికి ఇది 50వ చిత్రం. హర్రర్ కామెడీ జోనర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని ఈనెల 11న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా అంజలి మీడియాతో మాట్లాడుతూ

- గీతాంజలి సినిమాను తెరకెక్కించింది డెబ్యూ డైరెక్టర్. అలాగే ఇప్పుడు సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తుంది డెబ్యూ డైరెక్టర్. ఈ సినిమా విషయానికి వస్తే డైరెక్టర్ శివ తుర్లపాటి కొరియోగ్రాఫర్. దీంతో ఆయనకు షాట్ డివిజన్ మీద అవగాహన ఉంది. కాబట్టి డైరెక్షన్ చేయటం కష్టం కాదు. అయితే ఛాలెంజింగ్ సీక్వెల్ కాబట్టి ఆయన తన 100 పర్సెంట్ ఇచ్చారని నమ్ముతున్నాను.
- ఇప్పటి వరకు నేను చేయనటువంటి పాత్రలను, ఢిఫరెంట్ మూవీస్ చేస్తూ వస్తున్నాను. క్లైమాక్స్‌లో యాక్షన్ కూడా చేశాను. రొటీన్‌గా చేస్తే నటిగా నాకు కూడా ఆసక్తి ఉండదు. కాబట్టి వీలైనంత కొత్తగా ఉండాలనే చూస్తాను. శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్ సహా అందరికీ ఓ కామెడీ టైమింగ్ ఉంది. సునీల్‌తో కలిసి నేను చేస్తున్న సినిమా ఇది. వింటేజ్ సునీల్‌ని చూడొచ్చు. సత్య కూడా అంతే. అందరూ కలిసి ప్రేక్షకులను నవ్వించే ప్రయత్నం చేశాం.
- గీతాంజలి సినిమాలో తగినంత హర్రర్, తగినంత కామెడీ ఉంటుంది. అందుకనే ఆ సినిమా రిలీజ్ కాగానే ఆడియెన్స్ దాన్ని చక్కగా రిసీవ్ చేసుకున్నారు. ఇప్పుడు గీతాంజలి మళ్ళీ వచ్చింది సినిమా విషయానికి వస్తే, మూవీ ఫ్లేవర్ మార్చలేం. సాంకేతికంగా కొత్తగా ఉంటుంది. హర్రర్ కామెడీని బ్యాలెన్స్ చేస్తూ తెరకెక్కించాం.
- నాకు ఉగాది పండుగ అంటే చాలా ఇష్టం. ఈ ఉగాదికి ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. పైగా ఇది నా 50వ సినిమా కావటం హ్యాపీగా ఉంది. దీన్ని అందరూ గుర్తు చేస్తుంటే ఓ బాధ్యతగా అనిపిస్తోంది. ఈ జర్నీని బాగా ఎంజాయ్ చేస్తున్నాను.


అంజలి

అందరూ రిలేట్ చేసుకునే కథ

జివి ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ నటించిన ఫ్యామిలీ కామెడీ డ్రామా 'డియర్'. ఈ చిత్రానికి ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. నట్మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని ఆంధ్రా ప్రాంతంలో విడుదల చేయనుండగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణలో విడుదల చేయనుంది. ఈ చిత్రం తమిళంలో ఈనెల 11న, తెలుగులో ఈనెల 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. హీరో జివి ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ, 'ఇది అందరూ రిలేట్ చేసుకునే సినిమా. మంచి ఎమోషన్స్ ఉంటాయి' అని అన్నారు. "డియర్ అద్భుతమైన కంటెంట్ ఉన్న సినిమా. ఇందులో నా పాత్ర నా మనసుకు ఎంతో దగ్గరైనది. దర్శకుడు చాలా అద్భుతంగా ఈ సినిమాని తీశారు. సినిమా చూసిన తర్వాత చిరునవ్వుతో బయటికివస్తారు ప్రేక్షకులు' అని హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ చెప్పారు. చిత్ర దర్శకుడు ఆనంద్ రవిచంద్రన్ మాట్లాడుతూ, 'గురక పెట్టడం ప్రతి ఇంట్లో సమస్య. ఈ దీనిపై కథ రాయడం చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ఇదొక ఫన్ ఫ్యామిలీ డ్రామా. అందరూ రిలేట్ చేసుకుంటారు' అని అన్నారు.


ఐశ్వర్య రాజేష్, జీవీ ప్రకాష్‌కుమార్

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886